వాసుల్ గత వారం చర్చల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 154 పేజీలు: 8+4 వెల: 6.50



రూ.52వేల కోట్లతో రక్షణరంగ కొనుగోళ్లు
అయోధ్య ట్రస్టు లావాదేవీల రీఆడిట్
5లో


# 'ఉక్కు' సంకల్పం సాకారం

## జమ్మలమడుగులో ఉక్కు కర్మాగార పనులను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### ఇక సీమ కరవు నేలకాదు..జలకళ ప్రాంతం

### రూ.16,350కోట్ల పెట్టుబడితో రెండుదశల్లో విస్తరణ

### సోలార్ ఎనర్జీలో మరిన్ని ప్రాజెక్టులు: సిఎం



శుక్రవారం జమ్మలమడుగులో ఉక్కుకర్మాగార పనులను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**జమ్మలమడుగు, జులై 3, ప్రభాతవార్త:** ఎట్టకేలకు దశాబ్దం తర్వాత ఉక్కు సంకల్పం నెరవేరింది రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జమ్మలమడుగు మండలంలో 16,350కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మకమైన జేసడబ్ల్యు రాయలసీమ ఉక్కు కర్మాగార పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాయలసీమ స్టీల్‌ప్లాంట్ నిర్మాణంకోసం దశాబ్దకాలం పాటు ఎదురు చూశామని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరుతోందన్నారు. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, సీమ అంటే స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్-రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా కార్లు, హీరో బైక్, డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ సీమ అంటే ఇకపై కరవు నేలకాదు జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతమన్నారు. విభజన తరువాత అవాంతరాలు, అడ్డంకులు, అవమానాలు దాటుకొని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారం భించామన్నారు. రాయలసీమ ప్రజలందరికి మరొకసారి శుభాకాంక్షలు >>2

## ఇంటికో పారిశ్రామికవేత్త

### కుప్పం నుంచే మొదలు: సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నామని అభివృద్ధి, స ంక్షేమం, సుపరిపాలనే తమ లక్ష్యమని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం పొగురుపల్లి పారిశ్రామికవాడ వద్ద 3వేల కోట్లకు పైగా పెట్టుబడులతో వచ్చిన అతా గ్రూప్, అడిడాస్ షూ కంపెనీ, పయనీర్ ఆంప్స్ తదితర కంపెనీలకు శంకుస్థాపన చేశారు. 200కోట్లతో రూపుదిద్దుకున్న ఏబీస్ ప్రోటీన్ కంపెనీని, 44 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కును సిఎం ప్రారంభించారు.పలుసంస్థలతో >>2



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీ ఇచ్చిన విందులో సంతూర్ వాయిస్తున్న జపాన్ ప్రధాని సనాయే తకాయిచి

## జపాన్ ప్రధానికి మోడీ 'సాంస్కృతిక విందు'

### సంతూర్ వాయించిన తకాయిచి

### 10 బిలియన్ డాలర్ల జపాన్ పెట్టుబడులు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జులై 3:** భారత్ జపాన్ దేశాల మధ్య పెట్టుబడి భాగస్వామ్యం క్రమంగా బలపడుతోందని మోడీ అన్నారు. గడిచిన యేడాది కాలంలో సుమారు 120 కొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ పెట్టుబడులు భారతదేశానికి రానున్నాయని స్పష్టం చేశారు. ఫైనాన్షి యల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఒప్పందం, మూలధనం, పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని మోడీ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని హైదరాబాద్ భవన్‌లో జరిగిన ప్రత్యేక భేటీ అనంతరం మోడీ జపాన్ ప్రధాని సనాయే తకాయిచి గౌరవార్థం విందు ఇచ్చారు. ముందుగా జరిగిన భేటీలో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, బయో >>2

# గవర్నర్‌తో డి.సిఎం పవన్ భేటీ



శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన డి.సిఎం పవన్

### రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, ఈగల్ ఐజి నివేదికపై గవర్నర్ నజీర్‌కు వివరణ

### సోషల్ మీడియా దుర్వినియోగంపైనా ప్రస్తావన

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ సయ్యద్‌అబ్దుల్ నజీర్‌తో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో పాటు ఈగల్ ఐజీ రవికృష్ణ అందించిన రిపోర్ట్‌ను అబ్దుల్ నజీర్ దృష్టికి పవన్ తీసుకెళ్లారు. సోషల్ మీడియాలో పోస్టులు, రెచ్చగొట్టే ప్రసంగాలు, కులమత విద్వేషాలు వ్యాఖ్యలను గవర్నర్‌కుపవన్ కల్యాణ్ వివరించినట్లు సమాచారం.సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తిగత కేంద్రీకరించి పోస్టింగులు పెట్టడం,పోలీసు పరంగా ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలను డీసీఎం పవన్ కల్యాణ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్‌అబ్దుల్ నజీర్‌కు వివరించినట్లు సమాచారం, సోషల్ మీడియా వేధింపులు, ట్రోలింగ్ అంశాలతోపాటు మహిళలను టార్గెట్ చేస్తూ అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను ఉప ముఖ్యమంత్రి ఈగిల్ నివేదిక ద్వారా గవర్నర్ వివరించారు. గంజాయి, డ్రగ్స్ అణచివేతకు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ పవన్‌కు వివరించారు.కీలకంగా పర్యావరణం,వన్య ప్రాణ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరిం చారు.ఇటీవల 18నగర వనాలను అభివృద్ధి చేసి, ప్రారంభించామని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో అభివృద్ధి గురించి వివరించారు.గవర్నర్ డీసీఎం ఆరోగ్య సమస్యలను గురించి అడిగి, తగిన శ్రద్ధతీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యంపట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. సామాజిక మాధ్య మం అనే అంశాలు తెలుసుకోవడానికి, ఒకరితో ఒకరు అను సంధానం అవ్వడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, శక్తి వంతమైన వేదికలామారిందని చెప్పారు. ఈ పేరుతో కొం దరు వాక్‌స్వాతంత్రాన్ని దుర్వినియోగం చేయటాన్ని ఆయన తప్పుబట్టారు. వాక్ స్వాతంత్రం అపరిమితమైన హక్కు కాదని, పరిమితులు ఉన్నాయని పవన్ పేర్కొన్నారు. ఎదు టివారి హక్కులకు భంగం కలిగించినప్పుడు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అంటే ఫ్రీడమ్ టు అబ్యూస్ కాదని స్పష్టంచేశారు. కొన్నేళ్లుగా సోషల్ మీడియా దుర్వినియోగం, ఆందోళన కలిగించే స్థా యికి చేరుకుందని తెలిపారు. చాలా మంది ఫేక్ అకౌంట్స్ వెనక దాక్కొని వ్యక్తిగత దూషణలు, పరువు తీసే ప్రయ త్నాలు, ఫేక్ ప్రొపగాండా, మార్ఫింగ్ ఫోటోలు, ఆర్గనైజ్డ్ హరాస్మెంట్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చివరికి దేవుళ్లని, దేవతలపైనా ఉద్దేశపూర్వకంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సోషల్ మీడి యా దుర్వినియోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ వెల్లడించారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించేం >>2

## కొత్తగా మూడు పోలీసు కమిషనరేట్లు

### తిరుపతి, గుంటూరు, రాజమండ్రిలో ఏర్పాటు

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొత్తగా మూడు పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత మెరుగుపరచడం,పోలీసు వ్యవస్థను ఆధునికీకరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మరో మూడు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల పోలీస్ విభాగాలను కమిషనరేట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. పెరుగుతున్న జనాభా, నగరాల విస్తరణ, అదేవిధంగా నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఈ ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. జిల్లాల వారీగా ఉన్న పోలీస్ యంత్రాంగాన్ని కమిషనరేట్ స్థాయికి పెంచడం ద్వారా మరింత మెరుగైన రక్షణ, వేగవంతమైన సేవలు ప్రజలకు అందుతాయని >>2





## ఎసిబి వలలో మరో అవినీతి 'చేప'

### రూ.3లక్షల లంచం తీసుకొంటూ పట్టుబడిన తిరుపతి జిల్లా మత్స్యశాఖ డిడి రెడ్డన్న

**తిరుపతి,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వపరంగా లబ్ధిదారులకు అందించే రాయితీని పొందడానికి ఏకంగా ప్రభుత్వ అధికారి 3లక్షలు రూపాయలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ తిరుపతి ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. 30లక్షలు రూపాయలు రాయితీకోసం 3లక్షలు లంచం ఇవ్వాల్సి రావడంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉన్నతాధికారి అవినీతి తిమింగళం అవినీతి వెలుగుచూసింది. ఎసిబి అధికారులు తెలిపిన వివరాలమేరకు చంద్రగిరి నియోజకవర్గం మల్లం గుంటలో నివాసముంటున్న సుభాన్ భార్య హిమబిందు పేరున 50లక్షలు రూపాయలు అంచనాతో >>2

# లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొత్త రూపు



### పదేళ్ల నిర్వహణకు 4,500కోట్లతో టెండర్లు

### శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు, పది సంవత్సరాలుపాటు నిర్వహణ పనుల కోసం 4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లిపో యాడన్నారు.పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడు అన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడింది అన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయి అన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2021 నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీంపనిచేయపోవటానికి వైసిపి ప్రభుత్వ నిర్వాకమే కారణమని ఆయన అన్నారు. 15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పున రుద్ధరణ పనులు పూర్తి అయితే జగ్గయ్యపేట, >>2





## హైకోర్టుకు ముగ్గురు అదనపు జడ్జిలు

### కేంద్రం ఉత్తర్వులు జారీ

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది.

హైకోర్టు న్యాయమూర్తుల నియా మక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.





## పెళ్లి బృందం ఆటో, టూవీలర్‌ను ఢీకొన్న లారీ

### నలుగురు మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు

### కంభం పట్టణంలో దుర్ఘటన

**ఒంగోలు, జులై 3 ప్రభాతవార్త:** గిద్దలూరు నుండి కంభం వస్తున్న పెళ్లి బృందం ఆటోను, ఓ ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన తౌడు లోడ్ లారీ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఓ చిన్నారితో సహా నలుగురు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో కంభం పట్టణంలోని వై జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం నల్లబండ బజారుకు చెందిన వారు కంభం పట్టణానికి చెందిన మండ్లా పాములేటి అనే యువకునికి తమ కుమార్తె ఆవుల వీరక్కను ఇచ్చి శుక్రవారం ఉదయం >>2



ఎలైట్ ప్లేయర్స్‌తో మంత్రి లోకేష్ విందు

# రాష్ట్రంలో ప్రపంచశ్రేణి 'స్పోర్ట్స్ సెంటర్'

### జెఎస్‌డబ్ల్యు సంస్థ సహకారంతో ఏర్పాటు, ఎలైట్ ప్లేయర్స్‌తో మంత్రి లోకేష్ విందు సమావేశం

**విజయవాడ.జులై 3 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జెఎస్ డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్‌వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలను స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో మంచి కోచ్‌లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబు విదేశీ కోచ్‌లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటుచేశారన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పం దిస్తూ పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి అత్యుత్తమ కోచ్‌లను ఏపీలో ఏర్పాటుచేసి, సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ తీసుకొస్తామన్నారు. రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జెఎస్ డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారని అన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేకంగా దృష్టిసా రిస్తున్నామని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ ఎరెనా ఉండాలన్నది తమ అభిమతంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ ను ప్రోత్సహించడంపై తల్లిదండ్రుల్లో కూడా అవేర్ నెస్ రావాల్సి ఉందని అన్నారు. ఇందులో భాగంగానే గతఏడాది నిర్వహించిన డీఎస్సీలో తొలిసారిగా క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని చెప్పారు. గ్రామస్థాయి >>2



శుక్రవారం జమ్మలమడుగులో నిర్మించనున్న ఉక్కుకర్మాగార నమూనా చిత్రాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు తదితరులు

# ‘ఉక్కు’ సంకల్పం సాకారం

>> తెలిపారు. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓ సారి, 2023లో మరోసారి శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. గడిచిన రెండేళ్లలో చాలా అంశాల్ని పరిష్కరించి ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. 1100 ఎకరాల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటు అవుతోందన్నారు. మొదటి దశలో రూ.4వేల కోట్లు, రెండో దశలో రూ.11850 కోట్లు పెట్టుబడి పెడుతున్నారని ఉక్కు రాష్ట్రం ఏపీ, విశాఖతో పాటు రాయలసీమగా ఉక్కు ప్రాంతంగా తయారవుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌తో పాటు సోలార్ ఎనర్జీ క్యాప్టివ్ ప్లాంట్‌ను జేఎస్‌డబ్ల్యూ ఏర్పాటు చేస్తోంది. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో వ్యర్థాల నుంచి వచ్చిన ఇనుము సేకరించి ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11440 కోట్ల ఆర్థిక సాయం తెచ్చి కాపాడామన్నారు. నక్కపల్లిలోనూ అర్సెలాల్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీల్లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టారు. రాయలసీమ ప్లాంట్ బళ్లారి కంటే అధిక సామర్థ్యంతో పని చేయాలని జేఎస్‌డబ్ల్యూను కోరుతున్నానన్నారు. రాయలసీమ ప్రాంతంలో అత్యంత నాణ్యమైన ముడి నుము ఖనిజాన్ని కూడా సరఫరా చేసేందుకు ఏపీ సిద్ధమన్నారు. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ కూడా రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగిందో ప్రజలు గమనించాలని కోరారు. జెఎస్‌డబ్ల్యూ ప్లాంట్‌తో ఈ ప్రాంతంలో సామాజికంగా, ఆర్థికంగా ప్రభావం ఉంటుందని గతంలో కియా ప్లాంట్ తీసుకొచ్చాను. అన్ని దేశాలకు ఆ సంస్థ కార్లను ఎగుమతి చేస్తోందని గుర్తు చేశారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ జయంత్ ఆచార్య మొదలైన వాణిజ్య ప్రముఖులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీఎం ఒక రోజు జిల్లా పర్యటను ముగించుకొని మధ్యాహ్నం 2.40 గంటలకు హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో కుప్పం బయలుదేరగా సాదర వీడ్కోలు పలకారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, డీఐజీ కొయా ప్రవీణ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు భూపేష్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు సీఎంకు వీడ్కోలు పలికారు.

## కొత్తగా మూడు పోలీసు కమిషనరేట్లు

>> ప్రభుత్వం భావిస్తోంది. ఈ నూతన కమిషనరేట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అప్పుడే అడుగులు వేశారు. కొత్తగా ప్రతిపాదించిన ఈ మూడు కమిషనరేట్లకు సంబంధించిన సరిహద్దుల నిర్ణయం, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల ఎస్పీలను ఆయన ఆదేశించారు. వీటితో పాటూ కమిషనరేట్ పరిధి లోకి వచ్చే కొత్త పోలీస్ వింగ్స్, అదనపు సిబ్బంది అవసరాలు, ఇతర సాంకేతిక వసతులపై సమగ్ర అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను, ప్రతిపాదనలను వెంటనే పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే ఆయా నగరాల్లో ట్రాఫిక్, క్రైమ్ కంట్రోల్ వంటి విభాగాలు మరింత బలోపేతం కానున్నాయి.

## ‘స్పోర్ట్స్ సెంటర్’

>> నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని అన్నారు. విశాఖ క్రికెట్ స్టేడియంలో ఒక స్టాండ్ కు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరుపెట్టామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థుల ఆసక్తిమేరకు వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు మాట్లాడుతూ కొరియాలో ఆర్చరీ క్రీడాకారులకు రోబోతో ముందస్తు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ ఆడే సమయంలో క్రీడాకారులు గాయపడినపుడు రికవరీ చాలా ముఖ్యమని, దీనిపై దేశంలో కొన్నిచోట్ల మాత్రమే రికవరీ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది భారత అథ్లెట్లు 26 జాతీయ రికార్డులను బ్రేక్ చేశారని క్రీడాకారులు చెప్పగా, లోకేష్ అభినందనలు తెలిపారు. సింగపూర్ స్పోర్ట్స్ కాలేజీలో ఎఐ ద్వారా బౌలింగ్ ను కోచ్ లు పర్యవేక్షించడం చూశానని అన్నారు. ఈ డిన్నర్ మీట్ లో కామన్ వెల్త్, ఆసియా గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పివి సింధు (బ్యాడ్మింటన్), సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), జ్యోతిక శ్రీ (అథ్లెటిక్స్), భవానీ కార్తీక్ (పారా స్విమ్మింగ్), వెంకటరామిరెడ్డి (అథ్లెటిక్స్), ఆర్.స్వాతి (అథ్లెటిక్స్), భవానీ యాదవ్ (అథ్లెటిక్స్), కుసుమ రావాడ (అథ్లెటిక్స్), గణేష్ మణిరత్నం (ఆర్చరీ), రష్మి (అథ్లెటిక్స్), మల్లల అనూష (అథ్లెటిక్స్), శిరీష (అథ్లెటిక్స్), కుంజా రజిత (అథ్లెటిక్స్), యుక్తశ్రీ (ఆర్చరీ), తీర్థసామదేవ్ (స్విమ్మింగ్) పాల్గొన్నారు.

**క్రీడాకారులకు ఆర్థికసాయం మంజూరు:**
ఈఏడాది ఆసియన్ గేమ్స్, కామన్ వెల్త్ గేమ్స్, పారాకామన్ వెల్త్ గేమ్స్ కు ఎంపికైన 18మంది అథ్లెట్లశిక్షణ కోసం ప్రభుత్వం రూ.2,23,25,000లను విడుదల చేసింది. క్రీడాకారుల అవసరాన్నిబట్టి మరింత సాయం ఇస్తామన్నారు.



హస్వాంగ్ (అడిడాస్) సంస్థ ఛైర్మన్ లీను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

# ఇంటికో పారిశ్రామికవేత్త

>> ఎంఒయులు కుదుర్చుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రావాలన్నదే తన ఆశయమన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారిని తాను ఆహ్వానిస్తున్నానన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంతో కీలకంగా మారిందన్నారు. తద్వారానే వైజాగ్‌కు 1.35లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ సంస్థ వచ్చిందన్నారు. ప్రఖ్యాత అడిడాస్ షూ కంపెనీ కోసం వేరే రాష్ట్రాలు పోటీపడ్డాయన్నారు. అయితే ఆసంస్థ కుప్పంకు రావడం జరిగిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వంపై వారికి ఉన్న విశ్వాసం అన్నారు. కుప్పంలో వేలకోట్ల రూపాయల పెట్టుబడులతో పారిశ్రామికవేత్తలు రావడం ఆనందంగా ఉందన్నారు. కుప్పానికి మున్ముందు బెంగళూరు నుంచి ఉద్యోగాలకు వచ్చేలా ఇక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పంలో ఇప్పటికే 9322కోట్లతో 27 పరిశ్రమలు వచ్చాయని తద్వారా 39535మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపుకు :** విధ్వంసంనుంచి వికాసం వైపుకు రాష్ట్రంలో పాలన జరుగుతోందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమపై నమ్మకంతో ఎన్నికల్లో గెలిపించారన్నారు. ప్రజల తలసరి ఆదాయం పెంచేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఉపాధి, యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయవ వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. కుప్పం నుంచే ఇంటికో పారిశ్రామికవేత్త రావాలనే కార్యక్రమంకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కరణల నుంచి స్టార్టప్ కంపెనీలు మరిన్ని రావాలన్నారు. దేశంలోనే డ్వాక్రా సంఘాలు నెంబర్‌వన్ స్థానంలో ఉన్నాయని కేంద్రం ఇచ్చిన రేటింగ్స్‌లో పేర్కొందన్నారు. 1.49లక్షల మంది మహిళలు 1400కోట్ల రుణాలు తీసుకుని తిరిగి చెల్లిస్తున్నారన్నారు. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేయాలనేది తన లక్ష్యమన్నారు. రైతులకు ఎఫ్‌పిఒల ద్వారా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. తిరుపతి శ్రీ సిటీలో 300 కంపెనీలు ఉన్నాయని అక్కడ కూడా యూనివర్సిటీని ప్రారంభించామన్నారు. కుప్పంలో మూడు సంస్థల ద్వారా పి4 కార్యక్రమంలో భాగంగా 9వేల కుటుంబాలను దత్తత తీసుకున్నాయన్నారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కుప్పానికి గండికోట నుంచి తాగునీరు తెచ్చి ఇంటింటికీ కొళాయి ద్వారా, పరిశ్రమలకు నీరు అందిస్తామన్నారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు పొగురుపల్లిలోనే రాత్రి బాగా పొద్దుపోయే దాకా పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. అంతకుముందు సిఎంకు ద్రవిడ వర్సిటీలో హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు.

కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కన్వీనర్ చంద్రశేఖర్, నాలుగు మండలాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొత్త రూపు

>> నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014 19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందనడానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు. రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకోమాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటాడారు అన్నారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయన్నారు. అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ఏటా లక్ష కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్షకోట్లతో 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీకేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమల రావు, కెడిసి సిఈ రాంబాబు పాల్గొన్నారు.

# సిట్ అధికారులు నన్ను హింసించే అవకాశం

## విజయవాడ కోర్టుకు సస్పెండయిన సిఐ నాగరాజు లేఖ

### సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ కేస్టోడియల్ డేత్ కేసు వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజు కేసులో ఒక అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు నాగరాజు న్యాయస్థానానికి ఒక సంచలన లేఖ రాశారు. సాయికృష్ణ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను పూర్తిగా నిర్దోషినని, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారుల అభ్యర్థన మేరకు విజయవాడ కోర్టు నాగరాజును 8 రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇప్పటికే అనుమతించింది. ఈ నేపథ్యంలో నాగరాజు సిట్ విచారణలో తనను హింసించే అవకాశం ఉందంటూ కోర్టు రాసిన లేఖలో అభ్యర్థించారు, సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఎనిమిది రోజుల కస్టడీ విచారణ సమయంలో అధికారులు తనపై థర్డ్ డిగ్రీ ఉపయోగించకుండా, శారీరకంగా, మానసికంగా వేధించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును వేడుకున్నారు. అంతేకాకుండా, సిట్ అధికారులు జరిపే విచారణ ప్రక్రియ అంతా చట్ట ప్రకారం తన న్యాయవాదుల సమక్షంలోనే జరిగేలా చూడాలని లేఖలో అభ్యర్థించారు. సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఎనిమిది రోజుల కస్టడీ విచారణ సమయంలో అధికారులు తనపై థర్డ్ డిగ్రీ ఉపయోగించకుండా, శారీరకంగా, మానసికంగా వేధించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును వేడుకున్నారు. అంతేకాకుండా, సిట్ అధికారులు జరిపే విచారణ ప్రక్రియ అంతా చట్ట ప్రకారం తన న్యాయవాదుల సమక్షంలోనే జరిగేలా చూడాలని లేఖలో అభ్యర్థించారు.




## త్వరలో కృష్ణానదిలో మరింత ఆహ్లాదకర బోటింగ్

**విజయవాడ,జూలై 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీలో పర్యాటక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుంది. ఇందులో భాగంగా ఏపీలో నదులు, సముద్ర తీర ప్రాంతాలు ఉన్నచోట పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే ఏపీలోని బీచ్ లపై ప్రత్యేకమైన ఫోకస్ పెట్టే అభివృద్ధి చేస్తున్న సర్కార్, కృష్ణానదిలో పర్యాటకులకు మరింత ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభూతిని కలిగించడం కోసం డీజిల్ బోట్లకు బదులు సోలార్ శక్తితో నడిచే బోట్లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఏపీటీడీసీ బోర్డు సమావేశంలో సోలార్ బోటు నమూనాను కూడా సభ్యులకు ప్రదర్శించారు. ప్రయోగాత్మకంగా ఏపీలో నాలుగు సోలార్ మెకనైజ్డ్ బోట్ లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం విజయవాడ ప్రాంతంలో కృష్ణా నదిలో పర్యాటకుల సేవ కోసం డీజిల్‌తో నడిచే బోట్ లు వినియోగంలో ఉన్నాయి. ఈ మేరకు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఏపీటీడీసీ బోర్డు సమావేశంలో సోలార్ బోటు నమూనాను కూడా సభ్యులకు ప్రదర్శించారు.

## డెల్టా ర్యాంకింగ్‌లో పార్వతీపురం దేశంలోనే నం.1స్థానం

**విజయనగరం (పార్వతీపురం మన్యం జిల్లా), జూలై 3 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఉన్న జిల్లాలలో పార్వతీపురం మన్యం జిల్లా డెల్టా ర్యాంకింగ్స్‌లో చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఆకాంక్ష జిల్లా కార్యక్రమం ఏడిపి మార్చి 2026లో ఈ విజయాన్ని చేజిక్కించుకుంది. నీతి అయోగ్య ప్రకటించిన ఆకాంక్ష జిల్లా కార్యక్రమం డెల్టా ర్యాంకింగ్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 123 ఆకాంక్ష జిల్లాల మధ్య పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యం అండ్ పోషణ థీమ్ దేశవ్యాప్తంగా రెండవ స్థానం సాధించడం ద్వారా మరో విశిష్ట ఘనతను అందుకుంది. ఒకే డెల్టా ర్యాంకింగ్ చక్రంలో రెండు థీమ్స్‌లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన దేశం నుండి తొలి ఆకాంక్ష జిల్లా పార్వతీపురం మన్యం జిల్లా చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు దేశంలో ఏ ఇతర జిల్లాలు కూడా ఈ విధమైన అరుదైన ఘనతను సాధించలేదు ఈ అసాధారణ విజయానికి జిల్లా పరిపాలన సమన్వయంతో చేసిన కృషి శాఖల మధ్య సమగ్ర సమన్వయం నిరంతర పర్యవేక్షణ వినూత్న కార్యక్రమాలు మరియు గ్రామస్థాయి వరకు అమలు చేసిన అభివృద్ధి చర్యలు ప్రధాన కారణంగా నిలిచాయి. ప్రత్యేకించి ఆరోగ్య పోషణ మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన ఫలప్రదమైన చర్యలు జిల్లా పురోగతికి దోహదపడ్డాయి. ముఖ్యంగా గిరిజన మరియు వెనుకబడిన వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఈ ఘనత సాధ్యమైంది. ఈ చారిత్రాత్మక విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాకుండా పార్వతీపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఆకాంక్ష జిల్లాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అభివర్ణించారు

## సిట్ అధికారుల పిటిషన్‌పై విచారణ ఆదివారానికి వాయిదా

**విజయవాడ.జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్‌డేత్ నిందితుడు నాగరాజు కస్టడీ విచారణపై సిట్ అధికారుల లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల కస్టడీ విచారణపై దిగువ కోర్టు ఇచ్చిన నిబంధనల్లో మార్పు కోరుతూ సిట్ పిటిషన్ చేసింది. సిట్ అధికారుల పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఆదివారానికి వాయిదా వేసింది.

# ‘సాంస్కృతిక విందు’

>> టెక్నాలజీ రంగాల్లో కుదిరిన ఒప్పందాల ద్వారా, ప్రపంచ ఆరోగ్య భద్రతకు కూడా దోహదం చేస్తాయని తెలిపారు. జపాన్ నుంచి భారత్‌కు 10 లక్షలకోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, రానున్న దశాబ్ద కాలంలో దేశంలో పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమేనని స్పష్టం చేశారు. దేశంలో నిరంతరంగా జరుగుతున్న సంస్కరణలు వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరిచాయని, ఈ అవకాశాన్ని జపాన్ కంపెనీలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చునని మోడీ పేర్కొన్నారు. ఇంధన ఆర్థిక భద్రతలపై ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు మోడీ పేర్కొన్నారు. “ఆర్థిక భద్రత కోసం మేమిప్పుడు ఒక ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. దీని ద్వారా, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి వ్యూహాత్మక రంగాల్లో సరఫరా గొలుసులను బలోపేతం చేస్తాం. నేటి అనిశ్చిత యుగంలో, ఆర్థిక, ఇంధన భద్రత ప్రాముఖ్యతను భారత్, జపాన్ దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు దేశం అంతటా 1000 బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించ డంలో భారత్ జపాన్ బయోగ్యాస్ చొరవ మాకు సహాయపడుతుంది. ఇది మా గోబర్‌ధన్ చొరవను మరింత బలోపేతం చేస్తుంది. గ్రామాల్లో సుస్థిరత, శ్రేయస్సు, గ్రామీణ జీవనోపాధికి కొత్త ఊపునిస్తుందని మోడీ పేర్కొన్నారు.

**సంతూర్ వాయించిన జపాన్ ప్రధాని**
జపాన్‌ప్రధాని గౌరవార్థం హైదరాబాద్ హౌస్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక విందు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసారు. ఈసందర్భంగా ప్రధానిమోడీ భారత్‌లోని విశేష ప్రాచుర్యం ఉన్నవాయిద్యం సంతూర్‌ను వాయించాలని కోరారు. ముందు తకైయిచి కొంత తటపటా యించినా ప్రధానిమోడీ ముందుగా తాను సంతూర్‌ను వాయించి తదనం తరం తకాయిచి ప్రోత్సహించడంతో ఆమె సంతూర్‌ను వాయించి ఆనందం వ్యక్తంచేసారు. తకాయిచి సంతూర్ వాయిస్తుండగా ప్రధానిమోడీతో సహా అక్కడున్న అతిథులందరూ చపట్లతో జపాన్ ప్రధానిని అభినందించారు.

## ఎసిబి వలలో మరో అవినీతి ‘చేప’

>> మల్లంగుంటలోనే మత్స్య పరిశ్రమ క్రింద చేపలు, రొయ్యలు ఇతర జలచరాలను పెంచడం కోసం కార్యాచరణ రూపొందించాడు. ఇందుకు సంబంధించిన పరిశ్రమ స్థాపన అంచనాను తయారుచేశాడు. 50లక్షలు రూపాయలు పెట్టుబడితో ఏర్పాటుచేసే ఈ పరిశ్రమకు ప్రధానమంత్రి యోజన పథకం క్రింద 60శాతం రాయితీకి దరఖాస్తుచేసుకున్నాడు. ఈ దరఖాస్తులను తిరుపతినగరంలోని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ రెడ్డన్నను కలిశాడు. తన పరిశ్రమకు సంబంధించిన రికార్డులను ,దరఖాస్తులను సమర్పించాడు. అయితే రాయితీ కోసం తన సంతకం చేయడానికి 4.50లక్షలు రూపాయలు లంచం ఇవ్వాలని రెడ్డన్న కొంతకాలం క్రిందట డిమాండ్ చేశాడు. అయితే బాధితులు అంతపెద్దమొత్తంలో ఇచ్చుకోలేమని మొరపెట్టుకున్నారు. చివరకు 3లక్షలు రూపాయలు లంచం నగదుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మొత్తాన్ని తాను చెప్పిన చోటుకు, ఆ వ్యక్తికి అప్పగిస్తే రాయితీ కోసం ఫైల్ కదలడానికి సంతకం చేస్తానని తేల్చి చెప్పేశాడు. దీంతో బాధితుడు సుభాన్ చేసేది లేక తిరుపతిలోని ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎసిబి డిఎస్పీ సీతారామారావు సిబ్బంది సూచనలతో 3లక్షల లంచం డబ్బుల్లో శుక్రవారం ఉదయం ఒకలక్ష రూపాయలు లంచం నగదు తిరుపతిలోని అన్నారావు కూడలి వద్ద రెడ్డన్న స్నేహితుడు నాగరాజుకు అందిస్తుండగా పథకం ప్రకారం ఎసిబి అధికారులు అతనిని పట్టుకున్నారు. ఆ తరువాత అతని సహాయంతో జిల్లా మత్స్యశాఖ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ డిడి రెడ్డన్నను అదుపులోకి తీసుకున్నారు. ఆధారాలతో పక్కాగా లంచం నగదు తీసుకుంటూ పట్టుబడటంతో నాగరాజును, డిడి రెడ్డన్నను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు ఎసిబి అధికారులు రెడ్డన్న ఇంటిని, కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయనకు సంబంధించి కడపలోనూ ఆస్తులు ఉండటంతో అక్కడా సోదాలు చేశారు. రాత్రికూడా సోదాలు కొనసాగుతుండటంతో శనివారం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఎసిబి అధికారులు రెడ్డన్నను, నాగరాజును తదుపరి చర్యలకు అరెస్ట్ చేయనున్నారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంపై ఎసిబి అధికారుల దాడులతో ఆ కార్యాలయం ఉద్యోగులు బెంబేలెత్తారు. ఇంకా ఇలాంటి అక్రమాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంగా ఎసిబి అధికారులు విచారణ చేస్తున్నారు.

## పెళ్లి బృందం ఆటో, టూవీలర్‌ను ఢీకొన్న లారీ

>> కంభంలో వివాహం జరిపించేందుకు గిద్దలూరునుంచి గురువారంరాత్రి 10:30 గంటలకు పెండ్లి కుమార్తెతో సహా పదిమంది ఆటోలో బయలుదేరగా మరో ఇద్దరు ద్విచక్ర వాహనంలో కంభంకు బయలుదేరారు. రాత్రి ఒంటిగంట సమయంలో కంభం వై.జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న వినాయక స్వామి గుడి వద్దకు వచ్చి ఆటోను ఆపుకుని గుడి వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు పెళ్లి కుమార్తె, మరో ఇద్దరు ఆటో దిగారు మిగిలిన వారందరూ ఆటోలోనే కూర్చొని ఉండగా అదే సమయంలో మదనపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు తౌడు లోడుతో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆటోను, ఆటో వెనుక ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం దిగి ఆటో వెనక నిలుచున్న ఆవుల అంకాలు (21), ఆవుల నాగేష్ (18) లనుతొక్కించుకొని, ఆటోను బలంగా ఢీకొనడంతో ఆవుల అంకాలు భార్య ఆవుల రామానుజమ్మ(19), నాగరాజు మైసమ్మల కుమార్తె చిన్నారి నాగేశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న ఆవుల వీరమ్మకు కాలు విరగగా, ఆవుల ఓబులమ్మ రెండు కాళ్లు, నల్లబోతుల సంజీవరా యుడు, మైసమ్మలకు తలకు తీవ్ర గాయాలుగా వారిని మొదట మార్కాపురం ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అ నంతరం వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే పోలీసులుసంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంతీరును పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం మార్కాపురం ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. లారీ మితిమీరిన వేగంతో రావడం వలనే ప్రమాదం చోటుచేసు కుందని స్థానికులు తెలిపారు.

## గవర్నర్‌తో డి.సిఎం పవన్ భేటీ

>>దుకు ప్రత్యేక వ్యవస్థని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్క్రీన్‌షాట్స్, లింక్స్, వీడియోలతో ఫిర్యాదు చేయాలని వాటి ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి నేరాలకి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ వ్యవస్థనుబలోపేతం చేయడానికి, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ఇవాళ గవర్నర్‌తో పవన్ కల్యాణ్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

04-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
చవితి మ.12.37,
ధనిష్ఠ మ.1.41
వర్జ్యం : రా.9.19-రా.11.01
దు.తె.5.39-7.19
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** చేటిని లెక్క చేయక బాధ్యతలు నిర్వహించి మంచి వ్యక్తిగా పేరు పొందుతారు. క్రీడల యందు రాణిస్తారు.

**వృషభం:** రాబోయే కాలములో చెల్లించవలసిన ధనమును గూర్చి, ఇప్పుడే ఘర్షణ పడవద్దు. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** అత్యంత కఠినమైన ప్రతిష్ఠాత్మకమైన వ్యవహారాలను మధ్య వర్తులకు అప్పగిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కర్కాటకం:** ప్రముఖులను కలుసుకొని కీలక విషయాలపై చర్చిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**సింహం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్త్రలాభం.

**కన్య :** మీ ఆత్మీయులతో సమాలోచనలు చేసి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అధిక శ్రమ చేయకుండానే లక్ష్యసాధనను సాధిస్తారు.

**తుల:** ముఖ్యమైన పత్రములను పోగొట్టుకొనటం వంటి సమస్యలు సాంకేతిక ఇబ్బందులు సంభవించకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** కొద్దిపాటి మనస్పర్ధలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంత ప్రయోజనాలు కలిసి వస్తాయి. అన్ని పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం కలదు.

**మకరం:** తాత్కాలిక ప్రయోజనముల కొరకు మీకు ఇష్టంలేకపోయినా కొందరితో కలిసి పనిచేయవలసి వస్తుంది. వస్త్రలాభం.

**కుంభం:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యవహారాలతో సన్నిహితుల సాయం అందుకుంటారు.

**మీనం:** కుటుంబంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వివిధ సమాచార సాధనము లను వినియోగించుకొని విజయాలను సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## డి.సిఎం పవన్‌తో ఈగల్ చీఫ్ భేటీ



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఆకే రవికృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ విభాగం తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను ఈ నివేదికలో వివరించారు. సోషల్ మీడియా వేధింపులు, ట్రోలింగ్ అంశాలతో పాటు మహిళలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సామాజిక మాధ్యమాలో శృతి మించి వ్యాఖ్యానాలు, పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశలో పోలీసు నిఘా పెట్టాలని ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణకు డిప్యూటీ సీఎం పవన్ సూచించారు. కీలకంగా గంజాయి, డ్రగ్స్ విషయంలో నిఘా ఎక్కువగా ఉండాలన్నారు. విద్యాసంస్థలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, క్రీడా ప్రాంగణాల వద్ద నిఘా ఉండాలన్నారు. ఈ మత్తుపదార్థాలు అమ్మేవారిపైన తీసుకునే వారిపైన కఠిన చర్యలుండాలన్నారు. ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై దృష్టిపెట్టాలన్నారు. ఆకతాయిలకు కఠినంగా బుద్ధిచెప్పాలన్నారు.

**మూలపేట జెడ్పీ హైస్కూలు సిబ్బందికి పవన్ అభినందనలు:** గత విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో కాకినాడ జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో, గురువారం 7వ తరగతి నుంచి ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు లేవంటూ నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బోధన విధానాలు, బోధనేతర సిబ్బంది సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసే స్థాయికి మూలపేట ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దడానికి తోడ్పడినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఈసారి పిఠాపురం పర్యటన సందర్భంగా మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తానని ఉప ముఖ్యమంత్రి మాటిచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు.. మూలపాడు జెడ్పీ హైస్కూల్ సాధించిన ఫలితాల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## 'భావప్రకటన స్వేచ్ఛ అంటే అసభ్య పదాలకు లైసెన్స్ కాదు'

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సామాజిక మాధ్యమం ద్వారా ఎవ్వరి మనోభావాలను దెబ్బతీసినా ఊరుకునేది లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే అసభ్యపదాలకు లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ)ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# అనంతలో దొంగ నోట్ల తయారీ ముఠా

**• విజయవాడ పోలీసుల మెరుపు దాడులు • రెడ్ హ్యాండెడ్‌గా ఇద్దరు కేటుగాళ్లు అరెస్ట్ • నకిలీ కరెన్సీ, ముద్రణ యంత్రాలు, ల్యాప్ టాప్ స్వాధీనం**





**అనంతపురం(క్రైమ్) జులై 3 ప్రభాతవార్త:** డబ్బును సంపాదించడం కన్నా ప్రింట్ చేసుకొని వాటిని అమాయకులను మోసం చేసి వారికి అంటగట్టి కోటేశ్వరులు కావడం ఈజీ అనుకున్నారు... కానీ చట్టానికి అడ్డంగా దొరికిపోయారు.. ఆంధ్రప్రదేశ్ లో నకిలీ నోట్ల ముఠాలు రాష్ట్ర సరిహద్దులు దాటి నెట్వర్క్ అనంతపురం జిల్లాకు కూడా విస్తరిస్తున్న ఉదంతం ఒకటి అనంతపురం జిల్లాలో వెలుగుజూసింది. ఈ వ్యవహారం జిల్లా వాసులకు కుదిపేసింది. పోలీసులు రంగ ప్రవేశంతో నకిలీ నోట్ల ముద్రణ కాస్తా బట్టబయలు అయింది. ముఠా సభ్యులు పోలీసుల చేతికి చిక్కి చివరకు కటకటాల పాలయ్యారు. ఈ ఉదంతానికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. అనంతపురం నగర నడిబొడ్డున కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న దొంగ నోట్ల తయారీ కేంద్రాన్ని విజయవాడ పోలీసులు అత్యంత వ్యూహాత్మకంగా దాడి చేసి బట్టబయలు చేశారు. ఈ ఆపరేషన్లో దొంగ నోట్లను ముద్రిస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులను రెడ్ హ్యాండెడ్ గా అదుపులోకి తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. పేద, సామాన్య ప్రజలను ముంచేలా భారీ ఎత్తున కరెన్సీని ముద్రించి మార్కెట్లోకి వదిలేందుకు ప్రయత్నించిన ఈ ముఠా గుట్టును సైబర్, ఇంటెలిజెన్స్ సమాచారంతో పోలీసులు రట్టు చేశారు. నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న శారదా నగర్ లోని ఒక నివాస గృహంలో ఈ దొంగ నోట్ల ముద్రణ తంతు సాగుతోంది. నమ్మదగిన సమాచారంతో ప్రత్యేకంగా రంగంలోకి దిగిన విజయవాడ స్పెషల్ పోలీస్ టీమ్, గురువారం రాత్రి హఠాత్తుగా సదరు ఇంటిపై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ సమయంలో రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో హై క్వాలిటీ పేపర్లపై నోట్లను ప్రింట్ చేస్తున్న అనంతపురానికి చెందిన రాజు, సురేష్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా వల పన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ఈ నకిలీ నోట్ల వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు తేలిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అనంతపురానికి చెందిన రాజు, సురేష్‌లతో పాటు విజయవాడకు చెందిన మరికొందరు కీలక వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. ఈ నకిలీ కరెన్సీని రాష్ట్రవ్యాప్తంగా వివిధ వ్యాపార కేంద్రాలు, నగరాలు, పట్టణాలు, ఇతర రద్దీ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు జరిపిన ఈ విస్తృత సోదాలల్లో నిందితుల రూమ్ నుండి దొంగ నోట్లను ముద్రించేందుకు ఉపయోగించే అత్యాధునిక కలర్ ప్రింటింగ్ మిషన్లు, స్కానర్లను, కొన్ని సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నోట్ల డిజైనింగ్, సాఫ్ట్వేర్ మేనేజ్మెంట్ కోసం వాడిన ఒక ల్యాప్టాప్, నిందితుల వద్ద ఉన్న సెల్ఫోన్లను, భారీ మొత్తంలో ముద్రించి రవాణాకు సిద్ధంగా ఉంచిన నకిలీ నోట్లను పోలీసులు సీజ్ చేశారు. సాంకేతిక ఆధారాల కోసం ల్యాప్టాప్, ఫోన్ల డేటాను నిపుణుల విశ్లేషణకు పంపారు. ఈ కేసు విజయవాడ పరిధితో ముడిపడి ఉండటంతోపాటు అక్కడి నుంచే ప్రధాన నిందితులకు ఆదేశాలు అందుతుండటంతో.. అరెస్ట్ చేసిన రాజు, సురేష్ లను విజయవాడ పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం భారీ భద్రత నడుమ విజయవాడకు తరలించారు. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వీరికి కరెన్సీ కాగితాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి? ఇప్పటివరకు మార్కెట్లోకి ఎంత మొత్తంలో నకిలీ కరెన్సీని చలామణి చేశారు. అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పండుగల సీజన్, వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరిగే సమయంలో ఇలాంటి నోట్లు మార్కెట్లోకి వస్తే ఆర్థిక వ్యవస్థకు, సామాన్య వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రజలు కూడా నగదు తీసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## దివ్యాంగుల సాధికారతపై జాతీయ అవార్డులకు నామినేషన్లు ఆహ్వానం

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుల సాధికారతజాతీయ అవార్డులకు అర్హులైన వ్యక్తులు, సంస్థల నుండి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం తెలియజేసిందని రాష్ట్ర దివ్యాంగులు, ట్రాన్సు జెండర్స్, సీనియర్ సిటిజన్స్ శాఖ సంచాలకులు యం.వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

దివ్యాంగుల సాధికారతకు వినూత్న రీతిలో విశేష కృషి చేసి వారి జీవన విధానాన్ని మెరుగుపర్చేందుకు పాటుపడిన వారిని గుర్తించి గౌరవించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సాధికారత జాతీయ అవార్డులను ఇవ్వనుందని తెలిపారు. దివ్యాంగుల సాధికారతకు సంబంధించి నేషనల్ అవార్డు ఫర్ ఇండివిడ్యువల్ ఎక్సెలెన్స్ 2026, నేషనల్ అవార్డు ఫర్ ఇనిస్టిట్యూషన్స్ ఎంగేజ్డ్ ఇన్ ఎంపవరింగ్ పెర్సన్స్ విత్ డిజబిలిటీస్ 2026 పేరిట ఈజాతీయ అవార్డులను ప్రదానం చేయనుందని డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

ఈఅవార్డులకు సంబంధించిన పూర్తి ఎలిజిబులిటీ క్రైటీరియు, నామనేషన్ల పంపే విధానం తదితర వివరాలు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ లో జాతీయ అవార్డు మార్గదర్శకాల్లో పొందుపర్చబడి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈఅవార్డులకు సంబంధించిన దరఖాస్తులు, నామినేషన్లను ఈనెల 31వ తేదీలోగా ఆన్లైన్ విధానంలో సమర్పించేందుకు అందుబాటులో ఉంటుందని డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. కావున రాష్ట్రంలోని అందరు జిల్లా కలక్టర్లు, వివిధ శాఖల విభాగాధిపతులు ఈసమాచారాన్ని క్షేత్రస్థాయి వరకు చేరవేసి అర్హులైన వ్యక్తులు, సంస్థల నుండి దరఖాస్తులు, నామినేషన్లు సకాలంలో చేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

## రాజధాని అమరావతి పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్షించారు. అమరావతిలో ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతిపై చర్చించారు. ఆటంకం లేకుండా పనులు జరుగుతున్నాయని ఇంజినీర్లు వివరించారు. పరిపాలన అనుమతులు పొందిన ప్రాజెక్టులకు టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారంపై మంత్రి నారాయణ చర్చించారు. వీలైనంత త్వరగా అధికారులు, ఉద్యోగుల నివాసాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



## సిమెంటు కంపెనీలు 6శాతం ఆర్‌డిఎఫ్ వినియోగించాలి

**స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి**

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సిమెంటు కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో 6శాతం రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్డీఎఫ్)ను తప్పనిసరిగా వినియోగించాలని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ఆదేశించారు. విజయవాడ గురునానాక్ కాలనీలోని ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పిసిబి) కార్యాలయంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని సిమెంటు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమవేశమయ్యారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ఈఏడాది ఏప్రిల్‌లో జారీచేసిన నిభందనల ప్రకారం సిమెంటు కంపెనీలు లెగసీవేస్ట్, ఫ్రెష్‌వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలలో తయారయ్యే ఆర్డీఎఫ్‌ను వినియోగించాలన్నారు. ఆర్డీఎఫ్ వినియోగంపై సిమెంటు కంపెనీలు ఖచ్చితమైన టైమ్‌లైన్‌ను అందచేయాలని కోరారు.

సిమెంటు కంపెనీలు ఆర్డీఎఫ్ వినియోగానికి అనువైన యంత్రాలను రిట్రోఫిటింగ్ సత్వరమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా కంపెనీల ఆర్డీఎఫ్ వినియోగంపై స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్, పొల్యూషన్ కంట్రోలు బోర్డులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాయని, దీనికోసం ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారం ఆర్డీఎఫ్ వినియోగించని కంపెనీలపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి హెచ్చరించారు.

ఈ కార్య క్రమంలో స్వచ్ఛంధ్ర కార్పోరేషన్ యండి బి. అనీల్‌కుమార్ రెడ్డి, పిసిబి సభ్యులు ఆర్.శర్వణ, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యం.రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాత ఆలయాలకు పూర్వవైభవం

**• మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన**



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జీర్ధావస్థలో ఉన్న పురాతన ఆలయాలన్నింటికి పూర్వ వైభవం తీసుకుని వస్తామని పనులకు మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ఆలయాల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేపడతామని తెలిపారు. ప్రాచీన దేవాలయాలు మన చరిత్ర, సంస్కృతికి నిదర్శనాల న్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నూతన యాగశాల నిర్మాణంతో పాటు వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన నమూనా చిత్రాలను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం చేసిన స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖ నిధులు రూ.6.3 కోట్ల వ్యయంతో శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా దేవాలయం అంతా పరిశీలించిన అనంతరం మంత్రి లోకేష్ అధికారులకు పలు సూచనలు చేశారు.

భక్తులకు కావాల్సిన వసతులు, ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మాస్టర్ ప్లాన్ రూపొం దించాలని అధికారులను ఆదేశిం చారు. ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా ఆయా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి లోకేష్ సూచించారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించడంతో పాటు నిత్యప్రసాదానికి చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరిణిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందరితో కలిసి మంత్రి లోకేష్ ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**తోతాపురి మామిడి రైతులకు కేంద్రం శుభవార్త**

**ఆదాయం పెంపునకు మార్గాలు అన్వేషణ**

**ధరలు తగ్గడానికి దారితీసిన కారణాలపైనా విశ్లేషణ**

## ఐసిఎఆర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న ధరల పతనం సమస్యను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో తీసుకుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తోతాపురి మామిడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారని మంత్రి తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను గుర్తించిన కేంద్ర మంత్రి, ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారని వెల్లడించారు.

ఈ కమిటీలో ఐసీ ఏఆర్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వ విద్యాలయ నిపుణులు, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. తోతాపురి మామిడి సాగు ప్రాంతాలను సందర్శించి రైతులు, పల్ప్ పరిశ్రమలు, ఎగుమతి దారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రభుత్వ అధికారు లతో చర్చించి సమస్యల మూలాలను అధ్య యనం చేసి ఆచరణ సాధ్యమైన సూచనలు అందించనుందని చెప్పారు.

ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుం దని, అవసరమైన సమాచారం, సమన్వయం కల్పించి త్వరిత గతిన నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.


రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉద్యాన రంగాన్ని మరింత బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తుండటంతో తోతాపురి మామిడి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తోందని, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై ఇదే విధంగా చొరవతో చర్యలు కొనసాగిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## అరకు పార్లమెంట్‌లో పరిస్థితులపై మంత్రి లోకేశ్‌తో సంధ్యారాణి చర్చ

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** అరకు పార్లమెంట్‌లో పరిస్థితులపై మంత్రి లోకేశ్‌తో మంత్రి సంధ్యారాణి చర్చించారు. అరకు లోక్‌సభ నియోజకవర్గంలో కార్యక్రమాల పురోగతి నివేదికను సంధ్యారాణి మంత్రి లోకేశ్‌కు అందించారు. అనంతరం ఆ నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతంపై చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించిన ఇరువులు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 9 ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. ఈ క్రమంలో త్వరలోనే అరకులోని 7 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించాలని మంత్రులు నిర్ణయించారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**• కొనుగోళ్లలో అక్రమాలు, కంపెనీల సిండికేట్‌ను సహించం • మంత్రి అచ్చెన్నాయుడు**



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత పరిస్థితిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉన్నతస్థాయి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అన్ని పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను వెంటనే పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు సంస్థ తప్పనిసరిగా ఆక్షన్లలో పాల్గొనాలని, ఆక్షన్లకు దూరంగా ఉండే కంపెనీలపై టొబాకో బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించిన మంత్రి, కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి నాణ్యమైన బేల్స్‌పైనా సీలింగ్ విధించి కృత్రిమంగా ధరలు తగ్గించే ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు. అలాంటి చర్యలు నిర్ధారణ అయితే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను ఆదేశించారు. పొగాకు రిజెక్షన్ రేటును గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన మంత్రి, అన్ని గ్రేడ్ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు టొబాకో బోర్డు సూచనల మేరకు మాత్రమే తమ పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని కోరారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు రిజెక్షన్ రేటు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకును వెంటనే విక్రయించకుండా నిల్వ ఉంచాలనుకునే రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సహచర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా కంపెనీల సిండికేట్ లేదా అక్రమాలు వెలుగుచూస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదు. ప్రతి రైతుకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 6న ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త:** ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్‌జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్‌వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జునోసిస్ దినోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాపశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని పశువైద్యకేంద్రాలలో కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నామని పెంపుడుకుక్కల యజమానులు ఈఅవకాశాన్ని వినయోగించుకోవాలని ఆయన కోరారు. కుక్కల నుండి మనుషులకు సోకే ప్రాణాంతకమైన ర్యాబిస్ వ్యాధికి మందులు లేవని నివారణ ఒక్కటే మార్గమన్నారు. యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ సునంద, డాక్టర్ మనోజ్, డాక్టర్ పంకజ్ పాల్గొన్నారు.

**బంగారం వేలం నోటీసు**

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");**

**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు, అకుర్డి, పూణె 411035**

BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలుకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు), 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-08-26): **అమలాపురం - మెయిన్ రోడ్;** PGC2SGL26494049. **అనకాపల్లి - భార్గవి ప్లాజా;** PBV8SGL25427941, 27745386, 27710897, 28050478, 28519525. **కళ్యాణ్‌దుర్గ్ - కళ్యాణ్దుర్గ్ రోడ్;** PIV9SGL17875216, 18034344, 25437948, 25655674, 27215376. **అనంతపుర్ - సుభాష్ రోడ్;** PGA7SGL18081949, 18143229, 24261155, 26746548, 28118932, 28259820. **బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్;** PJU6SGL12490693, 26967983, 27016837, 27174969, 27352910, 27343847, 27696093. **బాపట్ల - జీ బీ సీ రోడ్;** PLN3SGL28539664. **భీమవరం - ప్రకాశ్ చౌక్;** PEG7SGL23756437, 24942681. **బొబ్బిలి - పెద్ద బజార్ మెయిన్ రోడ్;** PKI4SGL25471187, 27040237, 27535436, 27791604. **చిలకలూరిపేట్ - ఎన్ఆర్‌టి సెంటర్;** PJU5SGL16497144, 24026028, 24295817, 28951075. (11-08-26) **చిరాల - సంత బజార్;** PEJ9SGL17543666, 25541171, 26778709, 27061908. **గుడివాడ - టీజీఎల్;** PNS1SGL24892602, 27206247, 27210441. **గూడూర్;** P5N7SGL11077555. **గుంటకల్ - వెజిటబుల్ మార్కెట్;** PBV9SGL13853488, 15373531, 17651590, 17690245, 17691566, 25423900, 25721598, 27420138, 28021259. **గుంటూర్ - మంగళగిరి;** POL8SGL28264365. **గుంటూరు - వినుకొండ;** PMM3SGL16545788, 17909237. **హిందూపుర్ - ధన లక్ష్మి రోడ్;** PEG4SGL24303046, 26194560, 26800830, 27197524, 28258810, 28319139. **జంగారెడ్డిగూడెం - ఏలూరు మెయిన్ రోడ్;** PGH1SGL24097496. **కదిరి - ఎన్‌టీఆర్ సర్కిల్;** PIW8SGL26221999, 26189181, 26447139, 26472705, 27044575, 27599732, 28275771, 28511068, 28877582. (12-08-26) **కాకినాడ - సర్పవరం జంక్షన్;** PIW2SGL29075805, 29085658. **కాశీబుగ్గ - కేటీ రోడ్;** PEG5SGL25655738. **మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్;** PEG6SGL18020553, 24486214, 24931249, 26721772, 26970701. **నందిగామ - మెయిన్ రోడ్;** PLN1SGL16188334, 25548558, 27067555, 27338052. **నంద్యాల్ - శ్రీనివాస్ నగర్;** PEO1SGL10385305, 25467193, 26245041, 27546369. **నర్సారావుపేట్ - అరుండేల్‌పేట్;** PEO2SGL13852828, 14171625, 17866316, 26427116. **నర్సీపట్నం - మెయిన్ రోడ్;** PIW7SGL28864538. **నెల్లూర్ - టీజీఎల్;** PNZ6SGL28032160, 28252862. **నెల్లూర్ - కనకమహల్ సెంటర్;** PI9ISGL15452905, 15451073, 15452473, 27614630. (13-08-26) **నెల్లూర్ - నవాబ్‌పేట్;** PXB4SGL26172039, 28019740. **నెల్లూర్ - వేదయపాలెం;** PXB5SGL24752721, 28653393. **ఒంగోలె అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్;** PEJ8SGL11930110, 17790340, 25836490, 27172888. **పార్వతీపురం - ఆర్‌టీసీ బస్ స్టాండ్;** PML2SGL25556291, 27596908. **పీలేరు - కడప రోడ్;** PEG3SGL25485940, 28132437. **పొన్నూర్ - బస్ స్టాండ్;** PLN2SGL27186782, 28546962. **పులివెందుల - అంకలమ్మపేట్ట;** PMM4SGL27158625, 27156901. **రైల్వే - కోడూరు నేతాజీ రోడ్;** PGC5SGL25101202, 25084985, 25418441, 27333699, 29062372. **రాజమండ్రి - దేవీ చౌక్;** PBW3SGL25699104. (14-08-26) **రాయచోటి - బంగ్లా రోడ్;** PBW4SGL23767164, 24904656, 24948977, 25661201, 26452593, 27169521, 27780633, 28028230. **శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్;** PBW5SGL26817247, 27751487, 28013231. **శ్రీకాళహస్తి - మెయిన్ రోడ్;** PGC6SGL27257799. **శృంగవరపు - కోట;** PBW6SGL27564977, 28245784, 28476018. **సుల్లూర్‌పేట - పాండు రంగ స్ట్రీట్;** PBW7SGL25837627, 26710044, 27356226, 27346864. **తాడిపత్రి - యల్లనూర్ రోడ్;** PBW8SGL26807364. **తెనాలి - గాంధీ చౌక్;** PEK2SGL17403182. **తిరుపతి - బైరాగి పట్టెడ;** PMB8SGL27195006, 27369572. **తుని - సినిమా రోడ్;** PBW9SGL27408477, 27404454. (17-08-26) **విజయవాడ - అజిత్ సింఘ్ నగర్;** PLB9SGL15501837, 17964132, 17939568, 18047057, 24885157, 26246286, 26832737, 29080824. **విజయవాడ - భవానిపురం;** PMB1SGL8867798, 14265401, 27348422. **విజయవాడ - పట్టి నగర్;** PMB3SGL24916053. **విజయవాడ - ఏలూరు రోడ్;** PMB2SGL12794290, 14107925. **విజయవాడ - గవర్నర్‌పేట్;** PMB7SGL27201580, 27730000, 28698511. **విజయవాడ - ఇబ్రాహీంపట్నం;** PMB6SGL14218689, 17564994, 17777551, 18208226, 24627529, 25696378, 28151643. **విజయవాడ - మొఘల్‌రాజ్‌పురం;** PGA8SGL27052507, 28293918, 28904564. **విజయవాడ - రామవరప్పాడు;** PMB5SGL13097094. **విజయవాడ - సత్యనారాయణపురం;** PMB4SGL18333863. (18-08-26) **వైజాగ్ - టీజీఎల్;** PNQ5SGL26847019, 27198833, 27783829, 28700011, 28659290. **వైజాగ్ - దాబాగార్డెన్స్;** PI55SGL27520779. **వైజాగ్ - ద్వారకానగర్;** PI52SGL27248541, 28248590, 28494350. **వైజాగ్ - గోపాలపట్నం;** PB91SGL28691258. **వైజాగ్ - హెచ్‌బీ కాలనీ;** PI58SGL28955331. **వైజాగ్ - కంచరపాలెం;** PI54SGL24596758, 25747481, 26431695, 26452234, 27399324. **వైజాగ్ - కూర్మన్నపాలెం;** PI57SGL17566811. **వైజాగ్ - మధురవాడ;** PI93SGL25443908, 25890393, 27050030, 27052951, 27587977, 28863079. **వైజాగ్ - మురళీనగర్;** PIM1SGL24916114. (19-08-26) **వైజాగ్ - నాద్ జంక్షన్;** PI94SGL26864082, 26843135, 27082187. **వైజాగ్ - సీతమ్మధార;** PI53SGL16698991, 27718220. **వైజాగ్ - పాత గాజువాక;** PB47SGL17823884, 25477128, 26760176, 27354648. **వైజాగ్ - పెదగంట్యాడ;** PMK9SGL24716293. **వైజాగ్ - పెదవాల్తేరు;** PB3SGL22405448, 27417036. **వైజాగ్ - వేపగుంట;** PI92SGL15456300, 16368133, 17444456, 23813571, 24983175. **వైజాగ్ - రవీంద్ర నగర్;** PI95SGL15075404, 28561501, 29063323. **విజయనగరం - ఎం జి రోడ్;** PBX1SGL15412457, 24059922, 28477852. **విజయనగరం - వంత రోడ్;** PCZ4SGL26214130.

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

వార్త

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

- సెయింట్ థెరిస్సా

# ఆర్థిక విధానాలపై ఆత్మపరిశీలన?

**శక్తికి మించిన సహకారం కానీ, సహాయం కానీ చివరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయడం అంత మంచిది కాదు. మోయలేని భారం తలకెత్తుకుంటే మొదటికే మోసం వస్తుందన్న విషయం విస్మరించకూడదు. ఏదో ఒకటి, రెండు సందర్భాల్లో అయితే అర్థం చేసుకోవచ్చు, అభినందించవచ్చు. కానీ అదే పనిగా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకుండా అందిన కాడికి అప్పులు తెచ్చి ఖర్చుపెడితే అది వ్యక్తికి కానీ, సంస్థకు కానీ, ప్రభుత్వానికి కానీ ఒకనాటికి చేతులు ఎత్తక తప్పదు. దివాలా బాటపట్టక తప్పదు. ఇదేమీ కొత్త విషయం కాదు. అందరికి తెలిసిందే. ఎన్నో సంస్థలు వ్యక్తులు చివరకు ప్రభుత్వాలకు కూడా ఒకనాడు ఎంతో దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరుకున్న ఉదాహరణలు కోకొల్లలు. ప్రపంచంలో ఎన్నో దేశాలు అవగాహన, భవిష్యత్ దృష్టి లేని నిర్ణయాలతో అతలాకుతలమై పతనాంచుకు చేరుకున్న విషయం తెలియందేమికాదు. పొరుగునున్న శ్రీలంకను తాజాగా ఉదహరించవచ్చు.**

దామెర్ల సాయిబాబ

చాలా రోజుల తర్వాత కలిసిన మిత్రుడిని పరామర్శిస్తూ ఎలా ఉన్నావు? ఏం చేస్తున్నావు అని అడిగాడట ఒక పెద్ద మనిషి. నాకేంటి హాయిగా సొంత ఊర్లో కడుపులో చల్ల కదలకుండా వ్యవసాయం చేస్తున్నానని జవాబు ఇవ్వడంతో, ఎన్ని నాగళ్ల వ్యవసాయమని ప్రశ్నించాడట. నాది మా పటేల్‌ది కలిస్తే వంద నాగళ్ల వ్యవసాయమని తకీమని జవాబు చెప్పాడట. కానీ ఆయన వేషభాషలో, వ్యవహార తీరు చూస్తే ఆ స్థాయిలో ఉన్నట్లు కన్పించకపోవడంతో ఆ వంద అరకలకు సంబంధించి రెండు వందల ఎద్లలో నీవెన్ని ఎద్లంటే ' దొడ్లో కాలు విరిగిన ఎద్దులేస్తే, దొంగలు కొట్టుకుపోయిన ఎద్దు దొరికితే, అత్తవారింటి నుంచి వారు ఇస్తామన్న ఎద్దును తోలుకువస్తే, షావుకారు ఎద్దు కొనుగోలుకు ఇస్తానన్న అప్పు ఇస్తే నావి నాలుగెద్దు అవుతాయన్నాడట. అంటే ఆయన వద్ద ఉన్నది ఒకే ఒక ఎద్దు. అది కూడా కాలువిరిగి దొడ్లో పడి ఉంది. ఆయన చెప్పుకుంటున్నది మాత్రం రెండువందల ఎద్లతో వ్యవసాయం చేస్తున్నట్లు. ఇలానే ఉంది దేశంలోని అనేక రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి. ఖజానాలో నిధులు నిల్వలేవు. ఉద్యోగుల జీతభత్యాలు నెలనెలా చెల్లించడం కోసం వెతుకులాడుకోవల్సి వస్తుంది. నిత్యం రుణాల వేటలో చాలా రాష్ట్రాలు మునిగి తేలుతున్నాయి. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అభివృద్ధిచేయాలంటే అప్పులు చేయాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. కానీ దానికి ఒక పద్ధతి, విధి విధానాలుండాలి. తీర్చే మార్గాలు ఆలోచించాలి. అవేమీ పట్టించుకోకుండా అప్పు దొరకడమే ఎంతో అదృష్టంగా భావిస్తూ అప్పుల వేటలో నిత్యం అన్వేషణలో ఉండడం ఏమాత్రం సమంజసం కాదు. శక్తికి మించిన సహకారం కానీ, సహాయం కానీ చివరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయడం అంత మంచిది కాదు. మోయలేని భారం తలకెత్తుకుంటే మొదటికే మోసం వస్తుందన్న విషయం విస్మరించకూడదు. ఏదో ఒకటి, రెండు సందర్భాల్లో అయితే అర్థంచేసుకోవచ్చు, అభినందించవచ్చు. కానీ అదే పనిగా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోకుండా అందిన కాడికి అప్పులు తెచ్చి ఖర్చుపెడితే అది వ్యక్తికి కానీ, సంస్థకు కానీ, ప్రభుత్వానికి కానీ ఒకనాటికి చేతులు ఎత్తకతప్పదు. దివాలా బాటపట్టక తప్పదు. ఇదేమీ కొత్త విషయం కాదు. అందరికి తెలిసిందే. ఎన్నో సంస్థలు, వ్యక్తులు, చివరకు ప్రభుత్వాలకు కూడా ఒకనాడు ఎంతో దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరుకున్న ఉదాహరణలు కోకొల్లలు. ప్రపంచంలో ఎన్నోదేశాలు అవగాహన, భవిష్యత్ దృష్టిలేని నిర్ణయాలతో అతలాకుతలమై పతనం అంచుకు చేరుకున్న విషయం తెలియందేమికాదు. పొరుగునున్న శ్రీలంకను తాజాగా ఉదహరించవచ్చు. ఇప్పటికీ ఆ దేశం ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకో లేకపోతున్నది. భారత్‌లో ఎన్నో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆర్థిక నిపుణులు ఎంతో కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. డబుల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రపెద్దల సహాయ సహకారాలతోకొంత మేరకు ఆర్థికపరిస్థితి మెరుగ్గాకన్పిస్తున్నా తెలంగాణ రాష్ట్రంఅప్పుల ఊబిలో కూరుకుపోతున్నదేమోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అప్పుల మీద అప్పులు తెచ్చుకుంటున్నారు. ఇష్టానుసారంగా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి

## ఒక్క మాట

అప్పులు డెబ్బైవేల కోట్లరూపాయలలోపలే ఉంటే ఆతర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించిన నిధులతో దాదాపు ఏడెనిమిది లక్షల కోట్లకుపైగా పెరిగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు వడ్డీలతో సహా, తాముఎన్నికల్లో ప్రకటించిన హామీలను పూర్తి చేసేందుకు కొత్తగా అప్పులుచేయాల్సి వస్తున్నది. చేసిన అప్పులకు ఏటా ముప్పయ్ వేలకోట్ల రూపాయలకు పైగా వడ్డీయే చెల్లిస్తున్నారు. ఆదాయానికి వ్యయానికి మధ్య నెలకుదాదాపు రెండు వేల రెండువందల కోట్లరూపాయలకు లోటు ఉంటున్నదని ఆర్థికశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పాతపథకాలు రద్దుచేసే పరిస్థితి లేదు. తాము ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేయాలంటే నిధుల కొరత, దీంతో అందర్నీ సంతృప్తి పరిచేందుకు విత్త మంత్రి పడుతున్న ఇబ్బందులు, చేస్తున్న విన్యాసాలు అన్నీఇన్నీ కావు. ప్రతి అవసరానికి అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. జీతభత్యాలకే కాదు సంక్షేమకార్యక్రమాలకు, ఇతర నిర్మాణాత్మక పనులకు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితులుఏర్పడుతున్నాయి. 'పిట్టను కొట్టా పొయ్యిలో పెట్ట' అన్నట్లుగా ఉంది ఆర్థికపరిస్థితి. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో చాలాప్రాంతాల్లో కాంట్రాక్టర్లు పనులునిలిపివేశారు, మరికొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడక నడుస్తున్నాయి. ఆలస్యం అయ్యేకొద్దీ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఆ భార మంతా ప్రభుత్వం మీద పడుతుంది. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నలక్షలాది బలహీన వర్గాలకు చేయూతనివ్వాల్సిందే. వారికి అన్నిరకాల సహకారాలు అందించాల్సిందే. ప్రజాస్వామ్యవాదులుఎవరూ దీనిని వ్యతిరేకించలేరు కూడా. కానీ వారి పేరు మీద జరుగుతున్న దోపిడీ మాటేమిటి? వారిని చూపి అనర్హులకు వందలాది కోట్లు అప్పగించడం ఎంతవరకు సమంజసం? అవినీతి, అభివృద్ధి కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుపుతుంటే అవినీతి వెనక్కి గుంజుతుంటుంది. కానీ ఎక్కడ అభివృద్ధిఉంటుందో అక్కడే అవినీతి ఉంటుంది. వేలాది కోట్ల రూపాయలను వడ్డీకి తెచ్చుకుంటున్న డబ్బును ఇలాదుర్వినియోగం చేయడం ఎంతవరకు న్యాయమో పాలకులు ఒక్కసారి ఆలోచించాలి. ప్రజాసేవ కోసమే ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనట్లుగా చెప్పుకుంటున్న కొందరు నేతలు పర్సెంటేజీలు బాహాటంగా తీసుకుంటున్నారు. బహిరంగంగానే చర్చ జరుగుతున్నది. ఇక కీలక పదవుల్లో ఉన్న కొందరు అధికారుల అవినీతి అదుపు లేకుండాపోతున్నది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చేస్తున్న దాడుల్లో వందలాది కోట్లవిలువైన ఆదాయానికి మించిన ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. మొన్న బుధవారం పట్టుబడ్డ ఓ అధికారి రెండు వందల కోట్ల రూపాయల అక్రమార్జనను ఏసిబి అధికారులు కనుగొన్నారు. ఆ విభాగంలో ఎంతో మంది పై అధికారులు ఉంటారు. వాళ్లందరి కళ్లుగప్పి ఇన్ని కోట్ల రూపాయలు అక్రమార్జనను ఎలాకూడగట్టగలిగాడో ఒక్కసారి ఆలోచించాలి. ఆ అధికారగణం ఏం చేస్తున్నట్లు? ఈ ఒక్క అధికారే కాదు ఏ విభాగం అధికారిపై ఆకస్మిక తనిఖీలు చేసినా వందల కోట్లఅక్రమార్జన ఆస్తులు బయటపడుతున్నాయి. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక పైకి ఎన్ని చెప్పుకుంటున్నా మరెంతో గంభీరంగా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులు ఏనాడో ఆరంభమయ్యాయి. ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలు, ప్రాజెక్టులు పూర్తిచేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో ఆర్థికనిపుణులే చెప్పలేకపోతున్నారు. ఆ స్థాయిలో నిధులు సమకూర్చుకోగలుగుతారు? అప్పులు తేవడం, పన్నులు వేయడం తప్ప మరో మార్గం లేదు. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన పన్నులు ప్రజా జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఇక అప్పులే మార్గం. ఇప్పటికే లక్షలాది కోట్లు అప్పుల్లో ఉన్నాం. వెయ్యి, రెండువేల కోట్ల చేబదుళ్లకు వెతుకులాడాల్సిన పరిస్థితుల్లో లక్షలాది కోట్లు సమకూర్చుకోవడం అంటే మాటలు కాదు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రవేశపెడుతున్న పథకాల విషయంలో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రభుత్వ శాఖల్లో నిజాయితీ పరులైన అధికారులను, సమర్థులను నియమించి కట్టుదిట్టం చేస్తే రెవెన్యూ రాబడి మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ కోణంలో రాజకీయాలకు అతీతంగా కృషి జరగాలి. అప్పులు చేయడం కంటే అనవసరపు ఖర్చులు తగ్గించుకొని నిర్మాణాత్మకాభివృద్ధి కార్యక్రమాలు చేపడితే తప్ప ఎన్నివేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చినా, మరెన్నివేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో ప్రజలపై భారం మోపినా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే అవకాశాలు కన్పించడం లేదు. ●

# కాయకష్టానికి కర్పూర తైలం

విధి విధానాల మార్పులతో పాత ఉపాధి పథకం కొత్త ఉపాధి పథకంగా కొత్త పేరుతో బయటికొచ్చేసింది. ఏ పథకమైనా ఏలిన వారు ఉద్దేశ్యం ఒకటైతే దాని అమలులో విఫలమవడం తథ్యమంటూ విపక్షాల శాపనార్థాలతో వెలుగు చూడటం కద్దు! మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకాన్ని కొన్నికొత్త అంశాలు చేర్చి విబిజి రామ్‌జీ చట్టంగా జనంలోకి తెచ్చారు. కొత్త చట్టంలో రాష్ట్రాలపై పెను భారం మోపగల నిబంధనలున్నాయని ఇప్పుడువిపక్షాలు గగ్గోలు పెడుతుండటం తెలిసిందే. ఈ పథకం మార్పుతో వివిధ రాష్ట్రాలను సమాయత్తపరిచేందుకు న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విపక్షాలు గట్టిగానే ఆ పథకంలో మార్పులను సూచించారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ హయాంలో అంకురార్పణ ఈ 'ఉపాధి హామీ' చట్టాన్ని తప్పనిసరిగా మార్చాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించుకున్నాక ఉపాధి హామీ పనికాలాన్ని పెంచింది. అంతే తప్ప పథకం మెరుగుదలకు ప్రత్యేక మార్పులేవీ ఉన్నట్లు లేదు. గతంలో పదేళ్లకుపైగా ఈ పథకం గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నిరంతరాయంగానే సాగినా వ్యవసాయరంగానికి తూట్లు పొడిచింది. కూలీలకు, శ్రామికులకు ఉపాధి నిధులు ముదుతున్నందున ఈ పథకం లబ్ది ద్వారా వారు ఆయా కూలీల కుటుంబాల్లో వెలుగునింపాయనడంలో ఎవరికీ ఏఅభ్యంతరం లేదు. ఈ పథకం కింద నిర్దేశిత రోజులుమాత్రమే కూలీలకు సొమ్ము ముట్టేది. గ్రామీణ ఉపాధి పనులన్నీ వ్యవసాయానికి సానుకూల పనులు కానందున వారంతా వ్యవసాయ పనుల అలవాట్ల నుంచి దూరంగా జరిగారు. కాయకష్టం చేసుకునే వారికి ఏపనైనా ఒకటే అంటుంటారు. కాగా వారు వ్యవసాయే తర పనుల అలవాట్లు తగ్గాయి. నిర్దేశిత పనుల్లోనే కాలక్షేపం చేసి వ్యవసాయ పనుల విషయంలో నైపుణ్యత కోల్పోయారు. ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల వేతనాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించేది. అందుచేత రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఎలాగూ ఉండేది కాదు. చాలీచాలని నిధులతో వివిధ పథకాల నుండి సర్దుబాటు చేసే స్థాయికి చేరుకున్నారు. కేంద్రం నిధులు అందించని సమయాల్లో ఉపాధి కూలీలు ఇబ్బందిపడేవారు. తాజాగా చూస్తే ఉపాధి కూలీలకు 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం మీద భారం పడేది. మెటీరియల్ కాంపొనెంట్‌లో కూడా 25 శాతం కేంద్రం ఇచ్చేది. మార్చిన పేరెలా ఉన్నా, మార్చిన విధానాల మేరకు 60:40 నిష్పత్తిలో ఖర్చు చేయాల్సి వచ్చింది. దామాషా నిర్ణయాలలో లెక్క చూస్తే తెలంగాణ వాటాగా 2వేల కోట్ల వరకు ఆర్థిక భారం పెరుగుతుంది. అదీగాక కొత్త చట్టం విబిజి రాంజీ ప్రతిపాదించిన కొన్ని నిబంధనలలో పేదలు వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా రూపొందించారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రాల అభిప్రాయం తీసుకోకుండా వారిపై ఆర్థిక భారం మోపడం సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం అభిప్రాయపడ్తోంది. కొత్తచట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రాలకు 60శాతం నిధులందిస్తుంది. మిగిలిన నిధులు 40 శాతం రాష్ట్రాలే భరించి 'విబిజి రామ్‌జి' పథకం విజయం పొందినట్లుగా చెప్పుకోవాలి. ఇలా అదనపు భారం భరించలేని తెలంగాణ రాష్ట్రం ఈ పథకం అమలులో మీమాంసలు వ్యక్తం చేస్తోంది. దేశ వ్యాప్తంగా ఈపథక నిర్వహణ పట్ల ఏరాష్ట్ర ప్రభుత్వమూ సానుకూలంగా లేదు. 'రామ్‌జీ' చట్టం గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరచడంతోపాటు గ్రామీణ పంచాయతీల అధికారాలను తగ్గించి రాష్ట్రాల పాత్రను పరిమితం చేస్తోందన్న ఆరోపణ తెలంగాణ ప్రభుత్వానిది. తమవంతు నిధుల బాధ్యతలను స్వీకరించకుండా తమ పాత్ర తగ్గిపోతోందనడం కరెక్ట్‌గా లేదని పథకం రూపురేఖలు, ప్రయోజనాలు సైతం మారినందున 'జీ రాంజీ'ని నిర్వహించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేస్తోంది. ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు పర్యవేక్షణ వంటి అంశాల్లో కీలకఅధికారాలను కేంద్రం వద్దనే ఉంచుకోవడం రాష్ట్రాలను కించపరచడమేనని ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భావన. ఏది ఏమయినా కేంద్రం రాష్ట్రాలతో చర్చించకుండా అధిక భారం మోపడం లోపభూయిష్టమే. వీబీ -జీరామ్‌జీ పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక భారం అనే అంశం తప్పిస్తే చాలా ప్రయోజనాలున్నాయనే చెప్పాలి. గతం కన్నా ఈసారి కూలీల వేతనం పెరిగింది. అప్పట్లో ఉపాధికూలీలు ఈ పథకం ఆసరాచూసుకుని కూలీ పనులకు ఎవరూ వచ్చేవారు కాదు. వ్యవసాయానికి కూలీలు దొరికే వారు కాదు. దాంతో సాగు ఖర్చులు రైతుకి బాగా పెరిగిపోయాయి. ఇప్పుడు'ఉపాధి కూలీ రేట్లు పనిచేయదగిన పనిరోజులు కూడాపెరిగాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఈ పథకానికి వ్యవసాయానికి అనుబంధంగా రూపకల్పన చేస్తే ఉభయతారకంగా ఉంటుందని రైతు సంఘాలు కోరుతున్నాయి. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టం 'జీ రామ్ జీ' వేతనాలు పెరిగాయి. కాబట్టి కూలీల ఉపాధి సొమ్ము కూడా వారికి అందుబాటులోనే. దీనిని వ్యవసాయదారుల పనులకు అనుసంధానిస్తే ప్రభుత్వం ఇచ్చే నెలబాటు ఖర్చుకి తోడు రైతులు కూడా మరికొంత సొమ్ము చెల్లిస్తారు. కనుక కూలీల ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయానికి కూలీల లభ్యతపై నీలినీడలు ఏర్పడవు. ఉపాధిహామీ పథకంలో యేటా కనీసపనిదినాలను తాజాగా 125 రోజులకు పెంచారు. రోజువారీ వేతనం గరిష్టంగా రూ.409గా కనిష్టం రూ.300గా ఖరారయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాల్లో కూలీల జీతనాతాలు పెరిగినట్లే! కానీ మోయాల్సిన నిధుల భారం తలకెత్తుకుంటే రేపో మాపో రాష్ట్రాలు చేతులెత్తేస్తే కూలీల నోట్లో మన్ను తప్పదు.



సముద్రాన్ని దాటడానికి నావ వలే, స్వర్గానికి సత్యమొక్కటే సోపానంగానీ వేరొక దారిలేదు.

స్వామి వివేకానంద



నౌకకు అండగా నిలిచే నీళ్లే ఒక్కోసారి నౌకను తలకిందులు కూడా చేయగలవు.

తిరువళ్లువర్

# గ్లోబల్ సిటీలో ప్రజారోగ్యంతో ఆటలా?

పురుషోత్తం నారగౌని

హైదరాబాద్.. భాగ్యనగరం పర్యాటక రంగంలో ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకోవాలని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించాలని నిరంతరం తపిస్తున్న నగరం. కానీ, అదే నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి విక్రయశాలల్లో మనం తినే ఆహారం పరిస్థితి ఏమిటి? తాజాగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూస్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు ఫ్రాన్స్‌తో పర్యాటక భాగస్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేకపోవడం ఏ రకమైన అభివృద్ధి? ఇది ఖచ్చితంగా మన నగరానికి పట్టిన మాయని మచ్చ. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదిక కావాలంటే, కేవలం అద్దాల భవనాలు, ఫ్లైఓవర్లు సరిపోవు. ఇక్కడికి వచ్చే పర్యాటకుడు, నివసించే సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకులప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల దురాశకునిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, మరుసటి రోజు అదే హోటల్ యజమానిని వదిలేయడం ఏ రకమైన న్యాయం? ఒక హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజా ఆరోగ్యంతో ఆడుకోవడమే అవుతుంది. దీన్ని కేవలం ఒక 'ఉల్లంఘన'గా చూడకూడదు, ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న 'నేరం'గా పరిగణించాలి. ఆయా హోటళ్ల యజమానుల వెనుక ఉన్న రాజకీయ రక్షణ, వ్యవస్థలోని లొసుగులువారిని భయం లేకుండా చేస్తున్నాయి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్‌సేఫ్టీ ఆడిట్' విధానాన్నితీసుకురావాలి. కేవలం దాడులు చేయడం కాదు, ప్రతి రెస్టారెంట్‌కు ఒక 'హైజీన్ రేటింగ్' ఇవ్వాలి. ఆ రేటింగ్ బోర్డును హోటల్ ముందు ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి. కనీసం మూడుసార్లు నిబంధనలు అతిక్రమించిన హోటల్‌లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేసే చట్టాలు అమలు చేయాలి. వంటశాలలను మూసివేయ డం కాదు, ఆ అపరిశుభ్రతకు కారణమైన అవినీతి వ్యవస్థ ను మూసివేయండి. అప్పుడే నిజమైన 'గ్లోబల్ సిటీ'గా గర్వంగా చెప్పుకోగలం. ●

## ప్రజావాక్కు



### నదుల అనుసంధానం అవసరం

ఉత్తరాన గంగా, దక్షిణాన కావేరి నదుల అనుసంధానం భారత జలవనరుల చరిత్రలో విప్లవాత్మక అడుగు అవుతుంది. దేశంలో నీటి కొరత కంటే నీటి అసమాన పంపిణీ ప్రధాన సమస్య. వరదల సమయంలో సముద్రంలో కలిసిపోయే మిగులు జలాలను కరువుప్రాంతాలకు మళ్లించగలిగితే సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారంలభిస్తుంది. వ్యవసాయ ఆధారితదేశమైన భారత్‌కు నదుల అనుసంధానం ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. తుంగభద్ర డ్యామ్ 33క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రజలశక్తిమంత్రి సమక్షంలోఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొనడం సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం. 2024లో 19వ గేటు దెబ్బ తిన్నతర్వాత స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేసి, అనంతరం రూ.51 కోట్లతో కొత్త గేట్లను ఏర్పాటు చేయడం రైతుల ప్రయోజనాలను కాపాడింది. ఈసందర్భంగా చంద్ర బాబు నాయుడు గోదావరి-కావేరి, తదుపరి గంగా-కావేరీ అనుసంధానం దేశభవిష్యత్తుకు అత్యవసరమని పేర్కొన్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సర్వేయర్‌లతో భూ కబ్జాలు సరి చేయండి

మండల కేంద్రాలలో ఉన్న కాలనీలలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి భూమి కబ్జాల దరఖాస్తులు పరిష్కారం చేయాలి. ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలాలు కూడా కబ్జాలు జరిగి అక్రమ మరుగుదొడ్లు నిర్మాణం చేయడం జరిగింది. కావున తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ శాఖ రికార్డులు తీసి సర్వేయర్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భూమి కబ్జాలు పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### అందరినీ సమానంగా చూడాలి

నేటి సమాజంలో ఒక తల్లి తన కొడుకుల్ని ఒకరిని ఎక్కువ ఒకరిని తక్కువ చేస్తుండడం వలన కుటుంబ వైరాలు పెరిగి గొడవలు జరుగుతున్నాయి. తల్లి అందరినీ సమానంగా చూసి అందరూ ఎదిగే విధంగా చూస్తేనే ఆ తల్లి జన్మకు ముక్తి లేదంటే ఈ జగత్తులో జీవించి వృథా.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మద్యాన్ని నిషేధించేదెప్పుడు?

మద్యపానం నేడు అనేక కుటుంబాల ఆనందాన్ని దూరం చేస్తున్న ఒక ప్రమాదకరమైన దురలవాటు. క్షణిక సుఖం కోసం మద్యాన్ని ఆశ్రయించే వారు తెలియకుండానే తమ ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిని, కుటుంబ బంధాలను కోల్పోతున్నారు. మద్యం వల్ల శారీరక, మానసిక సమస్యలు పెరిగి జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురికావడంతో పాటు పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుంది. తాత్కాలిక మత్తు ఇచ్చే మద్యం శాశ్వత నష్టాలను మిగులుస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకొని మద్యానికి దూరంగా ఉండడంద్వారా వ్యక్తి, కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో పయనించగలవు. మద్యాన్ని ఎంత త్వరగా నిషేధిస్తే అంత మంచిది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### జీతాల పెంపు అవసరం

దేశంలో జరిగే ప్రతీ ఆర్థిక లావాదేవీలు, ధరల పెరుగుదలలు, పన్నులు అన్నీఉద్యోగుల జీతాలు పెంచితే ఆగిపోతాయి. అందువల్ల అందరికి జీతాలు పెంచాలా అనే భావన ప్రతీ రాజకీయ నాయకుడికీ ఉంది. మరి వారు ఒక వేలు చూపితే నాలుగు వేళ్ళ వారిని వెక్కిరిస్తూ.. అయ్యా మీ విదేశాల ట్రిప్పులు, సెక్యూరిటీ ఖర్చులు, వాహనాలు మీ వేతనాలు, మీ సమావేశాల అతిఖర్చులు, మాట్లాడితే మీ తాతల విగ్రహాలు, మీ ప్రసంగాలు, మీ సినీటైపు కార్ల ఊరేగింపులు ఇంకా చాలా ఉన్నాయి. వీటికి ఖర్చు ఎక్కువే. అందుకని అయ్యా.. ఓ మోస్తారు జీతాల పెంపుదలకే తలనొప్పి వస్తే ఇక 6 నెలల ఎరియర్స్‌కు మీకు ఎలాటి ఇబ్బంది వస్తుందో ఆలోచించండి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### వనరులను దుర్వినియోగం చేయొద్దు


పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింత క్రుంగదీస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి తోచిన విధంగా వారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ఇలా అన్ని ఉచితాలు ఇస్తు పోతూ రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాలవల్ల లబ్ధి పొందుతున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తే బాగుంటుంది. ముందస్తు ప్రణాళికతో వనరులను సమకూర్చుకోవడం, వాటిని దుబారా చేయకుండారేపటికోసం దాచుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

# సమాన విద్యావకాశాలకు పెరుగుతున్న సవాళ్లు

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశంలో విద్యను సామాజిక మార్పుకు, ఆర్థిక అభివృద్ధికి, వ్యక్తిగత పురోగతికి, సమాన అవకాశాల సాధనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా భావిస్తారు. ముఖ్యంగా గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు విద్య మాత్రమే జీవితాన్ని మార్చగల సాధనం. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రవేశ పరీక్షలు, అర్హత పరీక్షలు, ఉద్యోగ పరీక్షలు, పోటీ పరీక్షలు అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించబడాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత, నిష్పక్షపాత ధోరణి, సిలబస్‌కు నిబద్ధత అనే నాలుగు సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. అయితే ఇటీవల కొన్ని పరీక్షలలో అధికారికంగా ప్రకటించిన సిలబస్‌కు మించి, విడుదల చేసిన బ్లూప్రింట్‌కు విరుద్ధంగా, అత్యంత క్లిష్టమైన స్థాయిలో ప్రశ్నలు ఇవ్వబడుతున్నాయనే అభిప్రాయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలలో పెరుగుతోంది. పరీక్షా సంస్థలు ముందుగా సిలబస్‌ను ప్రకటిస్తాయి. పరీక్ష నమూనా, బ్లూప్రింట్, మార్కుల పంపిణీ, ప్రశ్నల స్థాయి వంటి అంశాలపై మార్గదర్శకాలు విడుదల చేస్తాయి. విద్యార్థులు కూడా అదే ఆధారంగా తమ ప్రణాళికలను రూపొందించుకుంటారు. పాఠ్యపుస్తకాలు చదువుతారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో సిద్ధమవుతారు. సంవత్సరాల పాటు కష్టపడతారు. అయితే చివరికి పరీక్షా మందిరంలో ఎదురయ్యే ప్రశ్నలు సిలబస్‌కు అతీతంగా లేదా ప్రకటించిన నమూనాకు భిన్నంగా ఉంటే అది విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇది కేవలం ఒక పరీక్షలో వచ్చిననిరాశ మాత్రమే కాదు, అది వారిభవిష్యత్తుపై పడే భారమైన ప్రభావం. ప్రస్తుతం దేశంలో నిర్వహిస్తున్న కొన్ని ప్రవేశపరీక్షలు, అర్హత పరీక్షలు, పోటీ పరీక్షలు, నియామక పరీక్షలలో ప్రశ్నల స్థాయి అవసరానికి మించి పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్లికేషన్ స్థాయి ప్రశ్నలు అవసరమే అయినప్పటికీ అవి కూడా సిలబస్ పరిధిలోనే ఉండాలి. సిలబస్‌ను దాటి, ప్రత్యేక కోచింగ్ కేంద్రాల్లో మాత్రమే బోధించే అంశాలను పరీక్షలలో అడగడం సమాన అవకాశాల భావనకు విరుద్ధం. పోటీ పరీక్షలు ప్రతిభను పరీక్షించాలి కానీ విద్యార్థుల సామాజిక, ఆర్థిక నేపథ్యాలను పరీక్షించకూడదు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. వారికి అత్యాధునిక కోచింగ్ సెంటర్లు, ప్రత్యేక అధ్యయన సామగ్రి, ఖరీదైన శిక్షణా కార్యక్రమాలు అందుబాటులో ఉండవు. వారు ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఉపాధ్యాయుల బోధనపై ఆధారపడుతుంటారు. అధికారిక సిలబస్‌నే తమ ఆయుధంగా భావించి సిద్ధమవుతారు. కానీ పరీక్షల్లో సిలబస్‌కు అతీతమైన ప్రశ్నలు ఎదురైతే వారి శ్రమ ఒక్కసారిగా విలువ కోల్పోయిన భావన కలుగుతుంది. దీనివలన గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కూడా ఇలాంటి పరిస్థితుల వలన తీవ్రంగా నష్టపోతున్నారు. అనేక కుటుంబాలు అప్పులు చేసి పిల్లలను చదివిస్తుంటాయి. కోచింగ్ ఫీజు



లు, వసతి ఖర్చులు, పుస్తకాలు, ప్రయాణ ఖర్చులు భరించలేకపోయినా, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులుఅనేక త్యాగాలు చేస్తుంటారు. కానీ సిలబస్‌కు భిన్నమైన పరీక్షా విధానం కారణంగా వారి ఆశలు నిరాశగా మారుతున్నాయి. విద్యార్థుల కృషి కంటే అదనపు వనరులు కలిగిన వారికి మాత్రమే ప్రయోజనం కలిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కేవలం వ్యక్తిగత నష్టం కాదు, సామాజిక అసమానతలకు కూడా కారణమవుతోంది. ఉన్నత విద్యలో ప్రవేశాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత వృత్తి అవకాశాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా విద్యలో వైరుధ్యాలు, ఉపాధిలో వైరుధ్యాలు, ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయి. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల సూత్రానికి కూడా విరుద్ధం. అర్హత పరీక్షల విషయంలో ఈ సమస్య మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉపాధ్యాయఅర్హత పరీక్షలు, వృత్తి అర్హత పరీక్షలు, ఇతర అర్హత పరీక్షల ముఖ్య ఉద్దేశ్యం కనీస నైపుణ్యాలను అంచనా వేయడం మాత్రమే. కానీ అర్హత పరీక్షలను అత్యంత క్లిష్టంగా మార్చడం వలన అనేక మంది అభ్యర్థులు కనీస అర్హత మార్కులను కూడా సాధించలేకపోతున్నారు. అర్హతే సాధించలేకపోతే ఉద్యోగ అవకాశాలకు ద్వారాలు మూసుకుపోతాయి. ఉద్యోగ అవకాశాలు లేకపోతే ఆర్థిక పురోగతి ఆగిపోతుంది. ఫలితంగా సామాజిక చలనశీలత కూడా తగ్గిపోతుంది. పరీక్షలలో అనవసరమైన కఠినత విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోంది. లక్ష్యాలను చేరుకోలేమనే భయం, కుటుంబ అంచనాలను నెరవేర్చలేమనే ఆందోళన, నిరంతర పోటీఒత్తిడి, అనిశ్చితి కారణంగా విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షల లక్ష్యం విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం కావాలి కానీ వారి జీవితాలను భారంగా మార్చడం కాదు. ప్రభుత్వాలు పరీక్షా సంస్థలు ఈ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి పరీక్ష తప్పనిసరిగా అధికారిక సిలబస్ ఆధారంగానే నిర్వహించబడాలి. విడుదల చేసిన బ్లూప్రింట్, మార్గదర్శకాలను యథాతథంగా పాటించాలి. ప్రశ్నాపత్రాల రూపకల్పనలో సిలబస్‌కు అతీతమైన ప్రశ్నలకు అవకాశంఉండకూడదు. విద్యార్థులు చదివిన అంశాలనుంచే వివిధ స్థాయిలలో ప్రశ్నలు ఇవ్వాలి. జ్ఞాపకశక్తి, అవగాహన, అన్వయం, విశ్లేషణ వంటి స్థాయిలను పరీక్షించవచ్చుకానీ అవన్నీ సిలబస్ పరిధిలోనేఉండాలి. ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాల రూపకల్పనలో ఎవరు పాల్గొంటున్నారు అనే అంశంపై కూడాపునరాలోచన అవసరం. ఆ తరగతిలో బోధించే పాఠ్యాంశాలపై ప్రత్యక్ష అనుభవం కలిగిన ఉపాధ్యాయులే ప్రశ్నాపత్రాల తయారీలో ప్రధాన పాత్ర పోషించాలి. పాఠ్యపుస్తకాల నిర్మాణం, విద్యార్థుల అవగాహన స్థాయి, తరగతి గదిలో ఎదురయ్యేసవాళ్లు, విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాలు వంటి అంశాలపై వారికి స్పష్టమైన అవగాహన ఉంటుంది. కాబట్టి వారురూపొందించేప్రశ్నాపత్రాలు విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉండే అవకాశం ఎక్కువ. సంబంధం లేని విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు లేదా కేవలం ఉన్నతస్థాయి నిపుణులు మాత్రమే ప్రశ్నాపత్రాల రూపకల్పనలో పాల్గొంటే నేలస్థాయివాస్తవాలు వారికి పూర్తిగా తెలియకపోవచ్చు. విశ్వవిద్యాలయ స్థాయి పరిజ్ఞానం, పాఠశాల స్థాయి బోధన మధ్య ఉన్న తేడాను గుర్తించకుండా ప్రశ్నలు రూపొందిస్తే విద్యార్థులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటారు. అందువల్ల బోధనలో నేరుగా పాల్గొంటున్న ఉపాధ్యాయ బృందం, అంశ నిపుణులు, పరీక్షా నిపుణుల సమన్వయంతో ప్రశ్నాపత్రాలు రూపొందించాలి. పరీక్షలపై విశ్వాసం నిలవాలంటే పారదర్శకత అత్యంత అవసరం. బ్లూప్రింట్ ప్రకటిస్తే దానిని తప్పనిసరిగా పాటించాలి. సిలబస్ ప్రకటిస్తే దాని పరిధిని దాటకూడదు. పరీక్షల అనంతరం సమాధాన కీలు, వివరణలు, విశ్లేషణలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అప్పుడే విద్యార్థులు, తల్లిదండ్రులలో విశ్వాసం పెరుగుతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# రూ.52వేల కోట్లతో రక్షణరంగ కొనుగోళ్లు

## రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన డీఏసీ ఆమోదం



**న్యూఢిల్లీ,జులై 3:**భారత రక్షణ రంగ బలాన్ని,త్రివిధ దళాల పోరాట సన్నద్ధతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఫోకస్ పెంచింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నేడు జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశంలో రూ.52 వేల కోట్ల అంచనా వ్యయంతో వివిధ కొనుగోలు ప్రతిపాదనలకు పరిపాలనా ఆమోదం లభించింది. ఆర్మీ, నౌకాదళం, వాయుసేన అవసరాల కోసం అత్యంత ఆధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిధులద్వారా చేకూర్చనున్నారు. ముఖ్యంగా యాంటీ డ్రోన్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, క్షిపణి వ్యవస్థల వంటి అత్యాధునిక సదుపాయాలను సమకూర్చుకోవడంపై ఈ రక్షణ కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇది సరిహద్దు భద్రతను మరింత సురక్షితం చేయనుంది. భారత సైన్యానికి లభించనున్న అత్యాధునిక రక్షణ శ్రేణి ఆర్మీకి మరిన్ని అత్యాధునిక ఆయుధాలను సమకూర్చనున్నారు. శత్రువుల ఆధునిక డ్రోన్ల నిఘాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆకాశ్ తరంగ్ యాంటీయా ఏవీ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్‌ను సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు. సాయుధ వాహనాల ముప్పును తిప్పికొట్టడానికి పదాతి దళ సామర్థ్యాన్ని పెంపొందించే మ్యాన్ పోర్టబుల్ యాంటీట్యాంక్ గైడెడ్ మిస్సైల్ వ్యవస్థలు సహాయపడతాయి. వైమానిక ముప్పుల నుంచి రక్షణ కల్పించేందుకు సహాయపడే మీడియం రేంజ్ సర్ఫేస్‌టుఎయిర్ మిస్సైల్ ఆయుధ వ్యవస్థకు కూడా ఆమోదం లభించింది. సైన్యం ఉపయోగించే అత్యాధునిక యుద్ధ ట్యాంకుల ప్రాణనష్టాన్ని నివారించడానికి, వాటి మనుగడను పెంచడానికి యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్ సిస్టమ్ కొనుగోళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యంత సున్నిత, సంక్లిష్ట వాతావరణంలో పనిచేసే మల్టీ స్పెక్ట్రల్ సెన్సింగ్ కలిగిన వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ రక్షణ కవచంలా పని చేస్తుంది. తక్కువ ఖర్చుతో, అధిక వినాశకర శక్తి ఉన్న జెట్ ఆధారిత కామికాజే డ్రోన్ వ్యవస్థను కూడా సైన్యం సొంతం చేసుకోనుంది. నౌకాదళం, వైమానిక దళాల సామర్థ్యాలకు ప్రాధాన్యం భారత నౌకాదళం బలోపేతం కోసం రక్షణ కొనుగోళ్ల మండలి కీలక కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శత్రు నౌకల కదలికలను నిరోధించేందుకు మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్ రక్షణ శిబిరంలో చేర నుంది. దీనితో పాటు సముద్ర విస్తీర్ణంలో నిరం తర నిఘా కోసం నావల్ షిప్‌బోర్న్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ ఉపయోగపడు తుంది. నౌకల ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ మో టార్లను సురక్షి తంగా పరీక్షించడానికి ల్యాండ్ బేస్డ్ టెస్టింగ్ ఫెసిలిటీ ని కూడా ఏర్పాటు చేయ నున్నారు. మరోవైపు, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) పక్షాన నిఘా వ్యవస్థను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రధానంగా ఫిక్స్డ్ వింగ్ బేస్డ్ హై ఆల్టిట్యూడ్ స్యూడో శాటిలైట్ కొనుగోలుకు డీఏసీ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రత్యేకమైన వ్యవస్థ ద్వారా ఎయిర్‌ఫోర్స్ సుదూర ప్రాంతాలలో నిరంతర పర్యవేక్షణ, శత్రు గూఢచర్యాన్ని పసిగట్టే సమాచారం సేకరించడం, కమ్యూనికేషన్ నెట్ వర్క్ కనెక్టివిటీని మరియు రిమోట్ సెన్సింగ్‌ను సమర్థవంతంగా చేపట్టవచ్చు. మొత్తంగా త్రివిధ దళాల సమగ్ర రక్షణ అవసరాలను తీరుస్తూ స్వదేశీ రక్షణ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఈ కొనుగోళ్ల ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ సరికొత్త ఆయుధ సంపత్తి రక్షణ బలగాల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో దేశీయ రక్షణ రంగాన్ని స్వావలంబన దిశగా నడిపించడంలో కూడా దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఇరాన్ అగ్రనేతల హత్యకు ఇజ్రాయెల్ కుట్ర

### లీక్ చేసిన అమెరికా

**టెహ్రాన్,జులై 3:** అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న అత్యంత సున్నితమైన శాంతి చర్చలను దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ ఒక భారీ హత్యాకాండకు వ్యూహం రచించిందనే సంచలన నివేదికను ప్రముఖ అంతర్జాతీయ పత్రిక బయటపెట్టింది. ఇరాన్ తరఫున చర్చల్లో పాల్గొంటున్న ఇద్దరు అత్యున్నత స్థాయి ప్రతినిధులను హతమార్చడానికి ఇజ్రాయెల్ ప్లాన్ చేసిందని, ఈ విషయాన్ని ముందే పసిగట్టిన అమెరికా పశ్చిమాసియా దేశాల ద్వారా ఇరాన్‌ను వెంటనే అప్రమత్తం చేసిందని అమెరికా ఉన్నతాధికారులను ఉటంకిస్తూ ఈ కథనం వెల్లడించింది. ఇజ్రాయెల్ హిట్ లిస్ట్‌లో ఉన్న ఆ ఇద్దరు ముఖ్య నేతలు అబ్బాస్ అరాఘ్చి, మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ యుద్ధ విమానాల దాడి నుంచి తప్పించుకున్న స్పీకర్ ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఇస్లామాబాద్ (పాకిస్థాన్)లో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్ వస్తుండగా ఒక భయంకర ఘటన జరిగింది. ఇరాన్ స్పీకర్ ప్రయాణిస్తున్న విమానాన్ని అడ్డుకుని కూల్చివేయడానికి రెండు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాక్ సరిహద్దుల గుండా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా సాయంతో పసిగట్టిన ఇరాన్ రక్షణ వర్గాలు గాలిబాఫ్ విమానాన్ని వెంటనే ఈశాన్య ఇరాన్‌లోని మషద్ నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత ఆయన అక్కడి నుండి 8 గంటల పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించి సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. గాలిబాఫ్ గతంలో జరిగిన దాడుల శిథిలాల నుంచి కూడా రెండుసార్లు ప్రాణాలతో బయటపడటం గమనార్హం. ఇప్పుడు మిగిలి ఉన్న ఏకైక రాయబారులైన అరాఘ్చి, గాలిబాఫ్‌లను కూడా చంపేస్తే చర్చలు పూర్తిగా ఆగిపోయి, మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందని ఇజ్రాయెల్ భావించింది.

## బలూచిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

### లోయలో పడి 40మంది మృతి, 8 మందికి గాయాలు



**క్వెట్టా,జులై 3:**పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు లోయలో పడటంతో దాదాపు 40 మంది మరణించారు. మరో 8మంది గాయపడ్డారు. ఈ ఘటన బలూ చిస్తాన్ ప్రావిన్స్‌లోని, షెరాణిఝోబ్ హైవేపై, దానాసర్ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. బస్సు క్వెట్టా నుంచి ఇస్లామాబాద్ వెళ్తుండగా పర్వతాలు కలిగిన రోడ్డులో ప్రమాదం జరిగింది. ఒక బస్సు కెపాసిటీకి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకుని హైవేపై వెళ్తోంది. ఇది సరిహద్దు ప్రాంతాలైన బలూచిస్తాన్, ఖైబర్ పక్తుంఖ్వాలను కలిపేరోడ్డు. అయితే, ఈ రోడ్డు చాలా ప్రమాదకరం. పర్వత ప్రాంతం కావడం, రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడం వల్ల అక్కడ అత్యంత ప్రమాదకరమైన రోడ్లలో ఒకటిగా నిలిచింది. అలాంటి ప్రదేశంలో పర్వత మార్గంలో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రయాణికులు మరణించగా, మరో 8 మంది గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసుల, రెస్క్యూ, వైద్య బృందాలు అక్కడికి చేరుకు న్నాయి. సహాయక చర్యలు ప్రారంభించాయి. బస్సు శిథిలాల నుంచి 40 మంది మృతదేహాల్ని వెలికి తీశారు. గాయపడ్డవారిని స్థానిక ఝోబ్ పట్టణంలోని ఆస్పత్రులకు చికిత్స కోసం తరలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రమాద స్థలంలో అంబులెన్స్‌లు, ఎమర్జెన్సీ వైద్యబృం దం, లైట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్‌ను అధికారులు సిద్ధం చేశారు. పర్వత ప్రాంతం, పెద్ద లోయ కావడం వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ అంశంపై షెరాణి డిప్యూటీ కమిషనర్ హజ్రత్ మాట్లాడారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బస్సు మొదట 36 మందితోనే బయల్దేరిందని, అయితే, మార్గమధ్యంలో మరికొందరు ప్రయాణికుల్ని ఎక్కించు కుందన్నారు. అందువల్లే బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు. రోడ్డు భద్రతా ప్రమా ణాలు సరిగ్గా లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## హనీమూన్ మర్డర్ కేసు

### సోనమ్ బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ

#### మేఘాలయ ప్రభుత్వ పిటిషన్‌పై విచారణకు అంగీకారం



**న్యూఢిల్లీ, జులై 3:** హనీమూన్ మర్డర్ కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీకి మంజూరైన బెయిల్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అరెస్ట్ మెమోలో ఒక సెక్షన్‌ను పేర్కొనడంలో జరిగిన అక్షర దోషం (టైపోగ్రాఫికల్ ఎర్రర్) ఆధారంగా హైకోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేయడాన్ని ప్రాథమికంగా తప్పుబట్టినప్పటికీ, న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. ఆమె ఇప్పటికే జైలు నుండి విడుదలైన విషయాన్ని పరిగణనలోకి తీసు కున్న కోర్టు, బెయిల్ ఉత్త ర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరిం చింది. అయితే, ఈ బెయిల్ ఉత్త ర్వును సవాలు చేస్తూ మేఘాల య ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించడానికి మాత్రం అంగీకరిం చింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం ప్రతివాది సోనమ్ రఘువంశీకి నోటీసులు జారీ చేసి వారి స్పందనను కోరింది. "హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మాకు ప్రాథమికంగా కొన్ని సందేహాలున్నాయి. విచారణ ఎలా సాగుతుందో చూస్తాం. అరెస్టుకు గల కారణాలను ఆమెకు తెలియజేశారు. గతంలో బెయిల్ పిటిషన్లలో ఆమె ఈ అంశాన్ని లేవనె త్తలేదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోనమ్ రఘువంశీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదు పరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## భారీ భద్రత మధ్య అమర్‌నాథ్‌యాత్ర ప్రారంభం

### భక్తులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**జమ్ము,జులై 3:** హిందూ భక్తులు ఎదురుచూసిన అమర్‌నాథ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. భం భం భోలే,హర హర మహాదేవ్ అంటూ భక్తి నినాదాల మధ్య, భారీ భద్రత మధ్య ఘనంగా యాత్ర ప్రారంభమైంది. అమర్‌నాథ్ గుహలోని మంచు లింగానికి తొలి హారతి నిర్వహించారు. ఈ గుహకు జమ్మూ నుంచి మొదటి భక్తుల బృందాన్ని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు. నేటినుంచి ప్రారంభమైన ఈ యాత్ర 57 రోజులపాటు సాగుతుంది. రక్షా బంధన్ రోజైన ఆగష్టు 28న యాత్ర పూర్తవుతుంది. భక్తుల భద్రత దృష్ట్యా, ఉగ్రదాడుల ముప్పు నేపథ్యంలో అధికారులు అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్ర సాగే మార్గంలో భారీగా భద్రతా దళాలు మోహరించాయి. సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీస్, ఇండియన్ ఆర్మీతోపాటు వివిధ బలగాలు ఇక్కడ భద్రత కల్పిస్తున్నాయి. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అమి తమైన ఉత్సాహం, భక్తి పారవశ్యాల మధ్య మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ముందుకు సాగుతున్నారు. హిందూ విశ్వాసాల ప్రకారం ఆషాఢం, శ్రావణం అంటే జూలై, ఆగష్టు నెలల్లో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఈ యాత్ర నిర్వహిస్తారు. ఈ రెండు నెలల కాలంలో వేలాది మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకుంటారు. యాత్ర ప్రారంభమైన సందర్భంగా ప్రధాని మోడీభక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ రాశారు. ఇది దేశంలోని అత్యంత పవిత్రమైన యాత్రలలో ఒక్కటి అన్నారు. ఈ యాత్ర భక్తి, ఏకత్వం, శ్రద్ధకు ప్రతీకగా మోడీ పేర్కొన్నారు. ఈ యాత్ర చేసే భక్తులు ఐదు సంకల్పాల్ని పాటించాల న్నారు. అవి. యాత్ర పరిసర మార్గాల్లో పరిశుభ్ర తను కాపాడటం, ట్రాఫిక్ రూల్స్, సెక్యూరిటీ రూల్స్ పాటించడం, దేశీయ ఉత్పత్తులనే వాడ టం, యాత్ర తర్వాత తల్లి పేరుతో ఒక మొక్క నాటడం, దేశానికే మొదటి ప్రాధాన్యం అనే అం శాన్ని పాటించడం అంటూ మోడీ పేర్కొన్నారు.

## అయోధ్య ట్రస్టు లావాదేవీల రీ ఆడిట్

### అవకతవకలపై దర్యాప్తులో సిట్ నిర్ణయం



**అయోధ్య,జులై 3:**అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం చోరీ చేసిన సొమ్ము ఎంత అనేది తేల్చేందుకు గత ఐదేళ్లుగా ట్రస్ట్ నిర్వహించిన ఆర్థిక లావాదేవీలన్నింటిపై సమగ్రమైన రీఆడిట్ చేపట్టాలని నిర్ణయించింది. ప్రాథమిక విచారణలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు తేలడంతో లోతైన దర్యాప్తునకు అధికారులు సిద్ధమయ్యారు. ట్రస్ట్ ఖాతాల్లో నమోదైన ఆదాయం, ఖర్చులతో పాటు ఆలయ నిర్మాణానికి వెచ్చించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించనున్నారు. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కలను కూడా మరోసారి లెక్కించనున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అవినాశ్ శుక్లాను అయోధ్య పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అతడు కీలక బాధ్యతలు నిర్వహించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక కోర్టు అవినాశ్ ను 24 గంటల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఇప్పటివరకు అత్యధిక మొత్తంలో నగదు అవినాశ్ శుక్లా వద్ద నుంచే స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా నిందితుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవినాశ్ శుక్లా వద్ద నుంచి రూ.20.39 లక్షలు, కరుణేష్ పాండే వద్ద నుంచి రూ.18.07 లక్షలు, అనుకల్ప్ మిశ్రా వద్ద నుంచి రూ.16.82 లక్షలు, లవకుశ్ మిశ్రా వద్ద నుంచి రూ.14.25 లక్షలు, రామశంకర్ మిశ్రా వద్ద నుంచి రూ.7.32 లక్షలు, రామశంకర్ యాదవ్ అలియాస్ తిన్ను వద్ద నుంచి రూ.1 లక్షను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 11 గ్రాముల బంగారం, 375 గ్రాముల వెండి, 1,121 అమెరికన్ డాలర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అవినాశ్ శుక్లా దశాబ్దకాలంగా నివసిస్తున్న అయోధ్యలోని ఓ యోగా కేంద్రంలో సోదాలు నిర్వహించిన అధికారులు రామరాజ్య కోష్ అని రాసి, పేటీఎం క్యూ ఆర్ కోడ్ అమర్చిన విరాళాల పెట్టెను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ విరాళాల పెట్టె వినియోగం ఎలా జరిగిందనే అంశంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

**చోరీకేసులో సూత్రధారి డ్రైవర్ టిన్ను యాదవ్**

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం తన ప్రధాన సహాయకుడు, డ్రైవర్ టిన్నూ యాదవ్ ఈ కేసులో ప్రధాన సూత్రధారి అని ఆలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. తనపై రాయ్‌కు ఉన్న నమ్మకాన్ని అవకాశంగా తీసుకొని టిన్నూ యాదవ్ ఈ మోసానికి పాల్పడ్డాడు. పోలీసులకు పట్టుబడే ముందు ఈ సమాచారాన్ని అతడు సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఒకరికి లీక్ చేసినట్టు రాయ్ తెలిపారు.

**అయోధ్య నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే**

**ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే**

అయోధ్యలోని రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హోస్‌బలే స్పందించారు. ఆ ఘటన దురదృష్టకరమైందన్నారు. హిందూ వర్గ ప్రజలు సంయనంతో ఉండాలని, క్లిష్ట పరిస్థితుల్లో ఓపికతో ఉండాలని కోరారు. రామ్‌లల్లా గుడిలోని హుండీ బాక్సుల నుంచి చోరీ జరగడం దురదృష్టకరమని, ఆ ఘటన రాముడి భక్తులను, యావత్ సమాజ మనోభావాలను, భక్తిని గాయపరిచాయన్నారు. ఆ ఘటన తీవ్రంగా బాధపెట్టినట్లు ఆయన చెప్పారు. దర్యాప్తులో దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని హోస్‌బలే కోరారు. ఈ ఘటన ఆధారంగా హిందూ వ్యతిరేక శక్తులు.. హిందూ ధర్మాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆ కుట్రలను చేధించేందుకు హిందూ సమాజం ఓపికతో ఉండాలని అన్నారు. రామ్ మందిర్ విరాళాల వివాదంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్‌ఎస్‌ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## ప్రజాసేవ విభాగం ప్రారంభించిన కర్ణాటక సిఎం

**బెంగళూరు,జులై 3:** పాలనకు, పౌర సేవలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా సమస్యల్ని త్వరగా పరిష్కరించేందుకు ప్రజా సేవ విభాగాన్ని ప్రారంభించింది. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఈ విభాగం కృషి చేస్తుంది. ఈ విభాగానికి ఒక మంత్రి నాయకత్వం వహిస్తారని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బంది సహకారం అందిస్తారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి, సమస్యల్ని పరిష్కరిస్తారన్నారు. ప్రజా సేవా విభాగంతోపాటు ప్రజా సేవ అభియాన (పీఎస్ఏ) అనే మరో కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు సీఎం చెప్పారు.


## ముగింపుదశలో ఇరాన్ చర్చలు

### అంతా అమెరికాకు సానుకూలమే: ట్రంప్

**వాషింగ్టన్,జులై 3:** ఇరాన్ అణు కార్యక్రమంపై జరు గుతున్న చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికాకు అవసరమైన ప్రతి నిబంధనకు ఇరాన్ దాదాపు అంగీకరించిందని ఆయన వెల్లడించారు. టెహ్రాన్ (ఇరాన్ ప్రభుత్వం) ఎట్టిపరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని సాధించకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ అంతర్జాతీయ ఛానల్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయాలను పంచుకున్నారు. ఇరాన్‌ను అణ్వాయుధ రహిత దేశంగా మార్చడమే తమ అంతిమ వ్యూహమని, ప్రస్తుత చర్చలు అమెరికాకు అనుకూలంగా సాగుతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మేము ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాము. మాకు కావలసిన ప్రతిదానికి వారు దాదాపు అంగీకరించారని నేను భావిస్తున్నాను. మా లక్ష్యం స్పష్టం ఇరాన్‌ను అణ్వాయుధ రహిత దేశంగా మార్చడం. వారిని అణ్వాయుధాలు కలిగి ఉండటానికి మేము ఎప్పటికీ అనుమతించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌లో తాము అధికార మార్పిడిని ఆశించడం లేదని, కేవలం అణ్వాయుధాలు నివారించడమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. తాను మళ్లీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమెరికా జరిపిన సైనిక చర్యల వల్ల ఇరాన్ రక్షణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## పేరు లేదా జాతీయత ఆధారంగా హిందూ హోదాను నిరాకరించలేం

### మద్రాస్ హైకోర్టు విస్పష్ట తీర్పు



**చెన్నై, జులై 3:** హిందూ మతాన్ని ఆచరించే అమెరికన్ పౌరురాలికి, కేవలం విదేశీ పేరు లేదా విదేశీ పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందువుగా గుర్తింపును నిరాకరించలేమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతంలోకి చేరడానికి ఎటువంటి అధికారిక వేడుక లేదా మత మార్పిడి ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కోర్టు పేర్కొంది. తంజావూరు జిల్లాలోని శ్రీ అరుల్మిగు అభిష్ట వరదరాజ పెరుమాళ్ ఆలయంలోకి ప్రవేశించకుండా తనను నిరోధిస్తూ, తనను "అమెరికన్ క్రైస్తవ మహిళ"గా పేర్కొంటూ తమిళనాడు హిందూ మత, ధర్మాదాయ శాఖ(హెచ్‌ఆర్ సిఇ) జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ డి. భరత చక్రవర్తి ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాను అమెరికన్ పౌరురాలినైనప్పటికీ, చాలా యేళ్ల క్రితమే హిందూ మతాన్ని స్వీకరించానని, అప్పటి నుండి హిందూ విశ్వాసాన్ని పాటిస్తున్నానని లారా కోర్టుకు తెలిపారు. భారతదేశంలోని వివిధ హిం దూ ఆలయాలను సందర్శించానని, హిందువు అయిన వరద బాలాజీ వెంకటకృష్ణన్‌ను వివాహం చేసుకోకముందే తన వీసా దరఖాస్తులలో కూడా తనను తాను హిందువుగా పేర్కొన్నానని ఆమె చెప్పారు. సెప్టెంబర్ 2023 లో అదే ఆలయంలో వారి వివాహం జరిగింది, ఆ తర్వాత ఆమె వైష్ణవ సంప్రదాయ ఆచారాలలో పాల్గొంటూ వచ్చారు. ఆమె హిందువు కాదనే భావనతో కొందరు స్థానికులు ఆమె ఆలయ ప్రవేశాన్ని వ్యతిరేకించడంతో ఈ వివాదం తలెత్తింది. ఆమె స్వేచ్ఛగా పూజలు చేసుకునేందుకు అనుమతి కోరుతూ ఆమె భర్త చేసిన అభ్యర్థన మేరకు, ఆమెను "అమెరికన్ క్రైస్తవ మహిళ"గా పరిగణిస్తూ ఆ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఇతర భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆమెకు ఆలయ బయటి ప్రాంగణంలోకి మాత్రమే అనుమతి లభించిందని అందులో పేర్కొంది.

# సంక్షిప్త వార్తలు

## చాక్లెట్ చోరీ.. సీనియర్ ఉద్యోగిని తొలగించిన ఫోర్డ్



**వాషింగ్టన్, జులై 3 :** చాక్లెట్ కుకీ దొంగిలించాడనే కారణంతో ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ. 1.9కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్‌ట్రక్ ఫ్యాక్టరీలో 60 యేళ్ల కర్ట్‌క్రోమ్ 11 యేళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని, అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని, గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ (రూ.186)ని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు.

## ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేసిన బైడెన్ కుమారుడు..



**వాషింగ్టన్, జులై 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆయన విరోధి హంటర్ బైడెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు. ట్రంప్‌ను విమర్శిస్తూ వ్యంగ్యంగా నామినేట్ చేస్తూ హంటర్ బైడెన్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'నేను అధికారికంగా డొనాల్డ్ జె ట్రంప్‌ను నోబెల్ పీస్ ప్రైజ్‌కు నామినేట్ చేస్తున్నాను. చరిత్రలో ఏ అధ్యక్షుడు ఒకే యుద్ధాన్ని పలుమార్లు ఆపలేదు. మన ప్రియతమ నేత ఇరాన్‌తో యుద్ధాన్ని సిఎన్ఎన్ గణాంకాల ప్రకారం 38 సార్లు ఆపారు. ఇలా గతంలో ఏ అధ్యక్షుడూ చేయలేదు. ఇప్పుడు ఆయన ఆ యుద్ధాన్ని ముగించడానికి చాలా దూరంలోనే ఉన్నారు. ఈ రికార్డు నోబెల్ కమిటీ గుర్తింపునకు అర్హమైందే. ఈ విషయమై దృష్టి పెట్టినందుకు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## లొంగిపోవడానికి సిద్ధం:అన్మోల్ బిష్ణోయ్



**ముంబయి,జులై 3:** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసంపై జరిగిన కాల్పుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వాంటెడ్ నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడు అన్మోల్ బిష్ణోయ్, తాను లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని, ఇందుకు అనుమతించాలని కోరుతూ ముంబైలోని ప్రత్యేక మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (మోకా) కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం అన్మోల్ బిష్ణోయ్, గ్యాంగ్‌స్టర్ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేయడంతో ఢిల్లీలోని తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. 2025 నవంబర్‌లో అమెరికా నుంచి అతడిని భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే.

## ఖమేనీ అంత్యక్రియలకు మొజ్తబా హాజరుకాలేరు..

**న్యూఢిల్లీ,జులై 3:** ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ, తన తండ్రి దివంగత అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలకు హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. తీవ్రమైన భద్రతా ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, ఆయన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకపోవచ్చని ఇరాన్ సీనియర్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఈ పరిణామం ఇరాన్‌తో పాటు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన అం త్యక్రియలను జులై మొదటి వారం నుంచి భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిపోయే ఈ అంత్యక్రియలకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

## ఐరాస కార్యాలయంముందు టిబెట్ వ్యక్తి ఆత్మాహుతి..

**న్యూయార్క్,జులై 3:**అమెరికాలోని టిబెట్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఒంటికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యూయార్క్‌లో ఉన్న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం ముందు ఈ ఘటన జరిగింది. టిబెట్ దేశ జెండాను పట్టుకుని అతను తనను తాను కాల్చుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 52యేళ్ల వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో అతను మరణించినట్లు న్యూయార్క్ పోలీసుశాఖ వెల్లడిం చింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## టిడిపిని మరింత బలోపేతం చేస్తా

● తిరుపతి ఇన్‌ఛార్జిగా శ్రీనివాస్



**తిరుపతి, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి, పార్టీ కోసం కష్టపడిన నాయకులకు గుర్తింపునిస్తానని తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జెబిని నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా మన్నెం శ్రీనివాసులు నియా మకంను తిరుమల నేత రాజు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జెబి శ్రీనివాసులుని తిరుమల టిడిపి అధ్యక్షుడు రాజు యాదవ్, కార్యదర్శి శివషణ్ముగంతో కలిసి సత్కరించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

## అమరావతి అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తోంది



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని, ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసిపి సమన్వయ కర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని, దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు.

# తిరుమల సమాచారం



## రికార్డు స్థాయిలో 1.27 కోట్ల లడ్డూల విక్రయం

తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది జూన్ నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో టిటిడి లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 1,11,96,170 లడ్డూలు, మే నెలలో 1,21,35,528 లడ్డూలు, జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయమయ్యాయి. గత మూడు నెలలతో పోలిస్తే ఈ జూన్ నెలలో లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 జూన్ నెలలో 1,02,64,364 లడ్డూలు, 2025 జూన్ నెలలో 1,19,21,353 లడ్డూలు విక్రయాలు జరగగా, 2026 జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయించడం విశేషం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 7,59,452 లడ్డూలు అధికంగా విక్రయమవ్వడంతో 6.37 శాతం వృద్ధి నమోదైంది. 2024తో పోలిస్తే 24,17,441 లడ్డూలు అధికంగా విక్రయమవ్వగా 23.55 శాతం వృద్ధి నమోదైంది. శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీలోటిటిడి సమర్థవంతమైన ప్రణాళికతో వ్యవహరిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం సేవలందిస్తోంది. ఇప్పుడు తాజాగా రుచిగా లడ్డూల నాణ్యత కూడా పెరిగింది.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.20లక్షలు విరాళం

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు, ప్రధానంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాతలు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం చిత్తూరుకు చెందిన సురేష్ కుమార్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, చిలకలూరిపేటకు చెందిన చుండి రంగనాయకులు రూ.10 లక్షలు విరాళమిచ్చారు. ఈ విరాళాల డిడిపి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు అందజేశారు.



## కేంద్ర మంత్రులకు చైర్మన్ అల్పాహార విందు

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనానంతరం శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి దంపతులు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చైర్మన్‌తో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి ప్రతిమను చైర్మన్ అందజేశారు. అలాగే టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని మరో కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ దంపతులు కలిశారు. కేంద్ర మంత్రి జాదవ్ దంపతులను పట్టువస్త్రంతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను చైర్మన్ బిఆర్ నాయుడు అందజేశారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలు, దర్శనం విషయాలపై ముచ్చటించారు.



# బిఎల్‌ఒలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు(కలెక్టరేట్), జులై 3 ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వెంగళరావు నగర్ ప్రాంతంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్య క్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకా రం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిఎల్‌ఓలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమాచారం కోసం ఫోన్ చేసిన ఓటర్లందరకు సమాచారం అందించాలని బిఎల్‌వోలకు సూచించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో అవకతవకలు

### విచారణ చేయాలని కలెక్టర్‌కి వైసిపి నేతలు వినతి



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 3 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియలో కోవూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అవరోధాలు, ఇబ్బందులు ఉన్నాయి, వీటి పై విచారణ చేయాలని వైసీపీ మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కి వినతి అందచేసారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సర్ ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుండి అనేక అవరోధాలు ఇబ్బందులు గుర్తించామని కొన్ని చోట్ల ఇన్యూమరేషన్ ఫాంలు బిఎల్‌ఎలకు సమాచారం లేకుండా బిఎల్‌ఓ ఇచ్చేశారని కొన్ని చోట్ల డేటా చోరీ జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని మండి పడ్డారు. ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరు నగర కమిషనర్ సర్ ప్రక్రియ గురించి మాట్లాడుకున్న విషయం గురించి జగన్ స్వయంగా మాట్లాడారని బిఎల్‌ఓలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు ఇస్తున్నారని ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాల్సిన సర్ ప్రక్రియలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని ఆరోపించారు. సర్ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరగడం లేదని కోవూరు నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫాంలు ఇచ్చారు కానీ వాటిని డిజిటల్ చేయలేదని డిజిటల్ పూర్తయితేనే అర్హులకు ఓట్లు వస్తాయని ఈ విషయంపై ఎన్నికల చీఫ్ అధికారికి కూడా పార్టీ తరపున లేఖ సమర్పించినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

**పొదలకూరు (నెల్లూరు), జులై 3 ప్రభాతవార్త:** పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

దేగపూడి గ్రామానికి చెందిన తాళ్లూరు రవీంద్ర (41) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై పొదలకూరుకు వస్తుండగా, పొదలకూరు నుంచి రాపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రవీంద్ర సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పొదలకూరు సీఐ వెంకట్రావు, ఎస్ఐ హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హనీఫ్ తెలిపారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు(వైద్యం), జులై 3 ప్రభాతవార్త:** ఆర్థికంగా వెనుకబడిన, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ నెల్లూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 5 మంది లబ్ధిదారులకు రూ.7.57 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం వారి వైద్య, అత్యవసర అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 144 మంది లబ్ధిదారులకు రూ.1.91 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలు, అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులు అందరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## చిన్నారుల విద్యారంభం మంగళప్రదంగా సాగాలి

● వకుళమాత సన్నిధిలో శాస్త్రోక్తంగా 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' ప్రారంభం



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** చిన్నారుల విద్యారంభం, జీవితారంభం వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో మంగళప్రదంగా సాగాలనే సంకల్పంతో టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' కార్యక్రమం ప్రారంభించారు. టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి రూరల్ పేరూరులోని వకుళమాత ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' కార్యక్రమాన్ని శుక్రవారం మధ్యాహ్నం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర పాల్గొని చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం చైర్మన్ నాయుడు మాట్లాడుతూ అక్షరాభ్యాసం, అన్నప్రాశనం ప్రతి చిన్నారి జీవితంలోని అత్యంత పవిత్ర సంస్కారాలు అని పేర్కొన్నారు. తొలి అక్షరం 'గోవింద' నామంతో ప్రారంభమైతే విద్యాభ్యాసం దైవానుగ్రహంతో విజయవంతంగా సాగుతుందనే విశ్వాసంతో ఈ కార్యక్రమాన్ని టిటిడి ప్రారంభించిందన్నారు. ప్రతి హిందూ కుటుంబం ఈ దివ్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు రాతపలక, బలపాలు, అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, వేంకటేశ్వరస్వామి, వకుళమాత, పద్మావతి అమ్మవారు, సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, వేంకటేశ్వర సుప్రభాతం, పెద్దబాలశిక్షతో పాటు పూజా, విద్యా సామగ్రి ఉన్న 'అక్షర గోవిందం కిట్' ఉచితంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి, దర్శన్, ఎన్.సదాశివరావు, సి.దివాకర రెడ్డి, హెచ్‌డిపిపి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, అదనపు కార్యదర్శి కల్యాణి, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, డిప్యూటీ ఇఒలు శివప్రసాద్, ఆనంద రాజు, విఎస్ఒ గిరిధర్, ఎఇఒ గోపీనాథ్, ఇతర అధికారులు, చిన్నారులు, తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

**రూ.2 కోట్ల పిఎసి ప్రారంభం:** వకుళమాత ఆలయం ప్రాంగణంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన యాత్రికుల వసతి సముదాయాన్ని టిటిడి చైర్మన్, ఇఒ సంయుక్తంగా ప్రారంభించారు. ఇక్కడ యాత్రికులకు ఇదీ మరింత వసతి కల్పించేందుకు దోహదపడుతుంది.

## శివయ్య సన్నిధిలో కేంద్ర మంత్రుల పూజలు



**శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం భక్తులతో కిటకిట లాడింది. కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి ఎల్ మురుగన్ రాగా, దక్షిణ గోపురం వద్ద బిజెపి నాయకులతో పాటు ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకోవాలని కోరగా, చందురాయల్ వెంటనే సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం అనంతరం కేంద్ర మంత్రికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఓ బికె వెంకటేశు మంత్రికి స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు. స్వాగతం పలికిన వారిలో బిజెపి నేతలు అమర్‌నాథ్, పుణ్యం ఢిల్లీబాబు, వాసు యాదవ్, కూనాటి నాగరాజు హరీష్ రెడ్డి, కృష్ణా రెడ్డి, బి.వెంకటేష్, శ్రీధర్, రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

## తప్పిపోయిన బాలిక.. 2 గంటల్లోనే గుర్తింపు



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన కుటుంబం నుండి ఓ బాలిక తప్పిపోవడంతో వెంటనే తల్లిదండ్రులు తిరుమల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన నరసింహులు, లడ్డమ్మ దంపతులు కుమార్తె అను షామిని (9)తో కలిసి శ్రీవారి దర్శనార్థం గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు వెంకటాద్రి నిలయంలో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2గంటల ప్రాంతంలో బాలిక కనిపించకుండా పోయింది. గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. తిరుమల డిఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్రాఫిక్, శాంతిభద్రతలు బీట్ పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమన్వయం, వేగవంతమైన స్పందన ఫలితంగా బాలికను సమాచారం అందిన రెండు గంటల్లోపే సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తిరిగి అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు తిరుమల పోలీసుల సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.10వేలు కాదు... 17 వేలు చేయండి

● స్టైపెండ్ కోసం జూనియర్ న్యాయవాదుల నిరసన



**తిరుపతి, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూనియర్ న్యాయవాదుల స్టైఫండ్ రూ.5 వేల నుండి 10 వేలకు పెంచుతున్నట్లు మంత్రి ఫరూక్ ప్రకటన తరువాత తిరుపతిలో జూనియర్ న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. తమకు రూ.10వేలు స్టైఫండ్ కాదని 17వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాల సముదాయం ఎదుట జూనియర్ న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరుగుతున్న ఖర్చులకు కుటుంబ పోషణభారం కావడంతో 17వేలుకు పెంచి తక్షణమే అందజేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు పలువురు న్యాయవాదులు మద్దతు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడమే గాక జూనియర్ న్యాయవాదులకు న్యాయం చేయాలని అన్నారు.

## ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

● రావణ్ అప్పగించాలంటూ జనసేన కార్యకర్తల ఆందోళన

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ ప్రశ్న రావణ్ ఇనగుదురుపేట పిఎస్‌లో విచారిస్తున్న విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపేందుకు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా బారికేడ్లను తోసుకుని మరీ స్టేషన్ వద్దకు వచ్చారు. గోడలు దూకి స్టేషన్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. రావణ్ తరఫు న్యాయవాదులు స్టేషన్ వద్దకు రావడంతో జన సైనికులు ఆందోళన చేశారు. పోలీసులు జనసేన నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి పంపించేసి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పిఎస్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో ప్రముఖ యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విచారణ అనంతరం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరిపించి కోర్టు హాజరు పర్చనున్నారు.

## 'అమరావతి' పేరుతో అవినీతికి పథక రచన

● మాజీ ఎంపి విజయసాయిరెడ్డి ఆరోపణ

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతికి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణ చేసారు. టిడిపి అమరావతి, అంటుంటే, వైసిపి మావిగన్ అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నానంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా? ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. వైసిపి 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## కంభం రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి సహా నలుగురు మృతి చెందడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి వేడుకకు హాజరై ఆలయానికి వెళ్లిన వారు ఈ విధంగా ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. వివాహ వేడుకల ఆనందం నిండిన కుటుంబంలో ఇలాంటి పెనువిషాదం నెలకొనడం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తీవ్రంగా గాయపడిన వారి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.



## టిటిడి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.50.20 లక్షలు

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడుకు చెందిన కెకెఎస్ కన్స్ట్రక్షన్స్ సంస్థ శుక్రవారం వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.50.20 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

నకిలీ ఆధార్ కార్డులతో గదులు అక్రమ బుకింగ్

## అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సామాన్య భక్తులకు కేటాయించే టిటిడి వసతి గదులను నకిలీ ఆధార్ కార్డులతో అక్రమంగా పొందుతూ, గదులు దొరకని భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్న నలుగురి ని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమల సి.ఆర్.ఒ కార్యాల యం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను టిటిడి సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో మొబైల్ యాప్‌ల ద్వారా నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి గదులను పొందడం, అనంతరం వాటిని రూ 2వేల నుండి 3వేల వరకు అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. ఎం.వేణుగోపాల్ (తెలంగాణ), దొంత రవీంద్రబాబు (ఆంధ్రప్రదేశ్), సంతోష్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), టి.ఈశ్వర్ (తెలంగాణ). నుండి రెండు సెల్‌ఫోన్లు, 12 నకిలీ ఆధార్ కార్డులు, డిజిటల్ ఆధారాలు స్వాధనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## దుర్గమ్మ గుడిలో వేదోక్తంగా సంకష్టహర చతుర్థి



ఇంద్రకీలాద్రి, జూలై 3 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతి హోమం, పూజాదికాలు తదితర క్రతువులను శుక్రవారం వేదోక్తంగా నిర్వహించారు. గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో ప్రధానమైనది చవితి సంకటహర చతుర్థి పూజ ఆచరించడం వలన జాతకములోని సమస్యలు తొలగి, అన్ని పనులలో సంకటములన్నీ తొలగి సఫలత చేకూరుతుందని పురాణోక్తి. సంకటహరచతుర్థి సందర్భంగా దేవస్థాన యాగశాలలో ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం కార్యక్రమములను ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. లోక క్షేమం కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు ఖమ్మంకు చెందిన అల్లరి దుర్గారావు, శివదీక్షిత దంపతులు రూ.1,11,111లు విరాళము ఆలయ అధికారులకు అందచేయగా దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం ప్రసాదము అందచేశారు.



# నవ శకానికి నాంది

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత ● పారిశ్రామికాభివృద్ధికి గ్రోత్ ఇంజన్ : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

● శృంగవరపుకోటలో జెఎస్‌డబ్ల్యూ ఎంఎస్ఎంఇ పార్కుకు భూమిపూజ చేసిన మంత్రులు



**విజయనగరం, జూలై 3 ప్రభాతవార్త:** జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. శృంగవరపుకోట (ఎస్.కోట) మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జేఎస్డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా భూమిపూజ చేశారు. కడప జిల్లా జమ్ముల మడుగు నుంచి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పట్నం ఎంపీ భరత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, గాదె శ్రీనివాసుల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, దాసరి కార్పొరేషన్ చైర్మెన్ రత్నాజీ, ఆర్డీవో సుధాసాగర్, పలువురు అధికారులు, స్థానిక నేతలు, జిందాల్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు తమ భూములను త్యాగం చేయడం వల్లనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని, వారికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మొదటి దశలో 535 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా సుమారు 45 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు రాకతో ఎస్.కోట నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందనుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదొక నవ శకం అనీ, తమ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందనీ, ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయని చెప్పారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఉండేవని, ఇప్పుడు పరిశ్రమల రాకతో ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి ఉపాధి కోసం వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల కృషితో విజయనగరం జిల్లా దశ, దిశ పూర్తిగా మారబోతున్నాయని ఆమె పేర్కొన్నారు.

**ఉత్తరాంధ్ర దశ మార్చే జిందాల్:** మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ప్రపంచ స్థాయి ప్రమాణాలతో జిందాల్ కంపెనీ నిర్మాణం ఉత్తరాంధ్రకు ప్రత్యేక గుర్తింపునిస్తుందన్నారు. సుమారు 1160 ఎకరాల్లో, రూ. 531 కోట్ల పెట్టుబడితో మొదటి దశ పనులు జరుగుతున్నాయనీ, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించేలా, మొత్తం 45 వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. చిత్తూరు జిల్లాలో శ్రీ సిటీ ఎలాగైతే అభివృద్ధి చెందిందో, ఇక్కడ కూడా జిందాల్ ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. విజన్ 2047తో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి పేర్కొన్నారు.

**అభివృద్ధికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వం:** విశాఖ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ, "గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్నాననీ, ఇన్నాళ్ళకు కోరిక నెరవేరిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, నక్కపల్లి ఉక్కు పరిశ్రమ, ఇప్పుడు ఎస్.కోట జిందాల్ ఫ్యాక్టరీతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారుతుందనిచెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే అత్యధికంగా 25 శాతం పెట్టుబడులను తీసుకువస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారనీ కొనియాడారు.

**నిరీక్షణకు తెరపడింది:** స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నేడు నిజమైందని ఆనందం వ్యక్తం చేశారు. జేఎస్‌డబ్ల్యూ ప్రారంభంతో ఎస్.కోటలో పండగ వాతావరణం నెలకొందనీ చెప్పారు. భవిష్యత్తులో పతంజలి ప్రాజెక్ట్, బలిఘట్టం ఎంఎస్ఎంఈ పార్కులతో ఎస్.కోట మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్ మాట్లాడుతూ, జెఎస్డబ్ల్యూ పార్కు వల్ల ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు.

# సర్ విధుల్లో అలసత్వం

● నలుగురు అధికారులకు షోకాజు నోటీసులు

**విజయవాడ, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన, విలువైన ఓటు భద్రతకు అత్యంత ముఖ్యమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నలుగురు అధికారులకు శుక్రవారం షోకాజు నోటీసులు జారీచేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఈఆర్‌వో ఎ.రవీంద్ర, ఏఈఆర్‌వోలు ఇస్మాయిల్, డి.చంద్రబోస్‌లతోపాటు విజయవాడ మధ్య నియోజకవర్గం ఏఈఆర్‌వో సంజయ్ రత్నకుమార్‌లకు షోకాజు నోటీసులు జారీచేశారు. సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి చూపడంలో విఫలమైనందుకు ఈ నోటీసులు ఇచ్చారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సర్ ప్రక్రియ అత్యంత కీలకమైందని, ఈ విధుల్లో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## 14యేళ్ల బాలిక అనుమానాస్పద మృతి

మామపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తల్లి ఫిర్యాదు

**విజయవాడ, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో ఇటీవల ఏళ్ల బాలిక అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. ఇంట్లో ఉరివేసుకొని బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తుండగా ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. బాలిక మృతిచెందిన రోజే కుటుంబ సభ్యులు పోలీసులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అంత్యక్రియలు నిర్వహించి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే బాలిక మృతి విషయంలో మామపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## తూర్పుపేటలో ఎస్‌టిపి ప్లాంట్ వివాదం

ఆంధ్రా- యానాం సరిహద్దుల్లో ఉద్రిక్తత



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 3 ప్రభాతవార్త:** ఆంధ్ర, యానం సరిహద్దు వివాదం ముదురుతోంది. కేంద్ర పాలిత ప్రాంతం యానం,ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో యానం ప్రభుత్వం సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్.టి.పి.) మురుగునీరు శుద్ధి కర్మాగారం నిర్మించాలని యానం అధికారులు చేస్తున్న సన్నాహాలను స్థానికులు అడ్డుకోవడంతో ఆంధ్ర, యానాం సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట ప్రాంతంలో యానం ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులు శుక్రవారం సర్వే చేయడానికి సన్నాహాలు చేస్తుండగా మండల అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్తులు ఇరు రాష్ట్రాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో యానం ప్లాంట్ ఏర్పాటు చేయడం తగదని జాతీయ రహదారి 216పై బైఠాయించి ఆందోళన చేశారు. ఆంధ్ర అధికారులు యానాం అధికారులకు సపోర్ట్ చేస్తున్నారని, దీనిపై ఆర్డిఓ ప్రజలకు వివరణ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లా అధికారులు వచ్చి ఈ అంశంపై సమాధానం చెప్పాలని పట్టు పట్టడంతో ఆందోళనకారులను శాంతింప చేసే పోలీసుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ కాకినాడ ఆర్డిఓ కి సమాచారం ఇవ్వడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆర్డిఓ మల్లిబాబు ఆందోళనకారులతో మాట్లాడకుండా యానం అధికారులతో చర్చించడంతో ఆందోళనకారులు ఆగ్రహించి ఘటనా స్థలం నుంచి వై జంక్షన్ పి. మల్లవరం చెక్ పోస్ట్ వరకూ ర్యాలీగా వచ్చి అక్కడ బైటాయించి రాస్తారోకో చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తో చర్చలు జరుపుదామని ఆందోళనకారులతో సీఐ చైతన్య కృష్ణ చెప్పడం వారి ఆగ్రహానికి కారణమైంది. ఆర్డీవో ప్రజల వద్దకు రావాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అటుగా కాకినాడ వైపు వెళ్ళిపోతున్న ఆర్డీవో కారును ఆందోళనకారులు అడ్డగించారు. దీంతో ఆర్డీవో కారు దిగివచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. చర్చల సందర్భంగా ఆర్డిఓ ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు, అఖిలపక్ష నాయకులు, ప్రజలు మాటల యుద్ధంతో గందరగోళం నెలకొంది. యానం ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకునే స్థలం వివాదాస్పదమైనదని ఇది హైకోర్టు పరిధిలో ఉందని ఆర్డీవో మల్లిబాబు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి వచ్చామని తెలిపారు. ఇక్కడ క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకొని జిల్లా కలెక్టర్ తో మాట్లాడతామన్నారు. హైకోర్టు ఆర్డర్ వచ్చేంతవరకు ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేయరాదని తెలిపారు. దీంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ సోమవారానికి వాయిదా

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** బాలికపై లైంగికదాడి ఘటనకు సంబంధించి పేట్ బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. తనపై నమోదైన పోక్సో కేసు రాజకీయ కుట్రలో భాగమని, తాను అమాయకుడినని, ఎలాంటి తప్పు చేయలేదని భగీరథ్ హైకోర్టుకు గత మంగళవారం విన్నవించడం తెలిసిందే. అక్రమంగా నమోదైన కేసులో తనకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అతను కోరడం విదితమే.

# లోకేష్ గురించి మాట్లాడే అర్హత ప్రకాష్‌రెడ్డికి లేదు

● ధైర్యముంటే మాతో చర్చించు ● నీ వెనుక ఎవరున్నా భయపడేదిలేదు ● కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ● గన్‌మెన్ల కోసమే ప్రకాష్‌రెడ్డి డ్రామా: పరిటాల శ్రీరామ్



**అనంతపురం, జూలై 3 ప్రభాతవార్త బ్యూరో:** మా యువనాయకుడు మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదని నీకు ధైర్యముంటే మాతో ఎదురుగా కూర్చొని చర్చించవచ్చని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేకంగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. నీ వెనుక ఎవరున్నా ఏ మాత్రం భయపడేదిలేదని చెబుతూ మా యువనాయకుడు నారా లోకేష్‌కు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు, నాకు హత్యారాజకీయాలు తెలియవని అనవసరంగా ఆరోపణ చేస్తే నమ్మే వారు ఎవరూ లేరని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. తనను చంపడానికి మంత్రి నారా లోకేష్ ప్రోద్బలంతో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు హత్యారాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఆర్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజవర్గం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు పాల్గొని వైసిపి నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఆరోపణలు సంధించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్స్ సంస్థను మా పెద్దలు స్థాపించింది కాదని 1983లో మేమే కష్టపడి సంస్థను స్థాపించామని వివిధ నిర్మాణ పనులు వేగంగా చేయడం వల్ల బోనస్‌లు కూడా తీసుకున్నామన్నారు. అనేక హైవేలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి మా సంస్థ గుర్తింపు తెచ్చుకుందన్నారు. అందులో భాగంగా మా క్రషర్ నుండి బయటకు వస్తున్న వాహనం రోడ్డుపై వేగంగా వచ్చిన వాహనాలను చూసి పది మీటర్ల దూరంలో తన కారును ఆపినట్లు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డే స్వయంగా చెప్పాడని ఆయన గుర్తు చేశారు. మళ్లీ ఏదో చేసేందుకు ప్రయత్నించారంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో చక్రపాణి అనే వ్యక్తిని చంపడానికి వాహనాల్లో వెళ్లింది నీవు కాదా అంటూ ప్రకాష్‌రెడ్డిని ప్రశ్నించారు. నేను సౌమ్యుడిని అని 1991లో మా దుకాణాలపై దాడులు చేసినా కూడా మేము ఎదుర్కొనగలిగామని ఆనాడే భయపడలేదన్నారు. కళ్యాణదుర్గం రోడ్డు వేస్తుంటే నీ బావమరుదులు అడ్డుకున్నారని అప్పటి ఎస్‌పి మీ బావమరుదుల మీద కేసు పెడితే కాళ్ల బేరానికి వచ్చింది నీవు కాదా అంటూ ఆయన విమర్శించారు. ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కేవలం గన్‌మెన్ల కోసమే ఈ ఎత్తుగడని చెబుతూ గన్‌మెన్లు కావాలంటే జిల్లా ఎస్‌పి, జిల్లా కలెక్టర్, డిఐజిలను కలిసి విన్నవించుకోవచ్చని కానీ ఇలాంటి చౌకబారు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. గతంలో హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లను బెదిరించి ఇబ్బందులు పెట్టడం, ఘర్షణలు జరగడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే గన్‌మెన్లను తొలగించిందని ఆయన గుర్తు చేశారు. ఒక ఆగివున్న లారీని వెనుక నుండి స్కార్పియో వాహనం తగిలించుకుని తిరిగి నాపై కుట్ర జరుగుతోందంటూ గన్‌మెన్లు కావాలని గతంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అడిగారని శ్రీరామ్ వెల్లడించారు. ఆ సంఘటనపై పోలీసులు ఎంక్వైరీ చేస్తే అది కట్టు కథ అని తేల్చి గన్‌మెన్లు ఇవ్వలేదని అందుకే ఇప్పుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొత్త నాటకానికి తెర లేపాడని ఆయన ఆరోపించారు. హంద్రీనీవా కాలువ పనులను పాత ధరలకే చేస్తుంటే ఎమ్మెల్యే సురేంద్రబాబుకు మరింత గొప్ప పేరు వస్తుందనే భయంతోనే ఇలాంటి కుట్రలు చేస్తున్నావు నీ చిల్లర మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారని ప్రకాష్‌రెడ్డి ఖబడ్దార్ మాటలు జాగ్రత్తగా మాట్లాడాలంటూ పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ వైసిపిలో నిన్ను ఎవరూ గుర్తించడంలేదని అలాంటిది నీవు మా యువనాయకుడు నారా లోకేష్ గుర్తించి అసభ్యంగా మాట్లాడుతావా అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడిన భాష ఏంటి సభ్య సమాజంలో మనం వున్నామన్న విషయం గుర్తుంచుకోవాలని, మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే ముందు ఒక్కసారి నీ గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించి మాట్లాడాలని ప్రకాష్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. ప్రకాష్‌రెడ్డిని చంపేందుకు ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, పరిటాల సునీతకు ప్రత్యేకంగా మా యువనాయకుడు నారా లోకేష్ బాధ్యతలు అప్పగించినట్లు ఎలా మాట్లాడుతావు అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రంగా నిలదీశారు. ఉత్తర ప్రగల్భాలుగా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆరోపణలను తీ వ్రస్థాయిలో కొట్టిపారేశారు. మా యువనాయకుని గురించి మా ఎమ్మెల్యేల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తేలేదని ఎంఎస్ రాజు హెచ్చరించారు.

## క్రషర్ గిరిజన కార్మిక యువకుడు అనుమానాస్పద మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 3 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా లో స్టోన్ క్రషర్ల నిర్వాహకుల ఆగడాలకు అంతుపొంతూ లేకుండా పోతోంది. స్వలాభం తప్ప సామాజిక రక్షణ, కార్మికుల భద్రతకులకు ఏమాత్రం విలువ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగిపోతున్న క్రషర్ల దందా రోజురోజుకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇటీవల వార్తలో కూడా వీటిపై కథనం రావడం విధితమే. ఈ పరిస్థితుల్లో ఉప్పల పాలెంలో నిర్వహిస్తున్న క్రషర్ వద్ద పనిచేసే కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనపై గ్రామస్తులు సైతం ఆగ్రహావేశాలం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుతో ప్రాణాలు విలుగట్టి తమ తప్పును కప్పు బిచ్చుకునే యత్నాలాలలో నిర్వాహకులు మునిగిపోయారు. రౌతులపూడి మండలం ఉప్పంపాలెం లో నిర్వహిస్తున్న ఏఎస్ఎన్ క్వారీ క్రషర్ ఆగడాలకు హద్దులేకుండా పోతుంది. గురువారం రాత్రి క్రషర్‌లో పనిచేస్తున్న గిడజం గ్రామానికి చెందిన తంటపురెడ్డి కుశరాజు (17) అనుమాన స్పద స్థితిలో మరణించాడు. అయితే కుశరాజు మరణం విషయమై క్రషర్ యాజమాన్యం చెబుతున్న పొంతనలేని సమాధానాలతో శుక్రవారం ఉదయం నుంచి గ్రామస్థులు రోడ్డుపై భైటాయించి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో ఉండగా కారులో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అక్కడే కుశరాజు మృతిచెందాడని, ఒకరు, ఎలాజరిగిందో తెలియటం లేదని కొందరు పనివారు చెబుతున్నారని దీనిపై తమకు అనుమానాలున్నాయని తల్లితండ్రులు, తంటాపురెడ్డి రంగ, రాణితో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. గిడజాంలో ప్రమాదం జరిగితే అదే గ్రామంలో నివసిస్తున్న మాకు ఎందుకు తెలియపరచలేదని, తమకుమారుడు శరీరంపై రాళ్ళదెబ్బలున్నాయని, క్రషర్ లోనే చనిపోతే ఈ విధంగా సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**కొడుకా రావా అంటూ తల్లి ఆవేదన:** చేతికందివచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి పోవడంతో తల్లితండ్రులను ఓదార్చడం బంధువులవల్ల కావటం లేదు. 10వతరగతి వరకు చదివిన కుమారుడు ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో ఏఎస్ఎన్ క్రషర్‌లో పనిలోకి వెళ్ళి కుటుంబాన్ని పోషిస్తున్నాడని ఇపుడు తమకు దిక్కెవరు పెద్దల కాళ్ళుపట్టుకుని ఏడుస్తున్న తీరు చూపరులను కంటనీరు పెట్టిస్తుంది.

# మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన

● ప్రత్యేక కమిటీ ఏర్పాటు ● రోగుల అవసరాలకు తగ్గట్లు తీసుకోవాల్సిన చర్యలపై రెండు వారాల్లోగా నివేదించాలి ● పరికరాలు, మిషన్ల కొనుగోలు, సరఫరాకు నిర్దిష్ట క్యాలెండర్‌ను రూపొందించాలి ● వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**విజయవాడ, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేసి, రోగులకు మందులు అందుబాటులో ఉంచడంలో ఎటువంటి ఇబ్బంది లేని విధంగా కొత్త వ్యవస్థను రూపొందించాలని మంత్రి తెలిపారు. ఇందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులతోపాటు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సీనియర్ అధికారి, రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయ ల అభివృద్ధి సంస్థ(ఎపిఎంఎస్ ఐడిసి) అధికారి (డ్రగ్స్ విభాగం), ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులతో కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సాయంత్రం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందులు, సర్జికల్స్, పరికరాల కొనుగోలు విధానం, పంపిణీ ఆసుపత్రుల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులతో సుదీర్ఘంగా సుమారు 4 గంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందుల కొనుగోలు, సదరు ఆసుపత్రుల ద్వారా స్థానికంగా జరిగే మందుల కొనుగోలు (లోకల్ పర్చేజ్), పంపిణీ, ఇతర అంశాల గురించి మంత్రికి వివరించారు. ఆసుపత్రుల నుంచి వచ్చే డిమాండ్ల అనుసరించి త్రైమాసిక (క్వార్టర్లీ) విధానంలో మందులను పంపుతున్నామని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ ప్రస్తుత విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు.

**అన్ని కోణాల నుంచి అధ్యయనం జరగాలి:** ఆసుపత్రులకు రోగులు ఎంత మంది వస్తున్నారు? ఓపీ, ఐపీ ఎలా ఉంటుంది?, మందుల అవసరం ఎలా ఉంది,? డిమాండ్లను ఎలా ప్రస్తుతం పంపుతున్నారు?, అన్ని ఆసుపత్రుల నుంచి వచ్చే డిమాండ్లను ఏ విధంగా క్రోడీకరిస్తున్నారు? మందుల కంపెనీల వారికి ఎలా ఆర్డర్లు ఇస్తున్నారు? ఎంత సమయంలో అవి ఆసుపత్రులకు చేరుతున్నాయి? జాప్యం జరిగితే ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? డిమాండ్లకు తగ్గట్లు మందుల సరఫరా జరుగుతోందా? లేదా? మందుల అవసరాల డేటాలో ఎంతవరకు కచ్చితత్వం ఉంటుంది? ఎక్కడెక్కడ లోపాలున్నాయి? వాటిని ఎలా మెరుగుపరచాలి? తమిళనాడులో ఎలాంటి ప్రమాణాలు అనుసరిస్తున్నారు? అక్కడి ఉత్తమ విధానాలపై కమిటీ అధ్యయనం చేయాలి. ఇతర అంశాలపై లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసి, రెండు వారాల్లోగా ప్రభుత్వానికి కమిటీ రిపోర్టు ఇవ్వాలి" అని మంత్రి స్పష్టం చేశారు.

**పరికరాల కొనుగోలుకు క్యాలండర్ విధానాన్ని రూపొందించాలి:** ఆసుపత్రుల నుంచి పరికరాలు, మిషన్‌ల కోసం ఏపీఎంఎస్ఐడీసీకి వచ్చే ఇండెంట్ల విధానంలోనూ మార్పులు రావాలన్నారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్ల నుంచి వచ్చే పరికరాల కొనుగోలు ఇండెంట్లు, సరఫరా నిర్దిష్ట సమయంలో జరిగేలా ప్రత్యేకంగా క్యాలండర్ విధానాన్ని రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. దీనివల్ల టెండర్లను పలు మార్లు టెండర్లు పిలిచే అవకాశం తలెత్తదని, సుహృద్భావత వాతావరణంలో పోటీ ఏర్పడి ధరలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు.

**త్వరలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణాల ప్రారంభం:** కేంద్ర మంత్రి జేపీ నడ్డా త్వరలో ప్రారంభించనున్న ఖిక్రిటికల్ కేర్ఖి బ్లాక్‌ల నిర్మాణాల పురోగతి, సన్నాహక ఏర్పాట్లను మంత్రి అధికారులతో చర్చించారు. పూర్తయిన 9 క్రిటికల్ బ్లాక్ ల నిర్మాణాలను, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీలను కూడా కేంద్ర మంత్రి ఏక కాలంలో ప్రారంభిస్తారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టంచేశారు.



**ఆయుష్ డిస్పెన్సరీల నిర్మాణాలు దాదాపుగా పూర్తి:** ఈ సమీక్షా సమావేశంలో ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ రూ. 44 కోట్లతో చేబట్టిన 150 ఆయుష్ డిస్పెన్సరీల పునర్నిర్మాణాలు, నూతన భవన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని మంత్రికి వివరించారు. అలాగే 6 ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాల(రూ. 90 కోట్ల వ్యయం)కు అవసరమైన స్థలాల సేకరణ, రూ. 210 కోట్లతో మూడు ఆయుష్ కళాశాల ఏర్పాటు చర్యల గురించి మంత్రికి వివరించారు. విశాఖలోని ఆయు ష్ శాఖకు చెందిన ల్యాబరేటరీ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఖిఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఖిఏర్పాటుకు అవసరమైన ఆమోదంపై కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న సంప్రదింపులపైనా మంత్రి అధికారులతో చర్చించారు.

**పిహెచ్‌సీ, సిహెచ్‌సి, ఇతర నిర్మాణాల పురోగతిపై ఆరా:** గడిచిన రెండేళ్లలో జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం అభీమ్, 15వ ఆర్థిక సంఘం కింద రూ.1,450 కోట్లతో చేబట్టిన 100 పీహెచ్సీలు, తొమ్మిది సీహెచ్సీలు, సుమారు 4,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవన నిర్మాణాల పురోగతి, 20 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులను ఆదేశించారు.

**వైద్య కళాశాలల నిర్మాణాల్లో వేగాన్ని పెంచాలి:** పాడేరు, పిడుగురాళ్ల, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షిస్తూ త్వరగా పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలన్నారు. అదేవిధంగా 11 పూర్వ వైద్య కళాశాలల్లో జరుగుతోన్న రకరకాల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యాలు పరిగణనలోనికి తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ కు ఎన్ ఎబిఎల్ అక్రిడిటేషన్ తెప్పించాలి తిరుపతి, విశాఖలో రూ. 45 కోట్లతో అత్యాధునిక పరికరాలు/ మెషిన్లతో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీలు రాబోయే మూడునెలల్లో ఎన్ఎబీఎల్ అక్రిడిటేషన్ తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ఈ రెండు లేబరేటరీల్లో నియామకాలు కూడా పూర్తయ్యాయన్నారు. తిరుమలలో స్టేట్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్, విశాఖలో ల్యాబ్లో నమూనాల పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు ఆమోదం తెలిపిన 78 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు. 72 ఇతర పోస్టుల (కొత్తవి) భర్తీకి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాలని తెలిపారు. ఇవి కాకుండా రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన 278 శాంక్షన్డ్ పోస్టుల్లో సుమారు 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని కూడా త్వరితగతిన భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. విశాఖ, గుంటూరు తిరుమల, తిరుపతి, కర్నూలు స్టేట్ ఫుడ్ ల్యాబుల్లో ఈ నియామకాలు జరిగేందుకు ప్రత్యేకంగా చొరవ చూపాలని వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబును ఆదేశించారు.

# నేడు ఇంగ్లండ్‌తో రెండో టి-20





## టీమిండియా నుంచి ఇద్దరు స్టార్స్ ఔట్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టి-20 మ్యాచ్‌కు టీమిండియా తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఇద్దరు స్టార్ బ్యాట్స్‌మెన్ల స్థానంలో ఇద్దరు యంగ్ ప్లేయర్లకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. ఐర్లాండ్ సిరీస్‌లో విఫలమైన టీమిండియా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టి-20లో బ్యాటింగ్ పరంగా ఆకట్టుకుంది. ఈనెల 1న వర్షం కారణంగా రద్దయిన మొదటి టి-20లో టీమిండియా బ్యాటింగ్ లైనప్‌లో కొందరి ప్రదర్శన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో బుల్లెట్ రైళ్లలా దూసుకుపోయిన ఇద్దరు స్టార్ హిట్టర్లు శ్రేయస్ అయ్యర్ సారథ్యం చేపట్టగానే ఒక్కసారిగా సంజూ శాంసన్, తిలక్ వర్మ ప్యాసింజర్ ట్రైన్‌లా నత్తనడక బ్యాటింగ్‌తో నిరాశపరుస్తున్నారు. తొలి టి-20లో బ్యాటింగ్ ఎంచుకున్న శ్రేయాస్ సేనలో ఓపెనర్ అభిషేక్ శర్మ (59), శివమ్ దూబే (42) మెరుపులు మెరిపించగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (68) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ ఏడు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేయగా, తిలక్ వర్మ 13 బంతుల్లో 13 పరుగులు మాత్రమే చేశారు. టి-20 వరల్డ్ కప్‌లో అదరగొట్టిన ఈ ఇద్దరు స్టార్ బ్యాట్స్‌మెన్లు ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్‌లోనే కాదు దీనికి ముందు జరిగిన ఐర్లాండ్ సిరీస్‌లోనూ విఫలమయ్యారు. ఐర్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో సంజూ 4 బంతుల్లో 5 రన్స్ చేయగా, రెండో మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు.

ఇక తిలక్ వర్మ పరిస్థితి చూస్తే టి-20 మ్యాచ్‌ను వన్డే తరహాలోఆడాడు. ఐర్లాండ్‌పై మొదటి మ్యాచ్‌లో 21 బంతుల్లో 19 పరుగులు చేసిన తిలక్ రెండో మ్యాచ్‌లో 46 బంతులుతిని 55 పరుగులు చేశాడు. ఇటీవలి టి-20 వరల్డ్ కప్‌లోనూ వీరిద్దరూ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో అలరించారు. అయితే కెప్టెన్ మారిన వెంటనే గత మూడు మ్యాచ్‌లుగా వీరిద్దరి బ్యాటింగ్ తీరు మారి పోయింది.

అటాకింగ్ గేమ్ కాకుండా డిఫెన్సివ్ మోడ్‌లో ఆడడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే శనివారం జరిగే రెండో టి-20 మ్యాచ్‌లో తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం కనిపిస్తోంది. సంజూ శాంసన్ తిరిగి ఫామ్ అందుకోవడంతో పాటు తిలక్ వర్మ తన స్ట్రైక్ రేట్‌ను మెరుగు పరుచుకోవాల్సి ఉంది. లేదంటే వీరిద్దరిపై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపిఎల్‌లో అదర గొట్టిన వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరం గేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని అన్ని వైపులా నుంచి డిమాండ్లు వస్తున్నాయి. అదేవిధంగా తిలక్ వర్మ స్థానంలో ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేను బరిలోకి దించేం దుకు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది.



## ఆసియా కప్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్.. భారత్‌కు నాలుగు పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లలో ఆతిథ్య దేశమైన భారతదేశం, మూడు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో తన ప్రచారాన్ని ముగించింది. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన ఇండియా బి సీనియర్స్ జట్టు అత్యద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆ తర్వాత జపాన్‌పై 126-125 (1కీలక గోల్) తేడాతో నాటకీయ సెమీఫైనల్ విజయాన్ని నమోదు చేసి, టోర్నమెంట్‌లోని అత్యంత చిరస్మరణీయ విజయాల్లో ఒకటిగా నిలిచి గోల్డ్ మెడల్ ఫైనల్‌లో స్థానం సంపాదించింది. ఆస్ట్రేలియాతో హోరాహోరీగా జరిగిన పోరులో జట్టు చివరికి రజత పతకంతో సరిపెట్టుకుంది. సుకమల్ దాస్, హేమంత్ జలన్, జితేంద్ర సోలానీ, అనిల్ పధ్యే, రాజేష్ దలాల్, రాజు తోలానీలతో కూడిన ఇండియా బి సీనియర్స్ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది, దీని ఫలితంగా ఫైనల్ చివరి దశల వరకు భారత్ టైటిల్ పోటీలో నిలిచింది. పురుషుల టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియా ఎ జట్టు కాంస్య పతకాన్ని కూడా సాధించింది. మ్యాచ్ పాయింట్ ఫైనల్స్‌లో మహిళల పెయిర్స్‌లో సప్లీన్ థడానీ, సాధనా గుప్తా రజత పతకాలను, సీనియర్స్ పెయిర్స్‌లో సుబీర్ మజుందర్, సుజిత్ కుమార్ భట్టాచార్జీ రజత పతకాలను కైవసం చేసుకున్నారు. టీమ్‌లో స్వర్ణ పతకాలను ఆసియాలోని ప్రముఖ బ్రిడ్జ్ దేశాలు పంచుకున్నాయి. సీనియర్స్ టైటిల్‌ను ఆస్ట్రేలియా గెలుచుకోగా, పురుషుల విభాగంలో హాంకాంగ్ చైనా ఛాంపియన్‌గా నిలిచింది, మహిళల టైటిల్‌ను ఇండోనేషియా కైవసం చేసుకోగా, మిక్స్‌డ్ టీమ్స్ కిరీటాన్ని చైనా కైవసం చేసుకుంది. అరుణ్ బాపత్-అజయ్ ఖరే 616.64 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణంగెలుచుకొని ఛాంపియన్‌లుగా నిలిచారు, కాగా కామ్నా శర్మ-అభిజిత్ పాల్ 586.82 పాయింట్లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు,

## ప్రపంచ ఆర్చరీలో.. భారత్ మిక్స్‌డ్, రికర్వ్ టీమ్‌లకు రెండు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ పారా సిరీస్‌లో భారత్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణాన్ని గెలుచుకుంది. నోవే మెస్టోలో జరిగిన ఈ ఆర్చరీ సిరీస్ ఫైనల్‌లో శీతల్ దేవి, శ్యామ్ సుందర్ స్వామి ఇండోనేషియాను 147-143 తేడాతో ఓడించడంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. టైటిల్ పోరులో భారత జంట సంయమనంతో కూడిన ప్రదర్శన కనబరిచి, నాలుగు ఎండ్‌లలోనూ తమ స్థిరత్వాన్ని కొనసాగించి, ప్రత్యర్థులపై నాలుగు పాయింట్ల ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. సెమీఫైనల్స్‌లో ఫ్రాన్స్‌పై 156-144 తేడాతో తిరుగులేని విజయం సాధించారు. ఆ మ్యాచ్‌లో ఈ జంట ఆరంభం నుండి ముగింపు వరకు ఆధిపత్యం చెలాయించి స్వర్ణ పతక పోరులో స్థానం ఖాయం చేసుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని సాధించింది. రికర్వ్ మిక్స్డ టీమ్ ఈవెంట్ ఫైనల్‌లో భావనా, హర్విందర్ సింగ్‌లు ఇండోనేషియాను 6-2 తేడాతో ఓడించడంతో భారత్ మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. భారతదేశపు అతిపెద్ద పారా ఆర్చరీ స్టార్లలో ఒకరైన శీతల్, పారాలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఆసియా పారా గేమ్స్‌లో పతకాలు గెలుచుకుని, ఈ క్రీడలో వేగంగా ఎదిగారు. మరోవైపు, శ్యామ్ పలు అంతర్జాతీయ పోడియం విజయాలతో భారతదేశపు కాంపౌండ్ టీమ్ ఈవెంట్లలో ఒక నమ్మకమైన ఆటగాడిగా తనను తాను నిరూపించుకున్నారు.





## గ్రాండ్ చెస్ టూర్..రెండో స్థానానికి గుకేశ

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ జాగ్రెబ్‌లో ప్రపంచ ఛాంపియన్ భారత గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. గుకేష్, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని, రెండవ రోజు శుక్రవారం ఈవెంట్‌లో ఆరు రౌండ్ల తర్వాత ఈ స్థానంలో నిలిచాడు. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్, ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్, రొమేనియాకు చెందిన బోగ్డాన్‌డేనియల్ డీక్‌లతో కలిసి రెండవ స్థానాన్ని పంచుకుంటున్నాడు. అలీరెజా ఫిరౌజ్జా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, 12 పాయింట్లకు గాను తన ఆధిక్యాన్ని 10 పాయింట్లకు పెంచుకున్నాడు. ర్యాపిడ్ విభాగంలోని చివరి మూడు రౌండ్లలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, ఈ ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ తన తర్వాతి పోటీదారుల కంటే మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఆరంభంలో ఓటమి తర్వాత గుకేశ్ కోలుకున్నాడు బోగ్డాన్‌డేనియల్ డీక్ చేతిలో ఓటమితో గుకేష్ రోజు ప్రారంభమైనప్పటికీ, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌ను ఓడించి బలంగా పుంజుకున్నాడు, ఆ తర్వాత ఫైనల్ రౌండ్‌లో గిరిని అధిగమించాడు. తెల్ల పావులతో గిరిని ఎదుర్కొన్న గుకేశ్ తన ప్రత్యర్థి యొక్క పొరపాట్లను సద్వినియోగం చేసుకుని ఆ ఆధిక్యాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక రెండో రోజు కూడా ఆర్ ప్రజ్ఞానందకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వాన్ ఫోరెస్ట్‌పై విజయంతో రోజును ప్రారంభించిన ఈ భారత ఆటగాడు, నోదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ చేతిలో ఓడిపోయి, ఆ తర్వాత టోర్నమెంట్ లీడర్ ఫిరౌజ్జా చేతిలో మరో పరాజయాన్ని చవిచూశాడు.





## కెనడా ఓపెన్‌లో.. ఆకర్షి, తాన్యలు నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఆకర్షి కశ్యప్, తాన్య హేమంత్ రెండో రౌండ్‌లో ఓటమి పాలవడంతో బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. ఒంటారియోలో జరిగిన మహిళల సింగిల్స్ పోటీలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 71వ స్థానంలో ఉన్న ఆకర్షి, అమెరికాకు చెందిన నాలుగో సీడ్ బెయివెన్ జాంగ్‌ను ఓడించేంత దగ్గరకు వచ్చి, గంటా ఏడు నిమిషాల పాటు సాగిన పోరులో 20-22, 21-17, 21-17 తేడాతో ఓడిపోయింది.అమెరికన్ క్రీడాకారిణి భారీ ఆధిక్యంతో రెండవ గేమ్‌పై పట్టు సాధించింది, కానీ ఆకర్షి చివరి నిమిషాల్లో పుంజుకున్నప్పటికీ అది ఫలించలేదు. నిర్ణయాత్మక గేమ్ 17-17 స్కోరు వరకు సమంగానే సాగింది. ఆ తర్వాత జాంగ్ వరుసగా చివరి నాలుగు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను కైవసంచేసుకుంది. ఈ ఓటమితో జాంగ్‌పై ఆకర్షి ఓటమిరికార్డు 0-3కి చేరింది. అంతకుముందు, జపాన్‌కు చెందిన మూడవ సీడ్ రికో గుంజీ చేతిలో కేవలం 31 నిమిషాల్లో 21-11, 21-11 తేడాతో ఓడిపోవడంతో తాన్యా హేమంత్ ప్రస్థానం ముగిసింది. యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో కూడా ఈ జపనీస్ షట్లర్ చేతిలో తాన్యా ఓడిపోయిన తర్వాత, ఇన్ని వారాల వ్యవధిలో గుంజీ చేతిలో ఆమెకు ఇది రెండవ ఓటమి.

## హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు యూరప్ కంపెనీతో

# రూ.9,500 కోట్ల మెగా ఒప్పందం




**ముంబయి,జులై 3:** దేశీయ ఐటీ దిగ్గజం హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ యూరప్‌కు చెందిన ఫార్చ్యూన్ గ్లోబల్-50 కంపెనీ నుంచి 1.14 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ సేవల కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. భారత కరెన్సీలో ఈ ఒప్పందం విలువ రూ.9500 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారతీయ ఐటీ సంస్థ ప్రకటించిన తొలి బిలియన్ డాలర్ల మెగా డీల్ ఇదే కావడం గమనార్హం.ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 2026 జూలై నుంచి 2031 డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈ కాంట్రాక్ట్‌ను మరో ఐదేళ్లు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. ఈ ఒప్పందం ద్వారా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు యేటా సుమారు 228 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టు కింద క్లయింట్‌కు చెందిన గ్లోబల్ డిజిటల్ వర్క్‌ప్లేస్, ఎంటర్‌ప్రైజ్ నెట్‌వర్క్‌ల కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌ను హెచ్‌సీఎల్ రూపొందించనుంది. మొత్తం 1.14 బిలియన్ డాలర్ల విలువైన ఈ ఒప్పందం పూర్తిగా కొత్త వ్యాపారం కావడం మరో ప్రత్యేకతగా కంపెనీ వెల్లడించింది.ఈ మెగా డీల్ హెచ్‌సీఎల్‌కే కాకుండా భారతీయ ఐటీ రంగానికీ కీలక మైలురాయిగా భావిస్తున్నారు. 2024 జనవరి తర్వాత భారతీయ ఐటీ రంగానికి లభించిన నాలుగో బిలియన్ డాలర్లకు పైబడిన ఒప్పందం ఇదే. ప్రపంచవ్యాప్తంగా ఐటీ సేవల డిమాండ్ మందగించిన పరిస్థితుల్లో కూడా భారీ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది.మరోవైపు, హెచ్‌సిఎల్‌కు మూడేళ్ల తర్వాత లభించిన తొలి మెగా కాంట్రాక్ట్ ఇదే. గతంలో 2019లో జిరాక్స్ సంస్థతో 1.3 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ అవుట్‌సోర్సింగ్ ఒప్పందాన్ని హెచ్‌సీఎల్ కుదుర్చుకుంది. ప్రస్తుతం సంస్థ సీఈఓగా ఉన్న విజయకుమార్ నాయకత్వంలో కంపెనీ సాధించిన మూడో బిలియన్ డాలర్ల మెగా డీల్‌గా ఇది నిలిచింది.

# మూడోరోజూ లాభాల్లోనే సెన్సెక్స్, నిఫ్టీ




## ఐటి, హెల్త్‌కేర్, మెటల్ షేర్ల మద్దతు

**ముంబయి,జులై 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. అమెరికా ఉపాధి గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా లేకపోవడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై ఆశలు పెరగడం మార్కెట్లకు ఊతమిచ్చింది. ఐటీ, హెల్త్‌కేర్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్ 262 పాయింట్లు పెరిగి 77 వేల 764 వద్ద ముగియగా నిఫ్టీ 95 పాయింట్లు లాభపడి 24 వేల 271 స్థాయికి చేరుకుంది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 1.7 శాతం, నిఫ్టీ 1.7 శాతం మేర ర్యాలీ తీసాయి.భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మార్కెట్‌కు ప్రధాన మద్దతి చ్చాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.25శాతం క్షీణించగా స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.09శాతంపెరిగింది. మొత్తంగాచూస్తే బాంబే స్టాక్ఎక్స్ఛేంజిలో 2257 కంపెనీల షేర్లుపెరిగితే 1986 షేర్లు క్షీణించాయి. 202 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.18వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.43శాతంపెరిగి రూ.1,47,850వద్ద కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్ ధరలు బ్యారెల్‌కు 71.85 డాలర్లవద్దకొనసాగాయి ఇక షేర్లపరంగాచూస్తే పిబి ఫిన్‌టెక్ షేరు దాదాపు 6 శాతం పడిపోయింది. భారీ బ్లాక్‌డీల్‌ల కారణంగా ఈ షేరుపై అమ్మ కాల ఒత్తిడి కనిపించింది. బజాజ్ ఫైనాన్స్ తొలి త్రైమాసికంలో కొత్త రుణాలు 20 శాతం పెరగడంతో షేరు లాభపడింది. సుమిటోమో కెమికల్ ఇండియా 13 శాతానికిపైగా ఎగిసింది.

సెమీకండక్టర్ గ్లాస్‌కోర్ సబ్‌స్ట్రేట్ వ్యాపారంలో జాయింట్‌వెంచర్ ఒప్పందం ఇందుకుకారణమైంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ యూరప్‌కు చెందిన ఫార్చ్యూన్ గ్లోబల్50 కంపెనీతో కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందం కుదుర్చుకోవడంతో షేరు దాదాపు 6 శాతం పెరిగింది.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లు వరుస త్రైమాసికంతో పోలిస్తే తగ్గడంతో షేరు దాదాపు 4శాతం నష్టపోయింది. జైడస్ లైఫ్‌సైన్సెస్ క్యాన్సర్ గుర్తింపు పరీక్ష కోసం అపోలో హాస్పిటల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంతో షేరు లాభపడింది. పిసి జువెల్లర్ తొలి త్రైమాసిక ఆదాయం 21 శాతం పెరగడంతో షేరు 4 శాతం ఎగిసింది. మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనాలకుతగ్గ డేటాతో షేరు 5శాతానికి పైగా పడిపో యింది. ఐపీఓ అప్‌డేట్‌నాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించింది. ఈ ఇష్యూ చివరి రోజు నాటికి 83.14 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధరను 161 నుంచి 170 రూపాయల మధ్య నిర్ణయించారు.

## ఇన్సూరెన్స్‌దేఖో-రెన్యూబైల విలీనం

### రూ.4 వేల కోట్ల ఐపిఓకు సన్నాహాలు




**న్యూఢిల్లీ,జులై 3:** దేశంలోని ప్రముఖ బీమా పంపిణీ వేదిక ఇన్సూరెన్స్‌దేఖో, ఇన్సూర్‌టెక్ సంస్థ రిన్యూబై విలీన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మరో కొద్ది రోజుల్లో ఈ విలీనం పూర్తయ్యే అవకాశముంది. ఈ విలీనం అనంతరం ఏర్పడే సంయుక్త సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారీ స్థాయిలో ఐపిఓకు సన్నాహాలు చేస్తోంది.ఇన్సూరెన్స్‌దేఖో వ్యవస్థాపకుడు అంకిత్ అగ్రవాల్, రిన్యూబై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఇంద్రనీల్ చటర్జీ మాట్లాడుతూ విలీన ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. 2027 మార్చి 31 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీని లిస్ట్ చేయడమే లక్ష్యమని, సుమారు రూ.3,500 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల పరిమాణంలో ఐపిఓను తీసుకురావాలని సంస్థ యోచిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్త ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రస్తుతం ఉన్న వాటాదారులు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉంటుంది. సెప్టెంబరునాటికి సెబీకి డిఆర్‌హెచ్‌పిదాఖలుచేయాలని నిర్ణయించారు. విలీనం ద్వారా ఇన్సూరెన్స్‌దేఖోకు ఉన్న డిజిటల్ బీమా మార్కెట్‌ప్లేస్ బలం, రిన్యూబైకి ఉన్న ఏజెన్సీ ఆధారిత పంపిణీ వ్యవస్థ ఒకే వేదికపైకి రానున్నాయి. జీవిత బీమా, ఆరోగ్య బీమా, సాధారణ బీమా విభాగాల్లో సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు రెండుమూడుశ్రేణి నగరాల్లో విస్తరణకు ఊతం లభించనుంది. భారత్‌లో డిజిటల్ బీమా, ఆర్థిక సేవల రంగాలపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఐపిఓకు ప్రాధాన్యం ఏర్పడింది. వ్యాపార విస్తరణ, సాంకేతికతలో పెట్టుబడులు, పంపిణీ వ్యవస్థ బలోపేతం కోసం మూలధనం సమీకరించడమే ఈ పబ్లిక్ ఇష్యూ ప్రధాన లక్ష్యంగా సంస్థ భావిస్తోంది. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే, 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత ఇన్సూర్‌టెక్ రంగంలో అత్యంత ప్రాముఖ్యమైన ఐపీఓలలో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఐపిఓకు వస్తున్న పార్లేజీ

### రూ.9530 కోట్లు సేకరణ లక్ష్యం




**ముంబయి,జులై 3:** ప్రముఖ ఆహార ఉత్పత్తులసంస్థ పార్లేజి స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తోంది. వచ్చే యేడాది భారీ ఐపిఓకు రావాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ఐపిఓ ద్వారా రూ.9,530 కోట్లు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఐపిఓ సమయంలో కంపెనీ వ్యాల్యుయేషన్‌ను 10.5 బిలియన్ డాలర్లకు సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా అంచనా వేస్తున్నారు. దాదాపు వందేళ్లుగా ప్రైవేట్ సంస్థగా కొనసాగుతున్న పార్లే ప్రొడక్ట్స్ పబ్లిక్ ఇష్యూకు రానుండటం భారత కార్పొరేట్ రంగంలో ఒక ముఖ్యమైన పరిణామం. ఈ ఐపిఓ ప్రక్రియను నిర్వహించేందుకు కంపెనీ ఇప్పటికే కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్ఎస్‌బిసి సెక్యూరిటీస్‌లను సలహాదారులుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. 1929లో ముంబైలోని విలే పార్లేలో ప్రారంభమైన ఈ సంస్థను చౌహాన్ కుటుంబం ప్రమోట్ చేస్తోంది. పార్లేజీ, క్రాక్‌జాక్, మొనాకో, హైడ్ అండ్ సీక్ వంటి ఐకానిక్ బిస్కెట్లతో పాటు మ్యాంగో బైట్, మెలోడీ, పాపిన్స్ వంటి మిఠాయిలతో ఈ బ్రాండ్ దేశ ప్రజలకు దగ్గరైంది. అమెరికా, యూకే, కెనడా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలతో పాటు పలు దేశాల్లో పార్లే ఉత్పత్తులకు బలమైన మార్కెట్ ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం 8.5 వృద్ధితో రూ.15,568 కోట్లకు చేరింది. నికరలాభాలు రూ.979 కోట్లుగా నమోదయ్యాయి. ఐపిఓ ఊహాగానాలపై స్పందించిన కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మయాంక్ షా, ప్రస్తుతం వ్యాపార వృద్ధిపైనే దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఐపిఓ వస్తే ఇది భారత ఎఫ్ఎంసజి రంగంలోని అతిపెద్ద ఐపిఓలలో ఒకటిగా నిలిచిపోతుంది.

## ఇపిఎఫ్‌ఒలో 31లక్షల నిష్క్రియఖాతాలు




**న్యూఢిల్లీ,జులై 3:** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) చందాదారుల కోసం సరికొత్త ఇపిఎఫ్ స్కీమ్2026ను నోటిఫై చేసి డిజిటల్ లావదేవీలకు శ్రీకారం చుట్టింది. మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఇపిఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ చేయకుండా మూలుగుతోందన్న సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. 1952 నాటి పాత పథకం స్థానంలో జూన్ 29 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఇపిఎఫ్ స్కీమ్ 2026, నిబంధనలను సరళతరం చేయడం, వ్యవస్థను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది యాక్టివ్ చందాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సంస్కరణల నేపథ్యంలో కార్మికుల పదవీ విరమణ పొదుపు ఎంత పెద్ద మొత్తంలో వారికి చేరకుండా నిలిచిపోయిందో కూడా తెలుస్తోంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సమాచారం ప్రకారం 2026 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 30,91,862 నిరుపయోగ ఖాతాలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.9,330 కోట్లు క్లెయిమ్ చేయని నిల్వలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పరిస్థితి స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, సమస్య తీవ్రత మాత్రం తగ్గలేదు. 2025 మార్చి 31 నాటికి 31.83 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్లు ఉండగా, యేడాది వ్యవధిలో నిరుపయోగ ఖాతాల సంఖ్య 92,000, క్లెయిమ్ చేయని మొత్తం రూ.851 కోట్లు తగ్గింది. ఇప్పటికీ దాదాపు 31 లక్షల ఖాతాలు నిద్రాణంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఆధార్‌తో అనుసంధానమైన నిరుపయోగ ఖాతాలు, వాటిలోని మొత్తం, ఆటోసెటిల్‌మెంట్ స్థితి వంటి వివరాలను ఇపిఎఫ్ఒ గోప్యంగా ఉంచింది. రూ.5 లక్షలకు పైగా బ్యాలెన్స్ ఉన్న నిరుపయోగ ఖాతాల వివరాలు కోరగా, ఆ ఫార్మాట్‌లో డేటా నిర్వహించడం లేదని బదులిచ్చింది. కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నప్పటికీ, కార్మికుల కష్టార్జితం వారికి చేరడంలో దశాబ్దాలుగా ఉన్న సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## బులియన్ రంగంలో తప్పని ఒడిదుడుకులు

**ముంబయి,జులై 3:** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా సహా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్ రాబోయే రోజుల్లో బంగారం ధరలను శాసించనున్నాయని ప్రపంచ పసిడిమండలి నివేదించింది. 2026 యేడాది మొదటి భాగం బంగారం మార్కెట్‌కు అత్యంత అస్థిరమైన కాలంగా నిలిచింది. జనవరి నెల చివరలో అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 5,405 డాలర్ల చారిత్రక రికార్డు స్థాయికి చేరిన పసిడిధరలు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు మారడం, డాలర్ బలోపేతంకావడం, ఇన్వెస్టర్లు పెద్దఎత్తున లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో జూన్ చివరి నాటికి ధర 4,002 డాలర్లకు పడిపో యింది.

ఇది రికార్డు గరిష్ఠం నుంచి దాదాపు 26 శాతం భారీపతనంకావడం గమనార్హం. అమెరికా ఇరాన్ మధ్యరేగిన సైనిక ఉద్రిక్తతలు బంగారానికి రక్షణగానిలిచాయి. డబ్ల్యుజిసి నివేదిక ప్రకారం, ఆసియా, అమెరికా ట్రేడింగ్ సమయాల్లోనే బంగారంధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ పసిడి మార్కెట్‌లో ప్రస్తుతం ఆసియా దేశాల పెట్టుబడిదారులే అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని డబ్ల్యూజీసీ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం శనివారం 04 జూలై 2026 I



## 5 వ రోజు జనసేన సంస్థాగత నిర్మాణ ప్రక్రియలో 500 కు పైగా దరఖాస్తుల స్వీకరణ...
### పరిశీలకులు పంచకర్ల రమేష్ బాబు...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై3,ప్రభాతవార్త.** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నిర్మాణ సారధుల దరఖాస్తుల స్వీకరణకు కోనసీమ జిల్లా వ్యాప్తంగా జనసైనికుల నుండి విశేష స్పందన కనిపించింది.శుక్రవారం అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జనసైనికుల నుండి దరఖాస్తుల స్వీకరించిన జనసేన పార్టీ పార్లమెంటు పరిశీలకులు రమేష్ బాబు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వెంకటరమణ ఫంక్షన్ హాల్ లో పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అందరితోనూ మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముందుగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ సంకల్పాన్ని, లక్ష్యాన్ని జన సైనికులకు వివరించిన పంచకర్ల జన సైనికులు చేపట్టాల్సిన అంశాలను రాతపూర్వకంగా అందించాలని కోరారు. దీంతో భారీ ఎత్తున హాజరైన అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీలో తమ అనుభవంతో కూడిన దరఖాస్తులను సమర్పించారు. ఈ ఒక్క రోజే సుమారుగా 500 కు పైగా దరఖాస్తులు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు నుండి స్వీకరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జూలై 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అమలాపురం పార్లమెంట్ పరిధిలోని, అమలాపురం పట్టణంలో గల సత్యనారాయణ గార్డెన్స్ లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమాన్ని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వీర మహిళలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
### డాక్టర్ ఉమర్ అలీషా



కాకినాడ రూరల్,జూలై 3 (ప్రభాతవార్త):మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారి ఆర్థికంగా స్థిరపడాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా స్వామి అనుగ్రహ భాషణ చేసారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం కాకినాడ ఆశ్రమంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫర్జానా అలీషా పేపర్ ప్లేట్స్ మేకింగ్ యూనిట్ ను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా స్వామి ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపల్ డాక్టర్ కె . పద్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సమన్వయకర్త పేరూరి కోమలి కార్యక్రమ విశిష్టత ను వివరించి, ఈ కార్యక్రమం మహిళా ఆర్థిక సాధికారతకు దారి తీస్తుందని అన్నారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా స్వామి మాట్లాడుతూ కుటుంబంలో మహిళ అభివృద్ధి సాధిస్తే, కుటుంబ సభ్యులందరూ ఉన్నతిని సాధిస్తారని అన్నారు. మహిళలు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని అన్నారు. గిరిజన మహిళల కోసం ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా చీమలవారి గూడెంలో ఎన్నెన్నో మహిళాభివృద్ధి కార్యక్రమాలు కట్టా లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు కాలాన్ని సద్వినియోగం చేసుకుని మహిళా పారిశ్రామిక వేత్తలుగా,ఒక రోల్ మోడల్ గా పరిణామం చెందాలని డా. ఉమర్ అలీషా స్వామి అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యవర్గ సభ్యులు మండా యెల్ల మాంబ, కాకినాడ లక్ష్మి, చిర్ల లలిత, దాట్ల శ్రీదేవి, ఆశ్రమ కమిటీ సభ్యులు, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు పేరూరి సూరిబాబు, ఎ వి వి సత్యనారాయణ, చిర్ల వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా విద్యా విజయోత్సవం - విద్యార్థులకు ఘన సత్కారం
### పదో తరగతి అత్యంత కీలకమైన తొలిమెట్టు : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, జూలై 3 ప్రభాతవార్త** పదో తరగతి ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సందర్భంగా, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవనంలో విద్యా విజయోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైన తొలిమెట్టని. ఈ దశలో సరైన మార్గదర్శకత్వం అందిస్తే దేశానికి అద్భుతమైన మానవ వనరులను అందించవచ్చునని, కోనసీమలో విద్యా కుసుమాలు విరబూయడంలో విద్యాశాఖ, ఉపాధ్యాయుల అంకితభావం అభినందనీయమన్నారు. జోన్ పరిధిలోని 8 జిల్లాలలో కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందనలను అందుకోవడం సంతోషదాయకమని జిల్లా కలెక్టర్ అన్నారు. మొత్తం హాజరైన విద్యార్థులు: 19,138 కాగా? ఉత్తీర్ణత సాధించిన వారు 18,343 మంది అని,?మొత్తం ఉత్తీర్ణత శాతం: 95.85% నమోదు కాబడి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు ?బాలికల ఉత్తీర్ణతలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం ?శతశాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. ఈ సందర్భంగా అల్లవరం మండలం సామంతకుర్రు జడ్పీ హెచ్ఎస్ కు చెందిన శిరిగినీడి రిషిత లక్ష్మీ నిహారిక 596 మార్కులు, అమలాపురం మండలం బండారులంక జడ్పీహె చ్ఎస్ కు చెందిన? చింతపట్ల జ్యోతిశ్రీ 593 మార్కులు, రామచంద్రపురం మండలం ద్రాక్షారామం జడ్పీహెచ్ఎస్ స్కూల్ చెందిన ?కోన అభిశ్రీ 593 మార్కులు సాధించిన విద్యా ర్థినిలకు ?ఘన సత్కారం లభించింది. అదేవిధంగా ?పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యా ర్థులను, శత శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, డీవై ఈఓలను మరియు మండల విద్యాశాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఆర్జేడీ జి. నాగమణి, డీఈఓ పి. నాగేశ్వరరావుల చేతుల మీదుగా దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.?ఈ కార్యక్రమంలో పీ 4 మార్గదర్శి చెరుకూరి సాయిరామ్, ఓ ఎన్ జి సి ఈస్టర్న్ ఆఫ్‌షోర్ ఈడీ ప్రభాల్‌సేన్ గుప్తా, ఈస్ట్‌కోస్ట్ రవ్వ ప్రాజెక్ట్ హెడ్ సౌమెన్ దేవ్, జిల్లా రవాణా శాఖ అధికారి డి. శ్రీనివాస్, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అశోక్ నాగరాజన్, ప్రభుత్వ పరీక్షల విభాగం ఏసీ బి. హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీ వీ ఎస్ సుబ్రహ్మణ్యం సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రా - యానం సరిహద్దుల్లో ఉద్రిక్తత.

**తూర్పుపేట ప్రాంతంలో యానాం ఎస్.టి.పి. ప్లాంట్ వివాదం.**
**ప్లాంటు ఆంధ్రా సరిహద్దులో ఏర్పాటు చేయొద్దని రాస్తారోకో**
**ఎన్. హెచ్. 216పై స్తంభించిన ట్రాఫిక్.**
**ప్లాంటు ఏర్పాటు చేయబోయే స్థలం హైకోర్టు పరిధిలో ఉంది.**
**ఆర్డీవో మల్లిబాబు స్పష్టం.**





తాళ్లరేవు, జూలై 3 (ప్రభాతవార్త): ఆంధ్రా - యానం సరిహద్దు వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో యానం ప్రభుత్వం సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్.టి.పి.) మురుగునీరు శుద్ధి కర్మాగారం నిర్మించాలని యానం అధికారులు చేస్తున్న సన్నాహాలను స్థానికులు అడ్డుకోవడంతో ఆంధ్ర, యానం సరిహద్దుల్లో ఉద్రిక్త నెలకొంది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట ప్రాంతంలో యానం ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులు శుక్రవారం సర్వే చేయడానికి సన్నాహాలు చేస్తుండగా మండల అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్తులు ఇరు రాష్ట్రాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో యానం ప్లాంట్ ఏర్పాటు చేయడం తగదని జాతీయ రహదారి 216పై బైఠాయించి ఆందోళన చేశారు. ఆంధ్ర అధికారులు యానం అధికారులకు సపోర్ట్ చేస్తున్నారని, దీనిపై ఆర్డీఓ, ప్రజలకు వివరణ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లా అధికారులు వచ్చి ఈ అంశంపై సమాధానం చెప్పాలని పట్టు పట్టడంతో ఆందోళనకారులను శాంతింప చేసే పోలీసుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. [illegible] ఆర్డీఓ మల్లిబాబు [illegible] హైకోర్టు పరిధిలో [illegible] తూర్పు పేట ప్రజలు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## గుప్త నిధుల కోసం తవ్వకాలు?
### -తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు





**యు.కొత్తపల్లి, జూలై 3 (ప్రభాతవార్త)** ఇంటి నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుని చెరువు పూడిక మట్టి తవ్వడంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ తవ్వకాలను అధికారులు పరిశీలించడంతో అసలు విషయం బయటపడుతున్నాయి. మండలంలోని పాత ఇసుకపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమీపంలో ఒక వ్యక్తి ఇల్లు నిర్మాణానికి అనుమతులు తీసుకుని అక్కడ (20 అడుగుల పైగా) లోతు తవ్వుతుండటంతో గ్రామ రెవెన్యూ అధికారి కిషోర్, పంచాయితీ అభివృద్ధి అధికారి జీయన్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని తహశీల్దార్ జి.చిన్నారావు శుక్రవారం పరిశీలించారు. సదరు తవ్వకాలు జరుపుతున్న యజమానిని తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించడమైంది.ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, పాడా పీడీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు తీసిన గొయ్యిని వెంటనే పూడ్చివేయాలని ఆదేశించడం జరిగింది, సదరు తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంపై నిఘా ఉంచాలని వీఆర్వో కి, వెంకటేష్ కి ఆదేశించడం జరిగిందన్నారు.

## భారతీయులు మరవజాలని
# మహనీయుడు అల్లూరి సీతారామరాజు
### నేడు మన్యం వీరుడు అల్లూరి 130 వ జయంతి




**వి.ఆర్.పురం,జూలై3,ప్రభాతవార్త**

**భారతదేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలపై వీరోచిత పోరాటం చేసి, చివరకు దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు, భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు ఈ నేలపై పుట్టి నేటికి 130 ఏళ్లు అయ్యింది. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలపై పోరాటంచేసి, ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. అటువంటి మహనీయుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. పీడిత ప్రజల విముక్తి కోసం, దేశ ప్రజల స్వాతంత్ర్య స్వేచ్ఛావాయువుల కోసం, మాతృభూమి పై ప్రేమాభిమానాలకన్నా, తన ప్రాణం విలువైనది కాదని అల్లూరి 26 ఏళ్ల యవ్వనప్రాయంలోనే తెల్లదొరల తుపాకి గుండ్లకు ఎదురొడ్డి, ప్రాణాలను అర్పించిన త్యాగశీలి.**

అల్లూరి సరిగ్గా ఇదేరోజు 1897 జూలై 4 న విశాఖ జిల్లా, భీమునిపట్నం సమీపంలోని పాండ్రంగి గ్రామంలో వెంకటరామరాజు - నారాయణమ్మ దంపతులకు తొలి సంతానంగా జన్మించారు. సీతారామరాజు కు సత్యనారాయణరాజు, సీత అనే ఒక సోదరుడు, ఒక సోదరి. రామరాజు తండ్రి వెంకటరామరాజు ఫోటో గ్రాఫర్ గా పనిచేసేవారు. రామరాజు చిన్నతనంలోనే తండ్రి అకాలమరణం చెందారు. తండ్రి అకాలమరణంతో రామరాజుపై కుటుంబభారం పడింది. దీంతో అల్లూరి ఆరోజుల్లో 8.వ తరగతి వరకు మాత్రమే చదవగలిగారు. భారతీయులపై తెల్లదొరల అరాచకాలను సహించలేక అల్లూరి విప్లవ కారుడిగా మారారు. సాయుధ పోరాటం ద్వారానే తెల్లదొరలను తరమాలని, అలా అయితేనే దేశానికి స్వాతంత్ర్యం సాధ్యమని సరిగ్గా 18 ఏళ్ల ప్రాయంలో 1922 లో బ్రిటీష్ ప్రభుత్వంపై మన్యం కేంద్రంగా తిరుగుబావుట ఎగురవేశారు. మన్యం కేంద్రంగా ఆదివాసీలను కూడగట్టుకొని అల్లూరి ఆంగ్లేయులపై సాగించిన పోరాటం, దేశ స్వాతంత్ర్యనికి బాటలు వేసింది.

**అల్లూరి ప్రాణ త్యాగఫలితమే, ఆంగ్లేయులతో దేశానికి విముక్తి, స్వాతంత్ర్యం**

భారతదేశాన్ని తమ కబంధ హస్తాల్లో బంధించిన తెల్లదొరల నుండి మనకు స్వాతంత్ర్యం రావటానికి మూలం అల్లూరి ప్రాణత్యాగం అని చెప్పక తప్పదు. తెల్లదొరలపై అల్లూరి రెండేళ్లపాటు సాయుధపోరాటం సాగించారు. వారి పోరాట స్ఫూర్తి దేశ నాలుమూలలకు పాకింది. ఆ పోరాటంలో అల్లూరి 1924 మే 7 న బ్రిటీష్ సైనికుల చేతుల్లో చిక్కారు. అలా చిక్కిన అల్లూరిని బ్రిటీష్ సైనికులు చెట్టుకు కట్టేసి కాల్చిచంపారు. ఈ ఘటన దేశపౌరుల్లో బ్రిటీష్ ప్రభుత్వంపై కోపం కట్టలు తెంచుకునేలా చేసింది. రామరాజు మరణాంతరం 1947 ఆగష్టు 14 అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది.

**దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్లు గడిచినా పీడిత ప్రజలపై ఆగని దోపిడి.**

అల్లూరి సీతారామరాజు లాంటి ఎందరో త్యాగమూర్తుల ప్రాణ త్యాగంపలితంగా, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచిపోతున్నా, పీడిత ప్రజలపై పెత్తందార్ల దోపిడి కొనసాగుతూనే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం పరదేశీయుడు పీడిత ప్రజలను దోచుకుంటే, నేడు స్వదేశీయులే శ్రమజీవుల శ్రమను, పీడిత ప్రజలను దోచుకుంటున్నారు. ఈ దోపిడికి ఇప్పుడు ఇక్కడా, అక్కడనే తేడాలేకుండా పోయింది. అందుకే నేటితరం ప్రజానీకం మహనీయుడు అల్లూరి మళ్ళీ పుట్టాలని కోరుకుంటుంది. నేడు విప్లవ కెరటం, మన్యం వీరుడు, భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి 130 వ జయంతి సందర్భంగా, పాఠక దేవుళ్ళకు ప్రభాతవార్త అందిస్తుంది ఈ ప్రత్యేక కథనం. అల్లూరి సీతారామరాజు త్యాగాలను స్మరించుకుందాం ! మహనీయుడి అల్లూరి త్యాగశీలతను భావితరాలకు అందిద్దాం!!



## కోనసీమ వాసునికి అష్టోత్తర పూజలు.. భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం





**ఆత్రేయపురం, జూలై 03,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం వేలాది మంది భక్తులతో పోటెత్తింది. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ ,నల్లం సూర్య చక్రధరరావులు అలాగే వాతావరణ శాఖ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ హెచ్చరిక లు జారీ చేయడంతోశనివారం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## బుడ్డగండి మన్యంలో జిల్లా కలెక్టర్ - యం ఎల్ ఏ పర్యటన
### మారుమూల గ్రామాల అభివృద్దే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి.



**పోలవరం జిల్లా ప్రతినిధి,జూలై 3 ప్రభాత వార్త.**మారు మూల గ్రామాల అభివృద్దే లక్ష్యం గా అధికారులు పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ దేనేష్ కుమార్, రంపచోడవరం యం ఎల్ ఏ మిరియాల శిరీష దేవి పిలుపునిచ్చారు.శుక్రవారం గుర్తేడు మండలంలోని బొడ్డగండి పంచాయితీలో పర్యటించిన కలెక్టర్ మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రకటించారు.గుర్తేడు మండలం బొడ్డ గండి గ్రామంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి, ఒక నెల ఒక నియోజకవర్గం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టే ఉద్దేశ్యంతో "ఒక నెల ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు " కార్యక్రమంలో భాగంగా గుర్తేడు మండలం బొడ్డగండి పంచాయితీ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పంచాయితీ పరిధిలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు దిశ నిర్దేశము చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మండలంలోని మారుమూల గ్రామాలలోని గిరిజనులకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు గ్రామాలలో పర్యటించాలని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు రక్తహీనత లేకుండా అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారం ఎప్పటికప్పుడు అందజేసే విధంగా అధికారులు కృషి చేయలన్నారు. ఓటర్లలో సవరణలు, భూ సర్వే చేయు అధికారులకు మండలంలోని ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఆయన అన్నారు. ఈ సమావేశానికి వచ్చిన సమస్యల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా త్రాగునీరు,కరెంటు సౌకర్యం, రహదారులు,గృహాలు, వివిధ రకాలైన పింఛన్లు, ప్రతి నెల రేషన్ సకాలంలో పంపిణీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి 125 రోజులు వి బి జి రాంజీ పనులు కల్పించడం, వివిధ రకాల సేవలు ప్రభుత్వ సేవలు ఏర్పాటు చేయడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈప్రాంత ప్రజల సమస్యలను వారి వారి గ్రామాలలోనే తెలుసుకొని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకొనే లక్ష్యంతో మన జిల్లాలో ఒక నెల - ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమం లో భాగంగా గ్రామాలలో పర్యటించి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సమావేశం ఏర్పాటు చేసి గిరిజనుల నుండి నేరుగా వినతులు,ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గిరిజనులకు సకాలంలో వివిధ సేవలందించే విధంగా గుర్తేడు మండలం ఏర్పాటు చేయడం జరిగిందని, బొడ్డగండి పంచాయతీలోని మద్దులూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో పాలగడ్డ నుండి బొడ్డ గండి గ్రామం వరకు సుమారు 16 కిలోమీటర్ల రోడ్ ఏర్పాటు చేయాలని, కారు మామిడి గొంది నుండి కానీ వాడ వరకు మూడు కిలోమీటర్లకు రహదారి ఏర్పాటు చేయాలని, బొడ్డ గండి పంచాయతీలోని 12 గ్రామాల గిరిజనులకు గుర్తేడు గ్రామ సచివాలయంలో వివిధ రకాలైన పథకాలకు దరఖాస్తులు సమర్పించుకొని ఆన్లైన్ చేయుటకు అనుమతి మంజూరు చేయాలని గిరిజనులు దరఖాస్తుల ద్వారా జిల్లా కలెక్టర్, యం యల్ ఏ కు వినతులు అందజేశారు.గొంది కోట గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేయుచున్న చెరువును, చాపరాయి గ్రామ సమీపంలోని ఏర్పాటు చేయుచున్న వంతెనను పరిశీలించి చాపరాయి గ్రామంలోని గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అయినటువంటి వివిధ రకాలైన సామాజిక ఎన్టీఆర్ భరోసా పించను, ప్రతి నెల రేషన్ సకాలంలో అందుచున్నది లేనిది ఆరా తీశారు. బొడ్డగండి నుండి ఆంటీలోవ వరకు వెళ్లే రహదారిని పరిశీలించారు. అదేవిధంగా పాలగడ్డ బొడ్డ గండి రోడ్డును పరిశీలించారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఒక నెల - ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు పోలవరం జిల్లా లో ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న పథకాలు లబ్ధిదారులకు చేరవేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగం ఎక్కడికక్కడ చర్యలు చేపట్టడం జరిగిందని ఆమె అన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, అన్న క్యాంటీన్,దీపం-2 పథకం, ప్రతినెల వివిధ రకాలైన పింఛన్లు, తల్లికి వందనం, ప్రతినెల రేషన్ పంపిణీ, ఈ ప్రాంత రైతులకు వివిధ రకాలైన విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టడం జరిగిందని ఆమె అన్నారు. ఈ ప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆమె అన్నారు.నిరుపేద గిరిజనులకు గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ ప్రాంత గిరిజనులకు వివిధ రకాలైన ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అని ఆమె అన్నారు. ప్రజల సమస్యలను గ్రామస్థాయిలో గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. మన కొత్త జిల్లా మన నూతన గుర్తేడు మండలం అంచలంచలుగా అభివృద్ధి చేసుకొనుటకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ షరీఫ్, డిఎమ్ఓ భాస్కర్,డి. ఏ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి సరిత, ఆర్.డి.ఏ.పి.డి డాక్టర్.దాసరి రత్నాకర్ రావు, ఎంపీపీ కె.ఆనంద్,ఐసిడిఎస్ పిడి కె.ఉమా, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు,తాసిల్దార్ వేణుగోపాల్,ఎంపీడీవో బాపన్న దొర,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.





## ఏఎస్ఎన్ క్రషర్ ఆగడాలు..
### ప్రాణం ఖరీదు 10 లక్షలు - యువకుడు మరణం తో బేరసారాలు.



**రౌతులపూడి, జులై 3. (ప్రభాత వార్త)** రౌతులపూడి మండలం ఉప్పంపాలెంలో నిర్వహిస్తున్న ఏ ఎస్ ఎన్ క్వారీ క్రషర్ ఆగడాలకు హద్దులేకుండా పోతుంది.గురువారం రాత్రి క్రషర్ లో పనిచేస్తున్న గిడజం గ్రామానికి చెందిన తంటపురెడ్డి కుశరాజు (17) అనుమాన స్పద స్థితిలో మరణించాడు. అయితే కుశరాజు మరణం విషయమై క్రషర్ యాజమాన్యం చెబుతున్న పొంతనలేని సమాధానాలతో శుక్రవారం ఉదయం నుంచి గ్రామస్థులు రోడ్డు పైభయటాయించి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. క్రషర్ యాజమాన్యం వివరాల ప్రకారం లారీ లోడుతో గురువారం రాత్రి వెళుతుండగా కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో ఉండగా కారు లో తుని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించామని అక్కడే కుశరాజు మృతిచెందాడని ,ఒకరు, ఎలాజరిగిందో తెలియటం లేదని కొందరు పనివారు చెబుతున్నారని దీనిపై తమకు అనుమానాలున్నాయని తల్లితండ్రులు,తంటాపురెడ్డి రంగ,రాణితో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. గిడజాం గ్రామంలో ప్రమాదం జరిగితే అదే గ్రామంలో నివసిస్తున్న మాకు ఎందుకు తెలియపరచలేదని,తమకుమారుడు శరీరంపై రాళ్ళదెబ్బలున్నాయని , క్రషర్ లోనే చనిపోతే ఈ విధంగా సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**కొడుకా రావా అంటూ తల్లి ఆవేదన.**

చేతికందివచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి పోవడంతో తల్లితండ్రులను ఓదార్చడం బందువులవల్ల కావటం లేదు.10వతరగతి వరకు చదివిన కుమారుడు ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో ఏ ఎస్ ఎన్ క్రషర్ లో పనిలో కి వెళ్ళి కుటుంబాన్ని పోషిస్తున్నాడని ఇపుడు తమకు దిక్కెవరు పెద్దల కాళు ్ళపట్టుకుని ఏడుస్తున్న తీరు చూపరులను కంటనీరు పెట్టిస్తుంది. గత మూడురోజుల క్రితమే ఏ ఎస్ ఎన్ క్రషర్ వల్ల ప్రజలు ప్రాణాలు పోయే అవకాశం ఉందని ప్రభాత వార్త తెలిపింది. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే ఏ ఎస్ ఎన్ యాజమాన్యం కొద్దిమంది పెద్దలుద్వారా మంతనాలు జరిపి బేరసారాలు సాగించి బాధితులను ఒప్పించడం ఆనవాయితీగా మారింది. అయితే గిడజాం గ్రామంలో గ్రామస్థులందరూ బేరసారాలకు వచ్చిన యాజమాన్యాన్ని కొద్దిసేపు బంధించి తరువాత తరుకుంటూ ఊరిబయటవరకు నెట్టడంతో భయపడిన యాజమాన్యం 10లక్షల రూపాయలు కుటుంబానికివ్వడాని తదుపరి ఖర్చులు భరించడానికి ఒప్పుకున్నారు.ఉదయంనుంచి సాయంత్రం వరకు రౌతులపూడి. ఎస్ ఐ వెంకటేశ్వరరావు ,అన్నవరం ఎస్ ఐ శ్రీహరిబాబు పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రహారీ నిర్వహించారు.బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం ఒకత ప్పైతే మసిరాసి మారేడు కాయల చేయడం ఏ ఎస్ ఎన్ క్రషర్ ఆగడాలకు అర్థం పడుతుందని గ్రామస్థులు వాపోతున్నారు.ఇదే విధంగా అనేకసార్లు జరిగినా యాజమాన్యం డబ్బులిచ్చి చేతులు దులుపుకోవడమేత ప్ప మార్పు కనబడటంలేదు.ఈ విషయమై ఎస్ ఐ వెంకటేశ్వరరావు ను వివరణ కోరగా పోస్ట్ మార్టం రిపోర్ట్ వస్తె నే గానీ చెప్పలేమన్నారు.

## కాకినాడ జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో పునర్నిర్మించిన టెన్నిస్ కోర్టు ప్రారంభం:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జులై 3 (ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో పునర్నిర్మించిన టెన్నిస్ కోర్టును శుక్రవారం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,, జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలు పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉత్సాహాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ (ఏఆర్) వి.జి. శ్రీహరి రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి ఏటిగట్ల పటిష్టతకు ప్రతిపాదనలు రూపకల్పన
### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలక్టరేట్, జూలై 03 ప్రభాతవార్త** బలహీనపడిన గోదావరి నది ఏటిగట్లను శాశ్వత ప్రాతిపదికన పటిష్టపరచడానికి సిఎస్ఐఆర్ - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రతినిధులతో కలిసి సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమా ర్ వెల్లడించారు.? శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి సిఎస్ఐ ఆర్-ఎన్ఐఓ ప్రతినిధులు డాక్టర్ వినీత్, సైంటిస్టులు జయ కుమార్, సేలంలతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కుండలేశ్వరం వద్ద గోదా వరి తీరం వెంబడి ఏటిగట్టు కిందకు దిగిపోయిన కుంగి పోయినఘటనను తీవ్రంగా పరిగణించామన్నారు. ఇటువంటి బలహీనమైన, ప్రమాదకరమైన ప్రాంతాలను రక్షించడానికి శాస్త్రీయ విధానాలు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యం లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణు లు, గోదావరి హెడ్ వర్క్స్ జలవనరుల శాఖ ఇంజనీర్లు కలిసి క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పర్యటించాలని ఆదేశించారు. గోదావరి తీరప్రాంత పొడవునా ఎక్కడెక్కడ ఏటిగట్లు బలహీనపడ్డాయో క్షుణ్ణంగా గుర్తించి, వాటి పునరుద్ధరణకు ప్రాథమిక నివేదిక, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.?ఈ ప్రతిపాదనల ఆధారంగా డాక్టర్ ఎం.ఎస్. శ్రీవత్స, సంస్థ సీఈఓ కిరణ్ పమిడిపాటి సాంకేతిక అంచనాలను త్వరితగతిన రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. భవిష్యత్తులో నదీ తీర ప్రాంతాల్లో సంభవించే విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు, ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నుండి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ పర్యవేక్షకు ఇంజనీర్ జి శ్రీనివాసరావు, వారి సహచర ఇంజనీర్లు జిల్లా జిల్లా డ్రైనేజీ విభాగం కార్య నిర్వాహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్ శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ద్రాక్షారామంలో బీజేపీ మండల సమావేశం



**రామచంద్రపురం,జూలై 03(ప్రభాతవార్త):** రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు.పార్టీ బలోపేతం,సభ్యత్వ నమోదు,బూత్ కమిటీల బలోపేతం, రానున్న కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.సమావేశంలో కర్రి చిట్టిబాబు,నాగిరెడ్డి సతీష్‌రావుతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల దారిలో డంపింగ్ యార్డ్ క్లీన్
### దోమల నివారణకు పంచాయతీ అధికారుల చర్యలు



**అడ్డతీగల,జులై 3, ప్రభాతవార్త** అడ్డతీగల గురుకుల పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న డంపింగ్ యార్డును పంచాయతీ అధికారులు శుక్రవారం దగ్గరుండి శుభ్రం చేయించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డంపింగ్ యార్డులో నీరు చేరి చెత్త కుళ్ళిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని. నిత్యం విద్యార్థులు తల్లిదండ్రులు స్థానికులు ఈ దారి గుండానే పాఠశాలకు, మద్ది గడ్డ ప్రాజెక్ట్ కు వెళ్తుండటంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించారు.సిబ్బందితో కలిసి డంపింగ్ యార్డులోని చెత్తను పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం దోమల నివారణకు, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లించి, ఫాగింగ్ చేయించారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు కూడా సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. సకాలంలో స్పందించి చెత్తను తొలగించిన పంచాయతీ అధికారులకు పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్లాస్టిక్ బ్యాగులు వద్దు...

## -క్లాత్ బ్యాగులు ముద్దు చిన్నారులు వినూత్న ప్రదర్శన.



**ఆత్రేయపురం, జూలై, 03.(ప్రభాత వార్త)** ప్లాస్టిక్ బ్యాగులు వద్దు క్లాత్ బ్యాగులు ముద్దు అంటూ చిన్నారులు అల్లూరి,వివేకానందుని వేష ధారణలో క్లాత్ బ్యాగ్ లను పంచుతూ వినూత్నంగా అలరించారు. మండలంలోని ర్యాలి ప్రధాన ఫౌండేషన్ పాఠశాలలో 1,2వ తరగతులు చదువుతున్న చిన్నారులు ప్రపంచ ప్లాస్టిక్ బ్యాగుల రహిత దినోత్సవం సందర్భంగా గాను రేపు అల్లూరి సీతారామరాజు జన్మదినోత్సవం, వివేకానందుని వర్ధంతి పురస్కరించుకొని వారి వేషధారణలో ప్లాస్టిక్ బ్యాగులు వద్దు క్లాత్ బ్యాగులు ముద్దు అంటూ తమ చిన్న చిన్న ముద్దు మాటలతో వీధిలో తిరుగుతూ ప్రజలకు క్లాత్ బ్యాగ్ను ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ పర్యవేక్షణలో పంపిణీ చేసి ప్రజలలో అవగాహనా కల్పించారు.

# భూమి విలువ ఎకరాకు రూ. 12.50 లక్షలుగా గుర్తింపు తహసీల్దార్ తేజస్విని



**అడ్డతీగల,జూలై 03, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు చింతూరు డివిజన్కు చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం కోసం అడ్డతీగల మండలంలో వ్యవసాయ భూముల సేకరణ చేపట్టబడుచున్నది.అడ్డతీగల మండలంలోని ఆసక్తి గల రైతులు తమకు చెందిన యాజమాన్య హక్కులు కలిగి, కుటుంబ వివాదాలు మరియు కోర్టు కేసులు లేని, వ్యవసాయానికి అనువైన భూములను ప్రభుత్వానికి విక్రయించదలచిన యెడల, సంబంధిత భూమి పత్రాలతో అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించవలెను.ఈ భూముల సేకరణకు ప్రభుత్వం ఎకరానికి రూ.12,50,000/- గా నిర్ణయించింది. కావున, భూములు విక్రయించదగిన ఆసక్తి ఉన్న రైతులు తమ భూమికి సంబంధించిన అన్ని రకాల పత్రాలతో వీలైనంత త్వరగా అడ్డతీగల తహసీల్దార్ తేజస్విని సంప్రదించాల్సిందిగా కోరడమైనది.

# రోడ్డా? నరకకూపమా?

## - అడ్డతీగల బ్రహ్మల కాలనీ రోడ్డుపై ప్రయాణికుల నరకయాతన



**అడ్డతీగల,జూలై 03, ప్రభాతవార్త** మండల కేంద్రమైన అడ్డతీగలలోని బ్రహ్మల కాలనీ వెళ్ళలంటే స్థానికులు, వాహనదారులు నరకయాతన పడవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఈ రోడ్డు పూర్తిగా జలమయమై, పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు చిన్నపిల్లలు ఇదే రోడ్డు మార్గంగా పాఠశాలలకు వెళ్తుండగా, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు తేలి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రయాణిస్తూ అదుపుతప్పి ఆ వాటర్ ఉన్న గోతుల్లో పడిపోవడం నిత్యకృత్యంగా మారింది.దీనికి తోడు, చుట్టుపక్కల ఇళ్ల నుండి వచ్చే మురుగునీరు, వర్షాలు కూడా రోడ్డుపైకే వచ్చి చేరడంతో అక్కడ నీరు నిల్వ ఉండిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈ కలుషిత నీటి వల్ల దోమలు, ఈగలు చేరి భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు మరియు అంటువ్యాధులు ప్రబలే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నరకం చూస్తున్న ఈ రహదారి దుస్థితిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

## -పునాది అభ్యసనం బలోపేతం చేయాలి : డిప్యూటీ కలెక్టర్ మమ్మీ



**రావులపాలెం, జూలై 03 (ప్రభాతవార్త) :** సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మమ్మీ అన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి డీఆర్పీల రిఫ్రెషర్ శిక్షణ శిబిరాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పునాది అభ్యసనాన్ని బలోపేతం చేసేందుకే గత రెండేళ్లుగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రీ-ప్రైమరీ, ప్రాథమిక స్థాయిలో తెలుగు, గణితం, ఇంగ్లీష్ అంశాల్లో విద్యార్థులకు పట్టు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎఫ్ఎల్ఎన్ లక్ష్య సాధనకు శిక్షణలో పొందిన జ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు చేరవేయాలని డీఆర్పీలకు సూచించారు. అనంతరం శిక్షణా కేంద్రంలో కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఏఎంఓ వి. రాంబాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన 127 మంది డీఆర్పీలకు ఆరుగురు కేఆర్పీలు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

# సానా సతీష్ ప్రజా దర్బార్కు విశేష స్పందన



**కాకినాడ రూరల్ జూలై 3 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు ప్రజల నుండి విశేష స్పందన వస్తుంది.ప్రజల కష్టాలకు భరోసా కల్పిస్తూ సానా సతీష్ బాబు ఆదేశాల మేరకుకొప్పవరం క్యాంపు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు బాధితులు అర్జీలతో , తరలివచ్చారు. 58వ వారం నిర్వహించిన ప్రజా దర్బార్కు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సమస్యలు, ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలపై బాధితుల నుండి 21 అర్జీలను స్వీకరించినట్లు కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి తెలిపారు. ఈ విన్నపాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు.

# అడవుల అభివృద్ధికి సీడ్ బాల్స్ కార్యక్రమం మరింత దోహదపడుతుంది

## -చీఫ్ కంజర్వేటర్ జ్యోతి (ఐఎఫ్ఎస్, సిసిఎస్)



**వి.ఆర్.పురం,జూలై 3, ప్రభాతవార్త** అడవుల అభివృద్ధికి సీడ్ బాల్స్ కార్యక్రమం మరింత దోహదపడుతుందని, అటవిశాఖ అధికారులు, సిబ్బంది సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని, చీఫ్ కంజర్వేటర్ టి జ్యోతి (ఐఎఫ్ఎస్, సిసిఎస్) రాజమండ్రి సర్కిల్ అన్నారు. అడవుల పరిరక్షణ, అడవుల అభివృద్ధి కోసం 1950 నుండి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జూలై 1 నుండి 7 వ తేది వరకు వన మహోత్సవాలు జరుగుతున్నాయి. అడవుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సీడ్ బాల్స్ (విత్తనాలను మట్టి ఉండల్లో గుచ్చి) నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన విషయం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి తలపెట్టిన సీడ్ బాల్స్ కార్యక్రమం, పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ కారణంగా వి.ఆర్.పురం అటవి క్షేత్రం పరిధిలో ముంపుకు గురవుతున్న అటవి పరిశీలనలో భాగంగా, చీఫ్ కంజర్వేటర్ జ్యోతి వి.ఆర్.పురం మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా ఆమె స్థానిక అటవి శాఖ కార్యాలయంలో సీడ్ బాల్స్ స్టాక్ ను పరిశీలించారు. సీడ్ బాల్స్ కార్యక్రమం జరుగుచున్న తీరును డి.ఎఫ్.ఒ డి.రవీంద్రన్ రెడ్డి (ఐఎఫ్ఎస్) చింతూరు, వి.ఆర్.పురం ఎఫ్ఆర్ఒ ఎస్ రామకృష్ణ, కూనవరం ఎఫ్ఆర్ఒ పి.వి.వి.ఎస్.ఎన్ మూర్తి లను అడిగి తెలుసుకున్నారు. అటవి శాఖ కార్యాలయంలో భద్రపరచిన సీడ్ బాల్స్ పెట్టెల రక్షణకు గాను పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం స్థానిక టింబర్ డిపోను పరిశీలించి, అక్కడే మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం, కూనవరం,చింతూరు మండలాలకు చెందిన అటవి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా క్రైస్తవ దినోత్సవ వేడుకలు

## -మర్లావ లో మెగా వైద్య శిబిరం



**పెద్దాపురం జూలై 03(ప్రభాత వార్త )** అపోస్తుడైన తోమా హతసాక్షి అయిన సందర్భంగా శుక్రవారం క్రైస్తవ దినోత్సవం పురస్కరించుకుని పెద్దాపురం మండల పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవ దినోత్సవ ఘనంగా నిర్వహించారు. మండలం లోని మర్లావ గ్రామంలో దైవజనులు బిషప్ బి యోసేపు మందిరంలో మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందించారు.ఈ వైద్య శిబిరం పెద్దాపురం పట్టణంలోని శ్రీ విజయలక్ష్మి హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయలక్ష్మి వారి సిబ్బంది, బొమ్మూరు నేత్రాలయం కంటి వైద్య నిపుణులు విజయభాస్కర్, సతీష్ లు చుట్టుపక్కల ప్రజలు వస్తూ ఉండగా చక్కని వైద్యం అందించారు. ఈ నెల 1వ తేదీ డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మిని డాక్టర్ సతీష్, విజయలక్ష్మి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నూకరత్నం, ఫెలోషిప్ జాయింట్ సెక్రెటరీ ఆర్ఎంపీ డాక్టర్ వైద్యులు రెవరెండ్ విజయ్ భాస్కర్ డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మండల పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్స్ మరియు ప్రెసిడెంట్ అండ్ సెక్రెటరీ కమిటీ ఫెలోషిప్ సభ్యులు మరియు పెద్దాపురం నియోజకవర్గ ఫెలోషిప్ అధ్యక్షులు మరియు కమిటీ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

## -ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బుజ్జిబాబు



**పెదపూడి.ప్రభాతవార్త** పెదపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి బుజ్జిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఇప్పటివరకు ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన తులసీరామ్ విఆర్ కు బదిలీ అయ్యా రు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ 2 టౌన్ నుంచి పెదపూడి స్టేషన్ కు ఎస్ఐగా బుజ్జిబాబు వచ్చారు. ఏఎస్ఐ, స్టేషన్ సిబ్బంది ఎస్సైకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ బుజ్జిబాబు మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో సేవలు అందిస్తామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కట్టిన చర్యలు తీసుకుంటామని, మండలంలో గంజాయి రవాణా, గంజాయి అమ్మకాలు, గంజాయి వాడకం పై ప్రత్యేక దృష్టి పెడతామని, పేకాట క్లబ్బుల పై పేకాట ఆడే వారిపై ప్రత్యేక డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గొల్లలమామిడాడ గ్రామంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

# ఇరమండ బోదె ఆక్రమణ

## -500ఎకరాలకు పొంచి ఉన్న ముప్పు ఆవేదనలో ఉప్పూడి రైతులు



**కాట్రేనికోన జూలై 03(ప్రవతవార్త)** కాట్రేనికోన మండలం ఉప్పూడిలో పంటచేల నుంచి ముంపు నీరు దిగే పంటబోదెను కొంతమంది ఆక్వా రైతులు ఆక్రమించుకోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శుక్రవారం ఉప్పూడిలో పలువురు రైతులు మాట్లాడుతూ ఇరమండ నుంచి ఓల్డ్ అయినాపురం డ్రైన్ లో కలిసే బోదె ద్వారా పరిసర పంటపొలాల్లో నీరు క్రిందకు దిగుతుందన్నారు. రెండేళ్ల క్రితం ఈ బోదెను కొంతమంది ఆక్వా రైతులు ఆక్రమించుకొని మూసివేయడంతో ముంపు, వరదల నీరు దిగక సుమారు 500 ఎకరాల్లో తమ పంటచేలు పూర్తిగా ముంపుకు గురై సాగుకు నోచుకోవడం లేదని తెలిపారు. గతంలో ఈ బోదె గుండా నీరు దిగి సాగు సక్రమంగా సాగేదన్నారు. కానీ కొంతమంది బోదెను పూడ్చి వేయడంతో నీరు దిగక పంటచేలు పూర్తిగా నాశనం అవుతున్నాయన్నారు. ఉప్పూడి గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు అంతా కలిసి సుమారు 500 ఎకరాలు వరి పంటను సాగు చేస్తున్నామన్నారు. వరిసాగుతోనే మా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అన్నారు. పంటచేలకు జీవనాడిగా ఉండే పంటబోదేలు ,ఉప్పూడిలోని ఇరమండ నుండి కాట్రేనికోన ఓల్డ్ అయినపురం డ్రైన్ ఉప్పుకాలువ వరకు సుమారు రెండు వందల మీటర్ల మేర కొంత మంది ఆక్వారైతులు ఆక్రమించి రొయ్యల సాగు చేస్తుండడంతో, పంటబోదెలను పూడ్చి వేశారని గత నెల 15వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికీ 15 రోజులు సమయం గడుస్తున్న సంబంధిత అధికారులు రైతులకు ఎటువంటి పరిష్కారం చూపలేదని శుక్రవారం మీడియాకు తెలియజేశారు. రైతులంతా కలిసి వచ్చి జేసిబి సాయంతో ఆక్రమిత బోదెను తొలగిస్తామని తహసీల్దార్ శుక్రవారం తమకు చెప్పడంతో వీఆర్వో, సర్వేయర్ సమక్షంలో తామంతా బోదె వద్దకు వచ్చామన్నారు. బోదెను ఆక్రమించిన సదరు రైతు కొంత సమయం అడిగారన్నారు. ఇప్పటికైనా అధికారులు వరిసాగు చేసే రైతులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ముంపునకు గురైన వరిచేలను మరలా సాగులోకి తీసుకొచ్చేందుకు పరిష్కారం మార్గం చూపాలని కోరుతున్నామన్నారు. ఆక్రమించి పూడ్చివేసిన పంటబోదేను తవ్వించాలని కోరారు. అధికారులు త్వరితగతిన రెండు రోజుల్లో ముంపునీరు దిగేందుకు పరిష్కారం చూపకపోతే ఈ సమస్యను మరొకసారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ .వెంకటపతి రాజు, ఎం మల్లేశ్వరరావు, పి నాగబాబు, ఎం శ్రీనివాసరావు, పరమట సత్యనారాయణ, మాగాపూ రామకృష్ణ, పోలిశెట్టి అమ్మిరాజు, ఎంవివి సత్యవేణి, అన్నంనీడి సుబ్బలక్ష్మి,దామిశెట్టి మహాలక్ష్మి,నల్లా చంద్రరావు, పి సత్యవతి, ఎన్ రామకృష్ణ, బి గోపాలకృష్ణ, ఉంగరాల వీర వేణి తదితరు రైతులు పాల్గొన్నారు.

# మోటార్ మెకానిక్ల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి..



**అంబాజీపేట,జూలై 3, (ప్రభాతవార్త):** మోటారు సైకిల్ మెకానిక్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు మెకానిక్ లు కోరారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్లో శ్రీ లక్ష్మి గణపతి మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మోటారు మెకానిక్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్చేసి మెకానిక్ లకు పంచారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ గాట్లెబ్ డైమ్లర్ 1885లో టూ వీలర్ను కనిపెట్టారని, ఆయనను స్మరించుకుంటూ ప్రతీ ఏడాది బైక్ మెకానిక్స్ గా జరుపుకుంటున్నామన్నారు. మెకానిక్లంతా యూనియన్ బలోపేతానికి కృషి చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు మెకానిక్లు, వాటర్ సర్వీసింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# వైసీపీ నుండి టీడీపీ బిజెపిలోకి చేరికలు.



**అనపర్తి జూలై 3 (ప్రభాతవార్త)** అనపర్తి మండలం రామవరం లో ఇద్దరు వైసీపీ నాయకులు టీడీపీ బిజెపిలోకి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి .యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సమక్షంలో సబ్బెళ్ళ అమ్మిరెడ్డి బిజెపి లోకి. సొసైటీ మాజీ సభ్యులు గొలుగూరి వెంకట రమణారెడ్డి టీడీపీ లోకి చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రామవరం.కుతుకులూరు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భారీ వృక్షాలతో కొర్లపాటివారిపాలెంలో పొంచి ఉన్న ప్రమాదం..

## -గృహ నిర్మాణ శాఖ కార్యాలయంపై పడిన భారీ కొమ్మ..



**అంబాజీపేట,జూలై 3, (ప్రభాతవార్త):** మొక్కలు నాటండి.. స్వచ్ఛమైన గాలిని పీల్చండి.. నేటి మొక్కలే.. రేపటి వృక్షాలు.. వృక్షాలే ప్రకృతికి జీవనాధారం.. అంటూ ప్రసారాలు గుప్పిస్తున్న ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు జీవకోటికి ప్రమాదభరితంగా మారుతున్న భారీ వృక్షాలను తొలగించాల్సిన బాధ్యత కూడా ఉండాలని ప్రజలు అంటున్నారు. ముఖ్య కూడలిలలోను, నివాసగృహాల సమీపంలోనూ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో కూలడానికి సిద్ధంగా ఉన్న భారీ వృక్షాలను తొలగించి ప్రాణ,ఆస్తి నష్టాలను కాపాడాలంటున్నారు. ఎటువంటి ఉరుము-మెరుపు, గాలి-వాన లేకుండానేకొర్లపాటివారిపాలెంలో ఉన్న గృహ నిర్మాణ శాఖ కార్యాలయంపై శుక్రవారం ఉదయం నిద్ర గన్నేరు వృక్షం భారీ కొమ్మ పడింది.దీంతో కార్యాలయ భవనం పాక్షికంగా దెబ్బతింది. కార్యాలయ భవనంపై ఉన్న భారీ కొమ్మను తొలగించే సమయంలో భవనం పూర్తిగా దెబ్బతింటుందని స్థానికులు తెలిపారు.ఉదయం ఏడు గంటల సమయంలో వర్షం గాని, బలమైన గాలులు లేని సమయంలో చెట్టుకొమ్మ పడడం రాబోయే ప్రమాదాన్ని సూచిస్తుందని,ఉదయం సమయం కావడంతో హౌసింగ్ కార్యాలయం తెరవకపోవడంతో ప్రమాదం తప్పిందంటున్నారు.అలాగే కొర్లపాటివారిపాలెంలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయంతో పాటు స్త్రీ శక్తి భవనం, గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్, కాపు సామాజిక భవనం, రైతు సేవా కేంద్రం భవనాలు,నివాస గృహాలతో పాటు శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం ఉన్నాయి.వీటికి సమీపంలోనే నిద్ర గన్నేరు భారీ చెట్లు (సుమారు వంద సంవత్సరాలు వయసు) అటు ఇటు ఒరిగి నేల వైపు చూస్తూ కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. డ్వాక్రా మహిళలు, ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈ వృక్షాల క్రిందే సమయం కోసం వేసి ఉంటారు.ఏ సమయంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందితో పాటు స్థానిక నివాసితులు, కొర్లపాటివారిపాలెం గ్రామప్రజలు భయపడుతున్నారు.కొర్లపాటివారిపాలెంనకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాదిమంది ప్రజలు,పలు వాహనాలు నిరంతరం పగలు-రాత్రి తిరుగుతూ ఉంటాయి. కోరడానికి సిద్ధంగా ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని చాలా సంవత్సరాల నుండి స్థానిక ప్రజలు కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ఉరుకులు పరుగులు మీద వచ్చి హడావిడి చేసే అధికారులు, ప్రమాదం జరగక ముందే తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చని స్థానిక ప్రజలు అంటున్నారు. పంచాయితీ,రెవెన్యూ,అటవీ శాఖల అధికారులు సమన్వయంతో చర్చించుకుని ప్రమాదభరితంగా మారిన భారీ వృక్షాలను తొలగించాలని కోరుతున్నారు. గతంలో పలుమార్లు భారీ వృక్షాలను పరిశీలించి వెళ్లిన అధికారులు సమస్యకు పరిష్కారం చూపలేదని, ఇప్పుడు కూడా పరిష్కారం చూపకపోతేఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరతామని కొర్లపాటివారిపాలెం గ్రామస్తులు అంటున్నారు.

# నగరం నూతన ఎస్ఐ గా పద్మారావు బాధ్యతలు



**మామిడికుదురు.జూలై 03(ప్రభాతవార్త)** మామిడికుదురు మండలం నగరం పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా ఎ.పద్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన చైతన్యకుమార్ అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని పద్మారావు పేర్కొన్నారు.నేరాల నియంత్రణతో పాటు మండలంలోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ కి పలువురు అభినందనలు తెలిపారు.

# మామిడికుదురులో సీఆర్ఎంటీల ఆందోళన



**మామిడికుదురు.జూలై 03(ప్రభాతవార్త)** ఏలూరు జిల్లాలో సీఆర్ఎంటీ లకు పరువు నష్టం నోటీసులు జారీ చేయడంపై మామిడికుదురులో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల జె ఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద సీఆర్ఎంటీ లు నిరసన తెలిపారు. అక్రమ బదిలీలపై గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఫిర్యాదు చేయడాన్ని అవమానంగా భావించడం దారుణం అన్నారు.ఇది రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనకు విరుద్ధమని వాపోయారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బత్తుల శ్రీనివాస్,సిరా మణికుమార్,మండల జె ఏసీ నాయకులు నైనాల రాజేంద్రప్రసాద్,యెరుబండి మధు,నాసర్ మహెది,గాలిదేవర రామకృష్ణ,భీమాల సరస్వతి,కొమ్మిరెడ్డి సూర్యనాగలక్ష్మి,పోతుల జయ ప్రకాష్,లక్కింశెట్టి శ్రీనివాస్,కటకంశెట్టి కృష్ణాజీ పాల్గొన్నారు.

# ఇందుకూరుపేటలో వాహనాల తనిఖీ చేసిన. దేవి పట్నం ఎస్సై షరీఫ్



**దేవీపట్నం, జూలై 3 ప్రభాతవార్త:** దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందుకూరుపేట గ్రామంలో ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం, అతివేగంగా వాహనాలు నడపరాదని సూచించారు. మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలాన్లు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

# నేడు, రేపు కూడా జనసేన సమాచార సేకరణ ప్రక్రియ కొనసాగింపు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 3,ప్రభాతవార్త.** అమలాపురం పార్లమెంటు పరిధిలో జనసేన సారధుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రశంసనీయం. దీంతో దరఖాస్తుదారుల నుండి వచ్చిన అభ్యర్థనలను పరిశీలించిన తర్వాత జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమాచార సేకరణ ప్రక్రియను జులై 5 తేదీ ఆదివారం సాయంత్రం వరకు పొడిగిస్తూ నిర్ణయించారు.అలానే ఈ రెండు రోజులు కూడా ఈ ప్రక్రియను స్థానిక సత్యనారాయణ గార్డెన్స్ నందు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియచేశారు. కావున జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియను అమలాపురం పార్లమెంటు పరిధిలో ఉన్న 7 నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు,అమలాపురం పార్లమెంటు పరిశీలకులు
పంచకర్ల రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ నృసింహుని ఆలయంలో దర్శనం సమయం పెంపు...



**సఖినేటిపల్లి జూలై 3, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానము నందు భక్తుల సౌకర్యార్ధము రాత్రి వేళల యందు దర్శనమునకు ఎక్కువ సమయము ఏర్పాటు చేయుటకు గాను రాత్రి అంతరాలయ దర్శనము టిక్కెట్లు రాత్రి గం.7.00ల వరకు జారీ చేయబడునని, ప్రస్తుతము ఉన్న సమయమును గం.6.00 ని.ల నుండి గం.7.00 ల వరకు పొడిగించడమైనదని, ఉచిత దర్శనము రాత్రి గం. 7.30 ని.ల వరకు కల్పించబడునని, కావున భక్తులు గమనించి సమయాన్ని వినియోగించు కొనవలసినదిగా తెలియజేసినారు. రాత్రి గం.7.20లకు పవళింపు సేవ కార్య క్రమము నిర్వహించబడునని అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి నాగవర ప్రసాదు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్యులు రామ రంగాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆగని అభివృద్ధి సంక్షేమం.


## - సుపరి పాలనకు రెండేళ్లు.-ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని, ఎంపీపీ ఎలుగుబంటి.



**కడియం, జులై 3 (ప్రభాతవార్త)** కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా కడియం శ్రీ గిరజాల కృష్ణ ప్రసాద్ కళ్యాణ మండపంలో 2 ఏళ్ళ నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు వెలుగుబంటి నాని, బిజెపి అధ్యక్షుడు బొరుసు సుబ్రమణ్యం, జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమ్మి పాల్గొన్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో కడియం మండలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ గత రెండేళ్ల కూటమి పాలన రాష్ట్ర చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వందకు వంద శాతం నిలబెట్టుకుంటూ 'అభివృద్ధి - సంక్షేమం' రెండు కళ్లుగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాడు కూలిపోయిన వ్యవస్థలను బాగు చేస్తూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, నవ్యాంధ్ర శిల్పి నారా చంద్రబాబు నాయుడు అపార అనుభవం, విజనరీ నాయకత్వంలో ఏపీ మళ్లీ బ్రాండ్ ఇమేజ్ను సొంతం చేసుకుందని, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తూనే, సంపద సృష్టి వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జమ్మి మాట్లాడుతూ కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత అందరికీ ఆదర్శమని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థలకు ఆయన కొత్త ఊపిరి పోశారని పల్లెల ప్రగతి కోసం, ఉపాధి హామీ పథకం సమర్థవంతమైన అమలు కోసం ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు విప్లవాత్మకమైనవని ప్రజల పక్షాన నిలిచే ఆయన తత్వం కూటమి ప్రభుత్వానికి కొండంత బలాన్ని ఇస్తోందని అన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు వెలుగుబంటి నాని మాట్లాడుతూ యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురావడంలో చూపిస్తున్న వేగం అద్భుతమని, యువతకు పెద్దపీట వేస్తూ మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. నిబంధనల ప్రకారం సుపరిపాలన అందిస్తూ, యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా లోకేష్ ముందుకు సాగుతున్నారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లనే ఏపీకి ఈరోజు ఈ స్థాయి నిధులు రావడం సాధ్యమైందని పేర్కొన్నారు. మండల బిజెపి అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, జాతీయ రహదారుల విస్తరణకు వేల కోట్ల నిధులు కేటాయించి పెద్దపీట వేశారని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో హైవేల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ రెండేళ్ల కాలంలో కడియం మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూటమి నాయకులు గణాంకాలతో సహా వివరించారు. పేదల గృహనిర్మాణ పథకాలు, రెవెన్యూ సంస్కరణలు, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ వంటి అంశాలలో సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో బోడపాటి గోపి, వట్టికూటి వెంకటరమణ, నాగిరెడ్డి రామకృష్ణ, తోరటి శ్రీను, తామెల్ల అయ్యప్ప, జెల్లి కృపారావు, చిక్కాల శ్రీను, దాసరి ముత్యం, తాళబత్తుల భవాని శంకర్ తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి శ్రవణ నక్షత్ర మాస కళ్యాణ మహోత్సవం

**ఆత్రేయపురం, జూలై 03,(ప్రభాత వార్త)**





ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయంలో శుక్రవారం శ్రావణ నక్షత్ర మాస కల్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కంకణధారణ, మాధోపక్షాలన, కన్యాదానం, మధుపర్కప్రాశన, సూత్రధారణ, యజ్ఞోపవేతధారణ, తలంబ్రాలు, క్రతువును పండితులు కనుల పండువగా నిర్వహించారు. సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు లు స్వామి వారికి అమ్మ వాళ్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ స్వామి వారి అమ్మవార్ల కళ్యాణం ఉత్సవం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీ స్వామి వారి తదుపరి మాస కళ్యాణం జులై నెల 30. తేదీన నిర్వహించనున్నారు. కావున భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారిమాస కళ్యాణంలో పాల్గొవాలని. కావున 34733 99113 నెంబర్ కు సంప్ర దించి ఆన్లైన్ ద్వారా రుసుం రూ.750/- లు చెల్లించి పూజనందు పాల్గొవాలని. కళ్యాణానికి రానివారికి ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని ఆలయ కార్యనిర్వాహ ణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, తెలిపారు. అలాగే ఆత్రేయపురం లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో శ్రావణ నక్షత్ర మాస కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ తేజ దీక్షితులు, సాయి పవన్, రవికృష్ణ నేతృత్వంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి అమ్మవార్లకు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని గాదిరాజు వెంకట కృష్ణంరాజు, రాధా దంపతులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయం మేనేజర్ వినయ్ కుమార్ రాజు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# దుర్గానగర్ లో త్రాగునీటి సమస్య పరిష్కారం



**రాజవొమ్మంగి, జూలై 03, ప్రభాతవార్త** చికిలింత పంచాయితీ దుర్గానగర్ గ్రామంలో త్రాగునీటి పథకం మోటార్ పని చేయక పోవడంతో త్రాగు నీటి సమస్య ఏర్పడింది. శుక్రవారం స్థానికులుతో కలిసి కొత్త మోటార్ వేయడం జరిగిందని పంచాయితీ అభివృద్ధి అధికారి బచ్చల వెంకటేష్ తెలిపారు. 70 కొళాయిలు పరిధిలో కుటుంబాలకు త్రాగునీటి సమస్య తీరింది. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ, పీసా ఉపాధ్యక్షులు పొత్తూరి రాంబాబు, పాండవుల భీమరాజు, దుంగా నాగు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



కడియం, జూలై 3 (ప్రభాతవార్త):కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో సౌత్ జోన్ ఈగల్ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ భద్రత, మహిళలు--బాలికల రక్షణ, చట్టాలపై అవగాహన కల్పించే ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఎలా వినియోగించాలి, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి వంటి అంశాలను వివరించారు. అలాగే అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఈగల్ బృందం సభ్యులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని సౌత్ జోన్ ఈగల్ బృందానికి చెందిన ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, పోలీస్ కానిస్టేబుల్ రామ్ కుమార్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సుమారు 70 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురైన వృద్ధురాలు



తాళ్లరేవు, జూలై 3 (ప్రభాత వార్త): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు మార్కెట్ వీధికి చెందిన వృద్ధురాలు బొద్దు మహాలక్ష్మి శుక్రవారం పాము కాటుకి గురైంది. ఇంటి వద్ద కట్టెపుల్లలు కొట్టు చేయడంతో ఆమెను స్థానిక స్థానిక నాయకులు వెంటనే చిరంజీవి సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయినవారు పట్టించుకోకపోవడంతో స్థానికుల సహాయంతో ఆమె జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు పాముకాటుకి గురవడంతో ఆమెను పెద్ద మనస్సుతో దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మండలస్థాయి అధికారులు లేరని టిడిపి వాకౌట్

### - యధావిధిగా సాగిన మండలపరిషత్ సర్వసభ్య సమావేశం



రాజవొమ్మంగి, జూలై 03. ప్రభాతవార్త రాజవొమ్మంగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ప్రారంభమైంది. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు ఎందుకు హాజరు కాలేదని లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు ఎంపిడిఓ ఎల్. యాదగిరేశ్వరరావును ప్రశ్నించారు. బి. ఎల్ ఓ విధులు అధికారులకు కాదని దూసరపాము ఎంపిటిసి నల్ల సత్తిబాబు అన్నారు. పంచాయితీ ప్రత్యేక అధికారులు ఎవరో ప్రజాప్రతినిధులకు తెలియాలి కదా అని ఏ. ఎం. సి చైర్మన్ లోతా లక్ష్మణ రావు అన్నారు. 90 రోజులకు సర్వసభ్య సమావేశం తప్పనిసరి అని సహకరించాలని ఎంపిపి వెంకటలక్ష్మి, ఎంపిడిఓ యాదగిరేశ్వరరావు టిడిపి ప్రజాప్రతినిధులను కోరారు. ఉపయోగం లేని సమావేశం ఎందుకని ఎంపిటిసిలు పెద్దిరాజు, సత్తిబాబు, ఏ. ఎం. సి చైర్మన్ లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్ వాకౌట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. జడ్పిటిసి పి. హెచ్. సి సిబ్బంది డా. పావని వివరించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ అర్హులు కోసం నిర్వహిస్తున్న గ్రామసభల వివరాలను వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న పథకాలు, మిషన్ వాత్సల్య, బాల్య వివాహాల నిర్మూలనపై సూపర్ వైజర్ వీరయ్యమ్మ తెలియజేసారు. జి. రామ్. జి ఉపాధి నూతన పథకంలో 125 రోజులు పని దినాలు కల్పన, జలధార పనులను ఏ. పి. ఓ. శ్రీనివాస్ వివరించారు. వ్యవసాయ శాఖ ఏ. ఈ. ఓ. దుర్గాభవాని పార్మర్ రిజిస్ట్రేషన్, రైతు యాప్, వరి విత్తనాల మొలకశాతం పరీక్షల అనంతరం పంపిణీపై తెలిపారు. సమగ్ర భూసర్వే పై డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా వివరించారు. నూతనంగా విధుల్లోకి చేరిన ఏ. పి. ఎం. మర్రి లక్ష్మి పరిచయ కార్యక్రమం సాగింది. ఈసమావేశంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి లు జర్తా రాజేశ్వరి, సప్పా సత్యంచ్రదరావు, ఎంపిటిసి లు కాసం అచ్చియ్యమ్మ, సుందర లోవలక్ష్మి, కనిగిరి గంగులు, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, డా. పావని, జి. సి. సి అకౌంటెంట్ ధళ్లే మాతయ్యమ్మ, సి. హెచ్. ఓ. పద్మావతి, ఎం. ఈ. ఓ. 2 సూర్యారెడ్డి, సూపర్ వైజర్ వీరయ్యమ్మ, ఏ. పి. ఎం. లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రొయ్యల చెరువులతో వరి రైతుకు నష్టం

### ఫిషరీస్ ఇన్స్పెక్టర్ ఎం. విజయ



అయినవిల్లి జూలై 3 ప్రభాతవార్త: నేదునూరు కుమ్మరి కాలువను ఆనుకుని తవ్విన రొయ్యల చెరువుల కారణంగా ఈ ప్రాంతంలో 400 ఎకరాల వరకు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఫిషరీస్ ఇన్స్పెక్టర్ ఎం విజయ తెలిపారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ కు ఇచ్చిన రైతుల ఫిర్యాదు మేరకు ఆమె శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు 400 ఎకరాల వరి పంటకు నష్టం సంభవిస్తుందని ఆమె గుర్తించారు. ఇక్కడ వరి పండించే రైతుల ఆందోళనను ఆమె చేసుకున్నారు. సమర్పించిన నివేదిక కలెక్టర్కు సమర్పిస్తానని ఆమె తెలిపారు. కొంతకాలంగా వరి పండించే రైతులు అభ్యంతరాలు తెలియపరిచినప్పటికీ కొందరు స్వార్థపర రైతులు రొయ్యల చెరువు తవ్వకాలను పూర్తి చేశారు కేవలం అనుమతి లేని రైతులు కూడా చెరువులను తవ్వుతున్నారు అయితే చప్పనీటి చేపల చెరువుల అనుమతితో ఉప్పునీటి బోర్లు వేసి రొయ్యల చెరువు తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు రైతులు గుర్తించారు. స్వయంగా ఈ ప్రాంతాన్ని జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ లోవరాజు రైతులు పాల్గొన్నారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీతానగరం, జూలై 03, (ప్రభాతవార్త): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలసి పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపులను స్విచ్ ఆన్‌చేసి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతానగరం, కోరుకొండ మండలాల్లో సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తొర్రిగడ్డ చైర్మన్ వేగి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీమందపాటి జగపతి రాజు, కోనే శ్రీను, అడపా శ్రీనివాస్, మట్ట వెంకటేశ్వరరావు, గద్దే వెంకటకృష్ణ చౌదరి, గెద్దం తిమ్మారావు, కారిచర్ల విజయ శంకర్, కాండ్రు శేఖర్, ఓబిలినేని కృష్ణ చైతన్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వర్షపాత నమోదు కేంద్రాన్ని తనిఖీ చేసిన అప్పలకొండ



గోపాలపురం జూలై 03, ప్రభాతవార్త:గోపాలపురం మండలంలో వర్షపాత నమోదుకు ఏర్పాటు చేసిన రేయిన్ గేజ్‌లను జిల్లా ప్లానింగ్ అధికారి, జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ శుక్రవారం తనిఖీ చేశారు. వర్షాకాలంలో నమోదవుతున్న వర్షపాత వివరాలు, రేయిన్ గేజ్‌ల పనితీరు, నిర్వహణ విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ.. వర్షపాత నమోదు విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. రేయిన్ గేజ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసే సమయంలో వర్షపాతాన్ని ఖచ్చితంగా కొలిచి, అవసరమైన సమయంలో గంట గంటకు ఉన్నతాధికారులకు సమాచారం అందించేలా సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ మహాలక్ష్మి మండలంలో వర్షపాత నమోదు విధానం, తీసుకుంటున్న చర్యలను వివరించారు. రేయిన్ గేజ్ ఇన్‌చార్జి, ఏఎస్‌వో జోడాల వెంకట్ మాట్లాడుతూ కార్యాలయం వద్ద రెవెన్యూ రేయిన్ గేజ్‌తో పాటు ఆటోమేటిక్ రేయిన్ గేజ్ కూడా పనిచేస్తోందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలలోపు వర్షపాతాన్ని నమోదు చేసి డివిజన్, జిల్లా కేంద్రాలకు నివేదికలు పంపుతున్నట్లు చెప్పారు. తనిఖీల్లో కార్యాలయ సిబ్బంది గణేష్, మనోహర్, సుభాష్ పాల్గొన్నారు.



# 6న కుక్కలకి ఉచిత రేబీస్ టీకాలు

### -పశు సంవర్ధక సహాయ సంచాలకులు డా.ఎల్. విజయారెడ్డి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై3.ప్రభాతవార్త. జంతువుల నుండి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 6వ తేదీ ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం పశు సంవర్ధక సహాయ సంచాలకులు డా.ఎల్. విజయారెడ్డి తెలిపారు. ప్రపంచంలో సుమారు 280 రకాల జూనోటిక్ వ్యాధులు ఉన్నాయి. రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, బర్డ్ ఫ్లూ, క్షయ,మెదడు వాపు వ్యాధి వంటివి ప్రమాదకరమైనవని డా విజయారెడ్డి వివరించారు. 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ మొదటి రేబిస్ టీకా వేయడంతో ఈ రోజును ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. అమలాపురం, అల్లవరం పరిధిలోని అన్ని పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల ద్వారా పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు పశువులకు గాలికుంటు, నెరుడు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం చేపట్టనున్నారు. పాడి రైతులు, మటన్ షాపుల యజమానులు, పౌల్ట్రీ రైతులకు జూనోటిక్ వ్యాధుల నియంత్రణపై సదస్సులు,కరపత్రాల పంపిణీ చేస్తున్నామన్నారు. పశు సంవర్ధక,వైద్య ఆరోగ్య, పంచాయతీ శాఖల సమన్వయంతో విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కుక్క కాటు వేసిన వెంటనే గాయాన్ని సబ్బు నీటితో 15 నిమిషాలు కడిగి, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవా లని పెంపుడు కుక్కలకు ఏటా టీకాలు తప్పనిసరన్నారు. బ్రూసెల్లోసిస్, క్షయ వంటి వ్యాధులు పచ్చి పాల ద్వారా సోకుతాయి. పాలను మరిగించి మాత్రమే తాగాలని కల్తీ పాలపై అనుమానం వస్తే 1967టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని డాక్టర్ విజయారెడ్డి తెలిపారు. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచి దోమలు, ఎలుకలు లేకుండా చూడాలి. వ్యాధి సోకిన పశువులను తాకరాదు. జూనోటిక్ వ్యాధుల నియంత్రణ కేవలం పశు వైద్యుల బాధ్యత కాదు,ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఈ వ్యాధులను నివారించగలం” అని డా. విజయారెడ్డి పిలుపు నిచ్చారు. అనుమానం ఉన్న పక్షంలో దగ్గరలోని పశు వైద్యశాలలను లేదా రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

## అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ సేవలో కోడుమూరు ఎమ్మెల్యే....



సఖినేటిపల్లి జూలై 3. ప్రభాత వార్త: అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చక స్వాములు స్వాగతం పలికి, పూజలు చేసినారు. వేద పండితుల చే వేదాశీర్వాదం అందించి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నాగవర ప్రసాదు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు ఏ. పి. ఎం. గా విధుల్లోకి చేరిన లక్ష్మి



రాజవొమ్మంగి, జూలై 03. ప్రభాతవార్త రాజవొమ్మంగి మండల వెలుగు ఏ. పి. ఎం గా మర్రి లక్ష్మి శుక్రవారం విధుల్లోకి చేరారు. ఇప్పటి వరకూ పని చేసే ఏ. పి. ఎం మధు రంపచో డవరం వెళ్లారు. తాను శ్రీకాకుళం నుండి బదిలీపై వచ్చినట్లు లక్ష్మి తెలిపారు. వెలుగు సిబ్బంది నూతన ఏ. పి ఎం ను కలిసి పరిచయం చేసుకొన్నారు. ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావులను ఏ. పి. ఎం. లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. నెల రోజులు వ్యవదిలో రాజవొమ్మంగి మండలం నుండి ముగ్గురు ఏ. పి. ఎంలు మారారు. ఈకార్యక్రమంలో సి. సి. లు రామకృష్ణ, చిలకమ్మ, సూర్యనారాయణ, సింహాచలం, సిబ్బంది శేఖర్ బాబు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రత్యేక అధికారి



గోపాలపురం జులై 03, (ప్రభాతవార్త):గోపాలపురం మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, తహసీల్దార్ మహాలక్ష్మి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భీమోలు, గుడ్డిగూడెంలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లను సందర్శించి, బీఎల్ఓలు చేపడుతున్న ఇంటింటి సర్వే, డిక్లరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ తదితర ప్రక్రియలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రతి ఓటరికి సమాచారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఇంటింటికి వెళ్లి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, డ్వాక్రా వీఓఏలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు బీఎల్ఓలకు సహాయకులుగా పనిచేసి కార్యక్రమాన్ని వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసి, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం మండల బీఎల్ఓ సూపర్వైజర్, సీనియర్ అసిస్టెంట్ నల్లరాజు, జూనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## వాడపల్లి 'వెంకన్న'ను దర్శించుకున్న విద్యుత్తు శాఖ ఎస్పీ



ఆత్రేయపురం.03.(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని విద్యుత్తు శాఖ ఎస్ పి . కె ఎన్ రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులతో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .శ్రీ స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

# ప్రజల వద్దకే అధికారులు

### బొడ్డగండి, చాపరాయి మారుమూల గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్




మారేడుమిల్లి,జూలై 3 : ప్రభాతవార్త. గుర్తేడు మండలంలోని బొడ్డగండి పంచాయితీలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుర్తేడు మండలం బొడ్డ గండి గ్రామంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి, ఒక నెల ఒక నియోజకవర్గం– నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ “ ఒక నెల ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు” కార్యక్రమంలో భాగంగా గుర్తేడు మండలము బొడ్డగండి గ్రామంలో “ “ ఒక నెల – ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు “ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పంచాయితీ పరిధిలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు దిశ నిర్దేశము ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గొంది కోట గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేయుచున్న చెరువును జిల్లా కలెక్టర్ చాపరాయి గ్రామ సమీపంలోని ఏర్పాటు చేయుచున్న వంతెనను పరిశీలించి చాపరాయి గ్రామంలోని గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అయినటువంటి వివిధ రకాలైన సామాజిక ఎన్టీఆర్ భరోసా పించను, ప్రతి నెల రేషన్ సకాలంలో అందుచున్నది లేనిది ఆరా తీశారు. రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఒక నెల – ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు పోలవరం జిల్లా లో ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న పథకాలు లబ్ధిదారులకు చేరవేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగం ఎక్కడికక్కడ చర్యలు చేపట్టడం జరిగిందని ఆమె అన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, అన్న క్యాంటీన్,దీపం-2 పథకం, ప్రతినెల వివిధ రకాలైన పింఛన్లు, తల్లికి వందనం, ప్రతినెల రేషన్ పంపిణీ, ఈ ప్రాంత రైతులకు వివిధ రకాలైన విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టడం జరిగిందని ఆమె అన్నారు. ప్రజల సమస్యలను గ్రామస్థాయిలో గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. మన కొత్త జిల్లా మన నూతన గుర్తేడు మండలం అంచలంచలుగా అభివృద్ధి చేసుకొనుటకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

## మరో లిమ్కా రికార్డు పుత్సా రాజేశ్వరి కైవసం



అమలాపురం కలెక్టరేట్, జూలై 3 ప్రభాతవార్తభూపయ్య అగ్రహారానికి చెందిన పుత్సా రాజేశ్వరి గతంలో లూయిస్ బ్రెయిలీ నాణేల సేకరణలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ పొందారు. తాజాగా లిమ్కా సంస్థ వచ్చే ఏడాది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ముద్రించడానికి దరఖాస్తులు స్వీకరించారు. దీనికి గాను పుత్సా రాజేశ్వరి రూ.5 ముఖవిలువ కలిగిన తపాలా బిళ్ళల సేకరణలో రికార్డుకు దరఖాస్తు చేశారు. గతంలో ఈ రికార్డు 603 తపాలా బిళ్ళలతో ఉండగా, రాజేశ్వరి 1004 తపాలా బిళ్ళలతో ఆ రికార్డును అధిగమించి సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఈ విషయాన్ని ఈ మెయిల్ ద్వారా లిమ్కా బుక్ సంస్థ తెలియజేసినట్లు ఆమె తెలిపారు. వచ్చే ఏడాది విడుదలయ్యే లిమ్కా బుక్ లో ఈ రికార్డ్ నమోదు అవుతుందని ఆమె తెలిపారు. వాకర్స్ జోన్ ఛైర్పర్సన్ పుత్సా రాజేశ్వరి వరుసగా రెండోసారి లిమ్కా రికార్డ్ పొందడం పట్ల మహిళా వాకర్స్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, జిల్లా ఉప గవర్నర్ జల్లి సుజాత, మాజీ అధ్యక్షులు పేరి లలిత, శిష్టా లక్ష్మి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, భమిడిపాటి పద్మావతి అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా విశ్వనట చక్రవర్తి ఎస్వీఆర్ జయంతోత్సవాలు



కాకినాడ రూరల్,జూలై 3 (ప్రభాతవార్త): విశ్వ నట చక్రవర్తి సామర్ల వెంకట రంగారావు 108వ జయంతి సందర్భంగా ఆంధ్ర కాపు సద్భావన సంఘం గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నాగమల్లి తోట జంక్షన్ లోఎస్వీ రంగారావు కాంశ్య విగ్రహానికిఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ , కుడా చైర్మన్ తలాటం సత్య, జడ్పిటిసి సభ్యుడు నూరుకుర్తి రామకృష్ణ , చంటి రెడ్డి పలువురు గజమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాతూ ప్రపంచం గర్వించ దగ్గ నటుడు ఎస్వీఆర్ అని ఆయనకు భారతరత్న ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. ఆయన నటించిన పౌరాణిక చిత్రాలలో నటన, అభినయం పాత్రలో జీవించడం వంటి విశేషాలు తెలుగు చలనచిత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన అగ్రగన్యులని కొనియాడారు. అనంతరం జడ్పిటిసి నురుకుర్తి రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక ఐదు బిల్డింగ్ సెంటర్లో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణను గుర్తు చేసుకుని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. జోహార్ ఎస్.వి.ఆర్ అంటూ నినాదాలు చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఈకార్యక్రమం లో నేమం మాజీ సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు ( చిన్నా) , రావూరి వెంకటేశ్వరరావు, సిద్ధ శివాజీ, అనసూరి ప్రభాకర్, కొప్పిశెట్టి శివ,భువనేశ్వరి ఆంధ్రా కాపు సద్భావన సంఘం ఉపాధ్యక్షుడు ముమ్మిడి సత్యనారాయణ, జే. రంగనాయకులు,కోన ఉమేష్, దొడ్డిపట్లఅప్పారావు, చంటి రెడ్డి, కొప్పిశెట్టి శ్రీను, సానా శ్రీను, మాధవరపు సత్యనారాయణ, రామకృష్ణ,రెడ్నం రాజా , పుల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే సత్యప్రభ

### -ప్రత్తిపాడులో విజయవంతంగా 'ఒక నెల - ఒక గ్రామం' కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే సత్య ప్రభ-పీజీఆర్ఎస్ వేదికగా 68 అర్జీల స్వీకరణ



ప్రత్తిపాడు: జులై 3 (ప్రభాతవార్త) గ్రామస్థాయిలో ఉన్న ప్రజల సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు” కార్యక్రమం ప్రత్తిపాడులో వరుసగా నాలుగో వారం విజయవంతంగా కొనసాగింది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, ఆర్డీవో పి.కృష్ణమూర్తిలతో కలిసి వారు నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, సధరం సర్టిఫికెట్లు, భూ రికార్డుల ఆన్‌లైన్ నమోదు, పంట నష్టం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సమస్యలపై ప్రజల నుండి మొత్తం 68 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా గత మూడు వారాల్లో నమోదైన అర్జీల పరిష్కార పురోగతిపై కలెక్టర్ శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్థానిక సమస్యలను నేరుగా అధికారుల సమక్షంలో తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. నేడు వచ్చిన 68 అర్జీలతో పాటు, గత మూడు వారాల్లో 305, గత నెలలో మొత్తం 374 అర్జీలు వచ్చాయని వివరించారు. వీటిలో ప్రధానంగా పెన్షన్లు, భూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. వచ్చిన ప్రతి వినతిపై రాబోయే 15 రోజుల్లోగా సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. గతంలో నిలిచిపోయిన పెన్షన్లను పునరుద్ధరించేలా తనిఖీలు చేపట్టాలన్నారు.భూ సమస్యల విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా రీ-సర్వే సమయంలో భూ విస్తీర్ణంలో వస్తున్న వ్యత్యాసాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. వివాదాస్పద ప్రాంతాలకు సర్వేయర్లను పంపి, రైతుల సమక్షంలోనే భూములను కొలిపించి, వాస్తవాలను నిర్ధారించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఏ.శ్రీనివాసరావు, తహసీల్దార్ సూర్య ప్రభ, ఎంపీడీవో కుమార్ బాబు, డిఎల్డీవో శ్యామల, డిఎల్పిఓ బాలమణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంతి, ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, డివిజన్, మండల స్థాయి అధికారులు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మిర్తిపాడులో పాసుపుస్తకాల పంపిణీ

సీతానగరం, జూలై 03, (ప్రభాతవార్త) :మండలంలోని మిర్తిపాడు గ్రామంలో శనివారం రాజముద్ర పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ అంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సచివాలయం వద్ద జరిగే కార్యక్రమంలో రైతులు తమ వద్ద ఉన్న పాత పాసుపుస్తకాలను స్వాధీనపరచి, రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను తీసుకొనుటకు హాజరుకావాలని కోరారు.




## డెంగ్యూ మహమ్మారి ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.. -ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు: జులై 3(ప్రభాతవార్త): నియోజకవర్గంలో డెంగ్యూ మహమ్మారి ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల (జూలై 1 – 31) సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు ఎంపిడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో డెంగ్యూపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు నిర్వహించి సకాలంలో చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి కృష్ణమూర్తి, ఎంపిడీవో కుమార్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంతి, రాచపల్లి పెద్దిపాలెం శాంతి ఆశ్రమం పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ గీతా సుధ, డాక్టర్ యశస్వి, డాక్టర్ రాంకుమార్, సిహెచ్సి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కూనవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సిసిఎస్ పర్యటన



కూనవరం, జులై 3, ప్రభాతవార్త: కూనవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను రాజమండ్రి చీఫ్ కన్జర్వేటర్ ( సిసిఎస్) జ్యోతి శుక్రవారం రోజున పర్యటించారు. ముందుగా మురుమూరు సెక్షన్ పరిధిలో పర్యటించి అత్యంత విలువైనటువంటి టేకు తదితర జాతుల కలపను నరికి చింతూరు టెంబర్ డిపోకు తరలించవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. పోలవరం ముంపు ప్రభావిత ప్రాంతాలలో గల రక్షిత అటవీ ప్రాంతాలను ఆమె సందర్శించారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన పనులను పర్యవేక్షించి తనిఖీ నిర్వహించారు. తరువాత విఆర్ పురం నందు గల రేఖపల్లి టెంబర్ డిపో సందర్శనకు వెళ్లడం జరిగింది. ఈ పర్యటనలో ఆమె వెంట చింతూరు డివిజనల్ అటవీ శాఖాధికారి డి. రవీంద్రనాథ్, సబ్ డి ఎఫ్ ఓ రాఘవరావు, ఫారెస్ట్ ఆఫీసర్లు పివివిఎస్ఎన్ మూర్తి, రామకృష్ణ, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పనులు పూర్తయ్యాయి..శుభ్రతను విస్మరించారు



రామచంద్రపురం,జూలై 03(ప్రభాతవార్త): పైప్ లైన్ పనులు పూర్తయిన అనంతరం పరిసరాలను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిర్మాణ వ్యర్థాలు చెత్తను తొలగించకుండా వదిలేయడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని శివాలయం వెనుక ప్రాంతంతో పాటు పలు వీధుల్లో మున్సిపాలిటీ చేపట్టిన పైప్‌లైన్ పనులు పూర్తయినా,రోడ్లపై మట్టి, ఇసుకను తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పైప్‌లైన్ కోసం తవ్విన మట్టి,పూడ్చేందుకు వినియోగించిన ఇసుకను రోడ్డుపైనే వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అవి రోడ్డంతా విస్తరించి జారుడుగా మారాయి.దీంతో ద్విచక్ర వాహనదారులు,సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తరచూ జారి పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో మట్టి,ఇసుక కుప్పలు సరిగా కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని చెబుతున్నారు.పనులు పూర్తయి రోజులు గడుస్తున్నా రోడ్లను శుభ్రం చేయడంలో అధికారులు,కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.అభివృద్ధి పనులతో పాటు ప్రజల భద్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలని,రోడ్లపై ఉన్న మట్టి,ఇసుక దిబ్బలను వెంటనే తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## గొల్లప్రోలు బైపాస్ లో రోడ్డు ప్రమాదం

### నలుగురికి తీవ్ర గాయాలు



గొల్లప్రోలు, జూలై 3,(ప్రభాత వార్త) గొల్లప్రోలు బైపాస్ రోడ్డులోని బి. ప్రత్తిపాడు జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తొండంగి మండలం కోదాడ గ్రామానికి చెందిన కొంతమంది కాకినాడలో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా గొల్లప్రోలు బైపాస్ రోడ్డులోని ప్రత్తిపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ట్రాక్టర్ (బుల్) టర్నింగ్ తీసుకుంటూ ఆటోకు అడ్డం వచ్చింది.దీంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో బుల్ ని ఢీ కొట్టిన ఆటో తిరగబడి మూడు పల్టీలు కొట్టింది.దీంతో ఆటో నుజ్జు నుజ్జయింది.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బూర్తి ఇమాన్యుల్,బూర్తి రాణి,బూర్తి చంద్రమ్మ, సాలాది సిరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే హైవే మొబైల్ పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రహదారిపై పడి ఉన్న ఆటోను పక్కకు తొలగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## జిల్లా కార్యాలయాల నిర్మాణ పనులకు గ్రామసభ తీర్మానం



రంపచోడవరం జూలై 3 ప్రభాతవార్త. పోలవరం కొత్త జిల్లా కార్యాలయ నిర్మాణాలకు సంబంధించి అభివృద్ధి పనులకు గ్రామసభ తీర్మానాలు చేశారు. రంపచోడవరం గ్రామపంచాయతీలో శుక్రవారం ప్రత్యేక అధికారి వివి గిరిబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తీర్మానాలు చేసారు. ముఖ్యంగా నూతన పోలవరం జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, హెలిపాడ్ నిర్మాణాలకు సంబంధించి 51.37ఎకరాలు భూమిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి తీర్మానాలు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న ఐటీడీఏ ఇతర ప్రభుత్వ కార్యాలయాలతో సహా కొత్తగా 25 ఎకరాలు భూమి నిర్మాణ పనులకు గ్రామ సభ తీర్మానం చేశారు. గ్రామసభలో జిపిడిపి యాక్షన్ ప్లాన్ కు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామరాజు, వీఆర్వో శివ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎఇ, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps